UNIVERSAL LIBRARY
OU_204137
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T891.22 K14A Accession No. PG T747

Author కాళిదాసు.

Title అభిజ్ఞానశాకుంతలము. 1929.

This book should be returned on or before the date last marked below.

శ్రీరామ.

అభిజ్ఞాన శాకుంతలము.

శ్రీమతి విద్వత్కవితిలక

కాంచనపల్లి కనకాంబా

ప్రణీతము.

మొదటి కూర్పు

రంగనాయకుల తిరుమల జగన్నాథదాసు

ప్రకటితము.

ముద్రాక్షరశాల, బెజవాడ.

1929

సర్వస్వామ్యసంరక్షితము]

వెల 0-12-0
తపాలఖర్చులు ప్రత్యేకము.

శ్రీరామ.

తప్పొప్పుల పట్టిక.

పంక్తి	తప్పు	ఒప్పు
3	తెల్లగల్గు	తెల్లఁగల్గు
18	యధార్థము	యాథార్థ్యము.
4	దరుముచు	దఱుముచు
17	మింటిజను	మింటఁజను.
4	జాచి	జాఁచి
6	కేనిఁగడవఁ	కేనికడవఁ.
21	నాఁవుము	నాఁగుము
5	తపోవనము	దపోవనము.
19	మీాద	మీాఁద
13	చక్కదనము	చక్కఁదనము.
8	వంకజూచి	వంకఁజూచి
6	అక్లైనినార్యులు	అక్లైనియార్యులు
11	నాకేలకో	నాకేలాకో
13	గురించి	గుఱించి
29	నూరుకుండుము	నూఱకుండుము.
14	కామజన	కామిజన
24	కనబడుచున్నది	కనఁబడుచున్నది
29	వటిమఁ	బటిమఁ
12	టకుగాని^{2}	టకుఁగాసి^{2}
3	గాగ	గాఁగ
4	పా (యకు)	నా (యకు)
6	లందరు	లందఱు
24	మనగ	మనఁగ

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
16	24	బాఁలుర	బాలుర
16	25	కెమఱ	కెమర
19	29	మీారలీ	వీరలీ
20	5	పూాధవ్యుడు	మాఘవ్యుడు
20	20	మన్నుగాత	మున్నుగాక
22	18	నిర్గలంబార	నిర్మలంబౌగ
23	6	చేల	చీర
24	19, 21	మగుగాక 2,1	మగుఁగాక 2 1
25	2	ముఁగ	ముగ
26	5	వరకు; నేటికి	వఱకు; నేఁటికి
27	23	గలత	గఁలత
28	11	కొరకు	కొఱకు
28	24	పడతి	పడఁతి
29	20	మిట్ట	మట్ట
30	15, 17	విసురుచు	విసరుచు
30	19	గనబడు	గనఁబడు
31	5	బరిచయము	ఁబరిచయము
31	9	చికిత్సజేయ	చికిత్సఁజేయ
31	10	యనుసూయ	యనసూయ
31	14	చక్రగ	చక్రఁగ
31	29	డాగిన	డాఁగిన
33	11	కనకపుకంకణంబు	కనకపుఁగంకణం
33	14	దావి	దాఁచి
34	16	జాగరూకులమై	జాగరూకలమై
34	26	నిఁజగతి	నిజగతి
34	28	నముజేయ	నముఁజేయ
37	27	దాగి	దాఁగి
38	6	మీద	మీఁద

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
39	7	చూడగ	చూడఁగ
41	17	దుకు	దునకు
41	24	జారుట	జాఱుట
41	25	జారి	జాఱి
41	29	కొంత	గొంత
42	17	దన్నుదా	దన్నుఁతా
42	28	తెల్లవారి	తెల్లవాఱి
43	3	అనూర	అనూరు
3	19	దుర్వాస	దుర్వాసు
4	5	కేగిలిని	కేఁగిలిని
4	7	గాగలించు	గాఁగలించు
4	19	కొరకు	కొఱకు
5	14	దగ్గర	దగ్గఱ
5	16	వరకు	వఱకు
5	22	తక్కతక్కిన	తక్కఁదక్కిన
6	9	యెక్కడవి	యెక్కడివి.
9	18	కదా	గదా
0	7	నైనకంపు	నైనఁబంపు
1	2	యశ్వర్థ	యశ్వత్థ
4	2	మీకిట్లు	నిట్లు
6	2	నటే	నట్లే
6	23	ముందుకుజూచి	ముందుకుఁజూచి
8	17	నేచె	నేఁచె
8	18	బూతలు	బూఁతలు
9	5	కూడ	గూడ
9	14	నీకుఁజయము	నీకుజయము
	7	కావునఁగర్భవతి	కావునగర్భవతి
	9	కూడకొంత	గూడఁగొంత

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
68	9	కూడదు	గూడదు
63	15	పడతి	పడఁతి
63	24	జారి	జాతి
64	18	యుతలందగున	యుతలంపన
65	28	ఇక	ఇఁక
67	9	మీాకుబ్రథ	మీాకుఁబ్రథ
67	29	దొడగె	దొడఁగె
68	3	యువిదబైకి	యువిదఁబైకి
69	5	దెచ్చిన	దీసికొని
69	10	కాను	గాను
71	13	యేనుఁగమీాద	యేనుఁగుమీాఁద
73	4	నూతము	నూఁతము
75	29	జక్కగ	జక్కఁగ
76	2	పంపమని	పంపుమని
77	2	యమ్మై; చున్నదనుట	యమగుట; చున్నద [యనుట
77	24	పుచ్చజన నేగగ	పుచ్చఁజన నేగఁగ
78	6	స్పర్శింప	స్పృశింప
78	11	గొలది	గొలఁది
78	23	తాము	ఁదాము.
79	21	జారి	జాతి
81	10	జారి	జాతి
82	29	విడచి	విడిచి
83	14	దెలసి	దెలిసి
83	17	దరిశన	దర్శన
84	19	నవుడు	యవుడు
85	27	మునదక్క	మునఁదక్క
88	10	జేతపట్టుకొని	జేతఁబట్టుకొని

శ్రీ రామాయనమః.

అభిజ్ఞాన శాకుంతలము.

నాంది

ఉ. ఆదిమసృష్టి స్రష్టకది హవ్యము నెద్ది వహించు హోత్రియా
నెది యొనర్చుఁ గాలముల నేకవ విశ్వము నెల్ల నింపి శ్రు
త్యాదరణార్థ లక్షణము నొందెది * భూతములెల్ల గల్గు నెం
దేనిసజీవులట్టులెవయించును ప్రాణుల నా సుమూర్తు లి
ట్లెన్నగ దాల్చు నెన్మిదిటి నీశుఁ డతండొగి మిమ్ముఁ బ్రోచుతన్.

ప్రస్తావన.

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—(తెఱవంకఁజూచి) దేవీ! అలంకరణమైనచోఁ గొంచెమిటు రమ్ము.

నటి—(ప్రవేశించి) ఆర్యపుత్రా! ఇదె వచ్చితిని.

సూత్ర—దేవీ! ఈసభ పండితులతో నిండియున్నది. తొల్లి దేవభాషయందుఁ గాళిదాసమహాకవిచే రచియింపఁబడి నూతనముగ విద్వత్కవితిలక కాంచనపల్లి కనకాంబచే నాంధ్రీకరింపఁబడిన 'యభిజ్ఞానశాకుంతలం'బను నాటకమునుఁ బ్రదర్శించి మనమిపుడు వీరిని సంతోషపెట్టఁదగును. కావునఁ బాత్రలనందఱ నతిజాగరూకతతో నాయత్తపఱుపుము.

నటి—ప్రయోగకౌశలము గల్గుటంజేసి దేవర కేలోపము నుండదు.

సూత్ర—దేవీ! యథార్థము వచింతు.

కం. ఉత్తమమని యెంచనుగద
విత్తములలరక ప్రయోగవిజ్ఞానంబుల్
జిత్తము తనుఁదానమ్మట
యుత్తమశిక్షితుల కేని యుత్తది సుమ్మా.

---

* బీజములు.

నటి—ఆర్యపుత్రా! అదినిజమె. అనంతరకరణీయము దేవర సెలవిత్తురు గాక.

సూత్ర—ఈ సభవారి వీనులకు విందొనర్చుటకన్న వేఱొకటేమున్నది. కాన, మొన్న మొన్ననే వచ్చినదియు, భోగములకు యోగ్యమైనదియు నగు నీగ్రీష్మఋతువునుగూర్చియే గానముచేయుము. ఇప్పుడు

గీ. సుభగసలిలావగాహ సంశోభనములు
పాటలాసంగ సురభిళవనపవనము
లాతతచ్ఛాయ సులభనిద్రాగమములు
వాసరములివె పరిణామభాసురములు.

నటి—చిత్తము (అని పాడుచున్నది).

కం. దరముగ నళులానినయవి
వరకోమల కేసరాగ్రభాగోచ్చయముల్
కరుణాయుతలగు తరుణులు
శిరీషములఁ జెవులఁ దాల్చి చెలఁగుదు రెలమిన్.

సూత్ర—దేవీ! చక్కఁగఁ బాడితివి. సభవారిమనోవృత్తులు రాగనిబద్ధంబులగుట నంతటను రంగము చిత్తరువుంబోలి యున్నది. అట్లగుట నిపుడేనాటకమును బ్రదర్శించి యీసభ నలరింతము?

నటి—ప్రసిద్ధమైన యభిజ్ఞానశాకుంతలమను నపూర్వనాటకమును బ్రదర్శింపవలయునని తొలుతనే దేవర యాజ్ఞాపించితిరిగదా!

సూత్ర—దేవీ, చక్కగ జ్ఞప్తి చేసితివి. దాని నేనిప్పుడు మఱచితినిగదా! ఏలయన:

కం. నీలలితగీతరాగము
చే లాగంబడినవాఁడ సిద్ధం బీభూ
పాలుఁడు దుష్యంతుఁడు కడు
వైళము చనులేడిచేతవలెనే లలనా!

(అని నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన.

అభిజ్ఞానశాకుంతలము.

ప్రథమాంకము.

రంగము - కణ్వాశ్రమారణ్యము.

(అంతట విల్లునమ్ములఁ గైకొని రథారూఢుండై జింకనుదరుముచు దుష్యంతమహారాజును సూతుఁడును ప్రవేశించుచున్నారు.)

సూతుఁడు- (రాజును, మృగమునుజూచి) ఆయుష్మంతుఁడా!

గీ. కృష్ణసారమ్మునందును నెక్కువెట్టు
విల్లుగల్గిననీయందు వీక్షణంబు
నిల్పునాకుఁ గన్నట్లయ్యె నిక్కముగ హరి
ణంబువెన్నాడు సాక్షాత్పినాకపాణి.

రాజు—సూతుఁడా! మనమీసారంగముచేఁ జాలదూర మాకర్షింపఁ
బడితిమి. అదిమఱియు నిప్పుడును

మ. వెనువెంటంబడు తేరు సారెగనుచున్ వీక్షింపఁగా సొంపుగాఁ
దనగ్రీవంబును ద్రిప్పి బాణపతనత్రాసంబునన్ బృష్ఠము
న్వ్యాస మున్నెమ్మునదూర్చి డస్సి వివృతాస్యంబౌటచే సాము మే
సినదర్భాంకురముల్ పథంబునఁబడన్ శీఘ్రప్లుతిన్ నేలకం
టినదా! యున్నటులుంకి మింటజనుఁ గంటె సూత! సారంగమున్.

(సవిస్మయముగ) ఏమిది! వెంబడించుచున్నను నాకది ప్రయత్నముచేఁ
గాని కానరాకున్నది.

సూతు—ఆయుష్మంతుఁడా! మిట్టపల్లములుగల భూమియని పగ్గముల
బిగపట్టితిని గాన రథవేగము తగ్గి మృగము దవ్వైనది. ఇప్పుడు సమ
ప్రదేశమందున్న నీకిది యసాధ్యము కాదు.

రాజు—అట్లయినఁ బగ్గముల సడలింపుము.

సూతు— దేవరచిత్తప్రకారమే (రథవేగము నిరూపించి) ఆయుష్మంతుఁడా! చూడుముచూడుము.

మ. సడలన్ వాగెలు పూర్వకాయములు లేస్సన్ జాచి కంపంబులే
కడరన్ జామరశీర్షముల్, చెవులు స్థైర్యంబొప్పనిక్కన్ ఖురం
బులఁబై రేఁగెడు ధూళికైనఁ గడవంబోరాక యీరథ్యముల్
వడిఁబాఱుంగద లేడివేగమును నోర్వన్ లేనియట్లింతయున్.

రాజు—సత్యము. ఈ గుఱ్ఱములు సూర్యునిగుఱ్ఱములనుమించి పఱుగిడుచున్నవి. అదియుక్తమేగదా !

ఉ. ఇంచుకగాఁగదోఁచునది యింతటిలో విపులంబుగాఁగఁ గా
న్పించు సగానఁజీలునది నిండుగఁ దాపినయట్లు పుట్టులో
నెంచఁగ వక్రమైనయది యెంతయుఁ జక్కఁగఁ బ్రక్కదూరమం
దంచు నొకండునాకు క్షణమైనను లేదుకదా రథత్వరన్.

రాజు—సూతుఁడా! ఇదె దీనిం గూల్చుచున్నాను చూడుము. (అనిపింట బాణమును సంధించుట నభినయించుచున్నాఁడు.)

(నేపథ్యమున)

ఓహోరాజా! ఆశ్రమమృగమిది. చంపఁదగదు. చంపఁదగదు.

సూతు—(ఆలించి, యటుచూచి) ఆయుష్మంతుఁడా! నీకును నీబాణపాతదూరముననున్న హరిణమునకును నడుమఁ దాపసులు వచ్చియున్నారు.

రాజు—(ససంభ్రమముగ) అట్లయిన గుఱ్ఱముల నాఁపుము.

సూతు—చిత్తము. (అనిరథమును నిలుపుచున్నాఁడు).

(అంతట వైఖానసుఁడు మరి యిరువురితోఁ బ్రవేశించుచున్నాఁడు)

వైఖానసుఁడు—(హస్తమునుబైకెత్తి) రాజా! ఆశ్రమమృగమిది చంపఁదగదు. చంపఁదగదు.

గీ. తగదు తగదహో యీయమ్ముతగుల నిట్టి
మెత్తనగులేడిమేనఁ బూగుత్తి నగ్ని
వలె నిశితపాతపవిసారములగు నీశ
రంబు లేడ మృగచలజీవంబు లేడ.

గీ. అట్లగుటలెస్స సంధించినట్టి నీదు
సాయకంబును వేయుపసంహరింపు
మార్తరక్షణమునకె మీయస్త్రమధిప
పాపరహితుల నొప్పించువనికిఁ గాదు.

రాజు—ఇదిగో! యుపసంహరించితిని. (అని చెప్పినట్లు చేయుచున్నాఁడు.)

వైఖా—పురువంశప్రదీపకుండవగు నీకిది తగినది.

కం. అదిరా! పురువంశంబున
నుదయించిననీకు నెంతయుఁ దగు కంబా
నిది ఏవంవిధగుణసం
పదగల్గినసుతుని చక్రవర్తినిఁ గనుమా.
(తక్కినయిరువురు చేతులెత్తి)
తప్పక చక్రవర్తియగు సుతునిఁ గాంచెదవుగాత.

రాజు—(ప్రణమిల్లి) బ్రాహ్మణాశీర్వాదమును బరిగ్రహించినాఁడను.

వైఖా—రాజా! సమిధలఁ దెచ్చుటకు మేము బయలుదేరితిమి, కులపతి
యగు కణ్వునియాశ్రమమల్లదె మాలినీతీరమునఁ గనఁబడు
చున్నది, కార్యాంతరభంగము కానియెడల నాశ్రమమును
బ్రవేశించి యతిథిసత్కారము ను గ్రహింపఁదగును. మఱియు,

కం. ప్రతిహతవిఘ్నంబులు ర
మ్యతరములగు మునులక్రియల నటఁ గని గనదే
గతి గుణకిణాంకితము భూ
పతి నీభుజమెంతదవ్వు పాలించెనో.

రాజు—కులపతులిప్పు డాశ్రమమందున్నారా?

వైఖా—కూఁతురగు శకుంతల నాశ్రమమున నతిథిసత్కారమునకై
నియమించి యామెయొక్క ప్రతికూలదైవము నుపశమింపఁజేయు
టకు వారిప్పుడే సోమతీర్థమున కేఁగిరి.

రాజు—కాఁగాక. ఆమెనే చూచెదను. మహర్షియెడ నాకుగలభక్తి
నామెయే యాయనకు విన్నవింపఁగలదు.

వైఖా—మేమిఁకఁ బోయివచ్చెదము (అనిశిష్యులతో నిష్క్రమించును).

రాజు—సూతుఁడా! గుఱ్ఱములఁ దోలుము. పుణ్యాశ్రమదర్శనమున మనలం బవిత్రులఁ గావించుకొందము.

సూతు—దేవరయాజ్ఞానుసార మొనరించెదను. (అనితిరిగి రథవేగమును నిరూపించును.)

రాజు—(అంతటఁ గలయఁజూచి) సూతుఁడా! ఇది చెప్పకున్నను తపోవనము యొక్క సంపూర్ణత్వమని తెలియవచ్చుచునేయున్నది.

సూతు—ఎట్లు?

రాజు—నీవు చూడలేదాయేమి? ఇదిగో!

మ. వనికంటె శుకగర్భకోటరముఖభ్రష్టంబు లీచెట్లక్రిం
దున * నీవారము లింగుదీఫలభిదల్ సూచించునిద్ధంపురా
ళ్లను విశ్వాసముచే నభిన్నగతి చాలన్ జప్పుడుల్ సైచు లే
ళ్లను వల్కంబులజాలు నీరము ల చాళ్ళన్ మద్గుమార్గంబులన్.

సూ—అంతయు నట్లేయున్నది.

రాజు—(కొంతదూరముపోయి) తపోవనవాసుల కాటంకము గలుగఁగూడదు. ఇచటనే రథమునిలుపుము. నేనుదిగియెదను.

సూ—పగ్గముల బట్టుకొన్నాఁడను ఆయుష్మంతుఁడిఁక దిగవచ్చును.

రాజు—(దిగి) సూతా! తపోవనంబులు వినయవేషముఁ బ్రవేశింపఁదగినవి కదా! వీని నందుకొనుము (అని యాభరణములను ధనువును దీసి సూతునకిచ్చుచున్నాఁడు) సూతుఁడా! నేనీయాశ్రమవాసులఁ జూచివచ్చులోపల నీవు గుఱ్ఱముల వీపులఁగడుగుము.

సూ—చిత్తము (అని నిష్క్రమించుచున్నాఁడు).

రాజు—(కొంతనడచి, యవలోకించి) ఆశ్రమద్వారమిదిగో ప్రవేశించుచున్నాను. (ప్రవేశించి నిమిత్తమును సూచించుచు)

కం. శాంతం బీ యాశ్రమపద
మెంతయు బాహువు వదరునిట నెటు తత్ఫలమా
వింతా! భవితవ్యమ్ముల
కంతట మార్గంబులట్టె యమరుంగాదే.

---

* జాబాల్ క్వచిదిం

(నేపథ్యమున)

సఖులారా! ఇటు! ఇటు!

రాజు— (చెవియొగ్గి) ఓహో వృక్షవాటికకు దక్షిణమున మాటలాడు నట్లు వినవచ్చుచున్నది. అచ్చటికిఁ బోయెదను. (కొంతనడచి— చూచి-) ఆహా! ఈ తాపసకన్యలు వారివారి శక్తికిఁ దగిన నీటికడవలతో మొక్కలకు నీరుఁబోయ నిటువచ్చుచున్నారు. (లెస్సఁగాఁ బరికించి) ఆహా! వీరిదర్శన మెంతరమ్యము.

క౦. కాంతారాశ్రమ జనమున
కంతఃపురదుర్లభతను నమరినయే ని
ట్లింతయు గుణములమీఱు వ
నాంతరలత లుపవనంబులందలి లతలన్.

ఈచెట్టుచాటున నిలిచి చూచుచుండెదను. (అని చూచుచు నిలుచున్నాఁడు.)

(అంతటఁ బైఁజెప్పిన వ్యాపారముతో నిద్దరుసఖులతో శకుంతల ప్రవేశించుచున్నది.)

శకు—సఖులారా! ఇటు! ఇటు!

అన—చెలీ శకుంతలా! తండ్రిగారగు కాశ్యపులకు నీమీఁదకన్న నీయాశ్రమములోని మొక్కలమీఁద నెక్కుడు మక్కువయని తోఁచుచున్నది. ఏలయన నవమాలికా కుసుమంబుఁబోలె సుకుమారివగు నిన్నుఁగూడ నీ చెట్లపాదులకు నీళ్ళుపోయ నియమించినారు.

శకుం—తండ్రిగారి యాజ్ఞమాత్రమే కాదు వీనియందు నాకును సోదర స్నేహమే కలదు.

(అని చెట్లకు నీళ్ళుపోయుట నభినయించుచున్నది.)

రాజు—కణ్వునకీమె కూఁతు రెట్లుయియుండును? ఈమె నాశ్రమధర్మమందు నియోగించుటంబట్టి పూజ్యుఁడగుకణ్వుఁ డౌచితిఁ బాటించినవాఁడు కాఁడుగదా!

క౦. ఈయవ్యాజ మనోహర
కాయంబుఁ దపంబు నోర్వఁగాఁజేయుఁగఁ దా

నేయుమి గోరుచు నతఁడు శమిఁ
గోయఁగడఁగుఁ గలువరేకుకొనలర్ ఋషీర్.

కానిమ్ము. ఈచెట్టుచాటుననుండి యలికిడిగాకుండఁ జూచెదను (అని అట్లుచేయుచున్నాఁడు).

శకు—సఖీ! అనసూయా! ప్రియంవద నావల్కలమును బిఱ్ఱుగబిగించి కట్టినది. దీనినిఁగొంచెము సడలింపుము.

అన—అట్లే (అనిసడలింపుచున్నది).

ప్రియ—(నవ్వుచు) నన్నేలనిందించెదవు? పయోధర విస్తారమును గలిగించునీయౌవనమును నిందించుకొనుము.

రాజు—ఈమెవయస్సునకీవల్కలసంతతమాత్రము తగినదికాదు. ఐననిది యలంకారశోభ నతిశయింపఁజేయలేదని చెప్పరాదు ఎట్లంటే!

చ. జలజము శైవలావృతము చక్కదనంబున నెక్కుడేయగున్
మలినమయ్యుఁ జంద్రునకు మచ్చముఅంతగ లక్ష్మిఁగూర్చువ
ల్కలముగ నైన నీకుఁ గాంచువిశేషమనోహరత్వమే
యిలవయి సుందరాకృతుల కెద్దియలంకృతిఁ బోలదోగదా.

శకుం—(ముందుచూచి) గాలిచేఁగదలుచున్న పల్లవాంగుళులచే నీకేసరవృక్షము నన్నుఁ ద్వరగారమ్మని పిలుచుచున్నట్లున్నది. కాన నేనిప్పుడు దీనినిసంభావించెదను (అనివెళ్లును).

ప్రియ—సఖీ! శకుంతలా! అచ్చటనేకొంతసేపు నిలువుము. నీవుచేరువనున్నప్పుడీ కేసరవృక్షము తీఁగతోఁగూడుకొన్నట్లు శోభించుచున్నది.

శకుం—కావుననేగదా! నీవు ప్రియంవదవైతివి.

రాజు—ప్రియమైనప్పటికిని ప్రియంవద శకుంతలనుఁగూర్చి తథ్యమేచెప్పినది. ఈమెకు

---

* పాఠాంతరము

గీ. నాచుగప్పియున్న నలినంబురమ్యంబు । శశికినల్లమచ్చ ఛాయఁదెచ్చు
నీపెవల్కలముల నెంతయుశోభిల్లు । మంచికేదిఁగదు మండనముగ.

కం. చివురువలెఁ గెమ్మోవి మృ
దువిటపముల ననుకరించు దోర్యుగమారా
పువువలెఁ గమనీయంబగు
నవయౌవనమంగములను నాతికినమరెఁ.

అన—సఖీ శకుంతలా! సహకారమునకు స్వయంవరవధువైన యీనవమాలికకు వనజ్యోత్స్నయని పేరుపెట్టితివి దీనిని మఱచితివి.

శకుం—అట్లయిన నన్ను నే మఱచిపోవలసినదే (అని లతనుసమీపించి దానిఁజూచి) రమణీయమగు కాలమునం దీలతాపాదపమిథునమునకు సంబంధము కుదిరినది. వనజ్యోత్స్న నవకుసుమయౌవనవతి. స్నిగ్ధపల్లవములచే భోగార్హమైనదిసహకారము. (అనిచూచుచు నిలుచున్నది.)

ప్రి—అనసూయా! వనజ్యోత్స్నను శకుంతలయంతగా నేలఁజూచుచున్నదో నీకుఁదెలియునా?

అన—నాకుఁ దెలియలేదే! చెప్పుము.

ప్రియ—వనజ్యోత్స్న తనకుఁదగిన వృక్షరాజము నెట్లుపొందెనో యట్లే తనకు ననురూపుఁడైన భర్తలభించునాయని,

శ—ఇదియంతయు నిశ్చయముగా నీమనస్సునందలి యభిలాష. (అని కలశమును గ్రుమ్మరించుచున్నది.)

రా—కులపతులగు కణ్వులకీమె యసవర్ణక్షేత్రసంభవయై యుండునా యేమి? చాలుఁజాలు. సందేహమేల?

గీ. పూజ్యమైనట్టి నామనంబు వలచెనిఁక
సంశయంబేల నీమె రాజన్యయోగ్య
సందియంబులు గలవట్ల సత్పురుషుల
కాత్మవృత్తులగుఁ బ్రమాణమదినిజంబు.

అయినప్పటికి నీమెయాథార్థ్యం బరసెద.

శ—(సంభ్రమముతో) అమ్మో, నీళ్లుపోయుటచే బెదరి రేఁగి యీ మధుకరుఁడు నవమాలికను వదలి నాముఖముమీఁదికి వచ్చుచున్నాఁడు. (అనిభ్రమరబాధ నభినయించుచున్నది.)

రా—ఆశతో

చ. వ్యథనువడంక మాటికి నపాంగవిలోకనమంటుచున్ రహః
కథనముభంగిఁ బాడుచును గర్ణములన్ మృదుగీతి భోగమూ
లధనము కాంతమోవి కడుదగ్గఱిత్రోలెదు చే నదల్చినన్
మధుకర!!! తత్త్వమారయుట మావనియయ్యెఁ గృతార్థుఁడీవె కా.

శకు—దుండగీఁడు మధుకరుఁడు నన్ను వదలునట్లులేదు. ఇంకొకచోటికి నేఁబోయెదను. (ఒక్క యడుగు వేసి మధుకరునివంకజూచి)ఇక్కడకు గూడ నెట్లువచ్చుచున్నాఁడో! సఖులారా! ఈదుర్వినీతుఁడగు మధుకరునిబారినుండి నన్ను రక్షింపుఁడు.

ఉభయులు—(చిఱునవ్వుతో) రక్షించుటకు మే మెవరము? దుష్యంతుని రమ్మనుము. తపోవనములు రాజరక్షితవ్యములుగదా!

రాజు—ఇదియే బయలుపడుటకు నాకు మంచిసమయము. భయపడఁ దగదు. భయపడఁదగదు. (అని సగములోనాపి ఆత్మగతమున) అట్లైన రాజభావము బయలుపడునేమోకదా! కానిమ్ము. ఇటులఁ బలికెదను.)

శ—(ఇంకొకయడుగుపెట్టి నిలిచి, దృష్టినిగుడించి) ఇచ్చటకుఁగూడ నన్నట్లనుసరించి వచ్చుచున్నాఁడో!

రాజు—(త్వరగాఁ బ్రవేశించి)

గీ. దుర్వినీతుల దండించి యుర్విపౌర
వుండు పాలించుచుండ నెవ్వండు వీఁడు
తపసికన్యల ముగ్ధలఁ దవిలి యవిన
యంబునను నేఁచు నిట్లు భయంబుఁదక్క.

(అందఱు రాజును జూచి, ఇంచుకసంభ్రాంతచిత్తులగుచున్నారు.)

అన—ఆర్యా! అంత యుపద్రవమేమియు లేదు. ఈ మా ప్రియసఖి మధుకరాభిభూయమానయై భయపడినది. (అని శకుంతలనుఁ జూపుచున్నది)

రాజు—(శకుంతలవైపుతిరిగి) తపస్సు వర్ధిల్లుచున్నదా!

(శకుంతల తత్తరముతో మాటాడకూరకున్నది)

అన—మీవంటి యుత్తములైన యతిథులరాకచే మఱియు వర్ధిల్లుచున్నది. సఖీ శకుంతలా! పర్ణశాలకుఁబోయి ఫలములతోఁగూడ నర్ఘ్యమును గొనితెమ్ము. ఇయ్యది పాదోదకంబగు.

రాజు—మీసూనృతవాక్కులే నాకాతిథ్యమయ్యెను.

ప్రి—అట్లైన నార్యులు చల్లనినీడగల యీసప్తపర్ణవేదికపై ముహూర్తము విశ్రమించి బడలికఁదీర్చుకొందురుగాక.

రాజు—మీరుకూడ నీపనిచేసి మిక్కిలి యలసినట్లున్నారు.

అన—సఖీ! శకుంతలా! అతిథులసేవించుట మనకుచితముగదా! ఇచటఁ గూర్చుందము (అని యందఱు కూర్చుందురు).

శకుం—(ఆత్మగతము) వీనింజూచినదిమొదలు నాకేలకో! తపోవనవిరుద్ధమైన మనోవికారము కలిగినది.

రాజు—(అందఱనుజూచి) ఆహా! సమవయోరూపములచే నెంతరమణీయమైనది మీస్నేహము!!

ప్రి—(జనాంతికముగ) అనసూయా! చతురగంభీరాకృతిగలిగి నేర్పుగను ప్రియముగను మాటలాడుచు మహారాజువలెఁ గన్పట్టునీతఁ డెవ్వఁడు?

అ—సఖీ! నాకుఁగూడ నట్టికుతూహలమే కలదు. ఈయన నేయడిగెదను. (ప్రకాశముగ) ఆర్యుని మధురాలాపములవలనఁ గలిగినచనవు నన్నుఁ బ్రేరేచుచున్నది. ఆర్యునిచే నేరాజర్షివంశ మలంకరింపంబడుచున్నది? ఏదేశప్రజనులు దేవరవిరహమునఁ దహతపడుచున్నారు? తపోవనగమనపరిశ్రాంతి కేనిమిత్తమున నిట్టిసుకుమారశరీరము పాల్సేయఁబడినది?

శ—(ఆత్మగతము) హృదయమా! తత్తరపడకుము. నీవడుగఁదలఁచినదాని ననసూయయే యడుగుచున్నది.

రా—(ఆత్మగతము) నన్ను నేనెట్లుతెలుపుకొందును? పోనీనన్నెట్లు మఱుగు పఱచుకొనగలను? కానీ యీలాగున నీమెతోఁజెప్పెదను. (ప్రకాశముగా) అమ్మా! పౌరవరాజుచే ధర్మాధికారమునందు నియోగింపఁబడినవాఁడనై యాశ్రమవాసులక్రియలు నిర్విఘ్న

ముగ జరుగుచున్నవాయని తెలిసికొనుట కీధర్మారణ్యమునకు వచ్చితిని.

అ—ఇప్పుడుగదా ధర్మచారులైన యాశ్రమవాసులు సనాథులైరి. (శకుంతల శృంగారలజ్జ నభినయించుచున్నది.)

సఖులు—(ఉభయులయాకారములను గ్రహించిజనాంతికముగ) సఖీశకుంతలా ! నాయనగారే యిప్పుడిక్కడనుండెనా !

శకు—ఉన్న నేమగును?

సఖులు—ఈయతిథిశ్రేష్ఠుని దనజీవితసర్వస్వమునొసంగియైనఁ గృతార్థునిఁ గాఁజేయును.

శ—మీరుభయులుపొండు. మీరెద్దియోమనమున నిడుకొని మాటలాడుచున్నారు. మీమాటల నేవినను.

రాజు—మేముకూడ మీసఖినిగురించి కొంతయడిగెదము.

సఖులు—ఆర్యా ! ఇట్లుకోరుట మమ్మనుగ్రహించుటయే.

రా—పూజ్యులగుకాశ్యపులు శాశ్వతబ్రహ్మనిష్ఠులని ప్రసిద్ధి. ఈమీసఖి వారికాత్మజ యెట్లయ్యెను?

అ—దేవరచిత్తగింపుఁడు. కృత గోత్రనామధేయుఁడును మహాప్రభావసంపన్నుఁడు నగు కౌశికుఁ డను రాజర్షి యొకఁడు గలఁడు.

రాజు—కలఁడు. వినియున్నాము.

అన—మాచెలినిఁగన్నవాఁ డతఁడేసుండీ. పరిత్యజింపఁబడిన యీమెకు శరీరపోషణాదికముచేసి పెంచుటచేఁ గాశ్యపులు తండ్రియైరి.

రా—"పరిత్యజింపఁబడి" యను శబ్దముచే నాకుఁ గుతూహలము పుట్టుచున్నది. ఆమూలాగ్రముగ విన నిచ్ఛగించుచున్నాను.

అన—దేవర యవధరింపుఁడు. పూర్వము గౌతమీతీరమున నా రాజర్షి యుగ్రతపముఁ జేయుచుండఁగానెంతయుభయముఁనొందిన దేవతలచే నియమవిఘ్నకారిణియగు మేనకయను నప్సరస పంపఁబడినది.

రా—దేవతలకు నన్యసమాధిభీరుత్వ మెప్పుడునున్నదే!

ప్రి—రమణీయమగు వసంతసమయమున నున్మాదమును గలిగించు నామె రూపమును జూచి (ఇట్లు సగముచెప్పి లజ్జచే నూరకుండును.)

రా—తరువాత తెలియుచునేయున్నది. సర్వవిధములనీమె అప్సరస్సంభవయే

అ—అవును.

రా—యుక్తముగనేఁయున్నది.

కం. కరమరుదగు రూపంబిది
తరమా పొడమంగ మర్త్య తరుణులయందుఁ?
తరళజ్యోతి తటిల్లత
ధరనుద్భవ మొందుటన్న దబ్బరయొకదా!.

(శకుంతల తలవంచుకొనియున్నది.)

రా—(ఆత్మగతముగ) నామనోరథము నెఱవేఱ నవకాశముకలదయ్యె. అయినఁజెలికత్తెలు పరిహాసముగా నుదహరించిన యీయామె వర ప్రార్థనము విని నామనంబు భిన్నభావంబులచేఁ గలఁతనొందుచున్నది.

ప్రి—(మందహాసముతో శకుంతలనుఁజూచి రాజువైపుతిరిగి) దేవర మరల నేమో చెప్పఁదలఁచినట్లున్నారు?

శకుంతల—(చెలికత్తెను వేలితో బెదరించుచున్నది.)

రా—నీవు చక్కఁగఁ గనిపెట్టితివి. మాకు సచ్చరిత్రమును వినుట యందలి కుతూహలమున మఱియొకవిషయము నడుగఁదలఁచినాము.

ప్రి—తామింతవిచారింప నక్కఱలేదు. మనసిచ్చి యేవిషయమైన ముచ్చటింపఁదగినవారుగదా? తపస్విజనులు!

రా—ఇట్లుమీసఖినిఁగూర్చి తెలియఁగోరుచున్నాము.

ఉ. ఈనళినాయతాక్షి కుసుమేషుసుకృత్యనిరోధియైన వై
ఖానసవ్రతంబు పతిఁగాంచెడుదాఁక నిటాచరించునో?
కానియెడన్నిరంతరముఁ గానల నాత్మసమానదృష్టి సొం
పైనమృగీతతింగలిసి యాడుచుఁ బ్రొద్దులుపుచ్చునోకదా!.

ప్రియ—ఆర్యా! ధర్మాచరణమునందుగూడ నీమె పరవశయే యయినను దండ్రిగారికి మాత్ర మనురూపుఁడైనవరునకు నీమెనిచ్చి పాణిగ్రహణము నొనర్చుటయే సంకల్పము.

రా—(ఆత్మగతముగ) ఈకోరిక దుర్లభము కాదుసుమీ!

గీ. హృదయమా! సస్పృహామవగు మింకనీవు
సంశయంబది యిప్పుడే సమసిపోయె
నగ్నియని దేనిశంకించి తదియయౌర
తాఁకఁదగినది యయ్యె సద్రత్నమిద్ది.

శ—(రోషముతోనున్నట్టుగ) అనసూయా! నేనువెళ్ళెదను.

అన—ఏల ?

శ—పూజ్యురాలైన గౌతమికి నీయసంబద్ధ ప్రలాపినియైన ప్రియంవదను గూర్చి చెప్పుటకు.

అ—సఖీ ! అతిథిశ్రేష్ఠుని సత్కరింపకయే విడిచి యిచ్చవచ్చిన చొప్పున వెళ్లుట యుక్తముకాదు.

శకుంతల—(ఏమియు బదులుచెప్పకయే బయలుదేరును.)

రాజు—(పట్టుకొనఁబోయి తిరిగి తనను నివారించుకొని స్వగతముగా) ఔరా ! కామజనచిత్తవృత్తి చేష్టాప్రతిరూపముగనున్నది కదా ! ఏలయన, నేను

కం. మునిసుత వెనుకొనఁగోరియు
వినయము తోడ్తోడఁబోడమి వేగిరమడఁపన్
మునువున్నచోటనుండియుఁ
జనిమఱలన్ వచ్చువాని చందంబైతిన్.

ప్రియ—(శకుంతలనడ్డగించి) సఖీ! నీవువెళ్లఁదగదు.

శ—(బొమముడిపాటుతో) ఏమినిమిత్తము?

ప్రి—నీవునాకు రెండుచెట్లకు నీళ్లుపోయ నప్పుపడియున్నావు! రమ్ము.
(అని బలవంతముగా నామెను మరలించును)

రా—కల్యాణీ! నీళ్లుపోయుటవలననే యీమె యలసినట్లుకనబడుచున్నది ఏలయన నీమెకు

మ. ఘటమెత్తన్ సడలెన్ భుజమ్ములవి రాగంబెక్కెఁ బాణిద్వయిన్
ఘటియించుంగద యిప్పుడేఁగుచములన్ గంపంబు నిట్టూర్పుచె
మ్మటలున్ గర్ణశిరీషరోధులుగఁ బ్రమ్మన్ జొచ్చె నెమ్మోమునన్
బటిమన్ జెర్వఁగనొక్కచే ముడివిడన్ బర్యాకులంబుల్ కురుల్.

కానసీమెను నేనుఋణవిముక్తఁ గావించెద (అని యుంగరమునిచ్చు
ను) (సఖులిద్దఱు నామముద్రాక్షరములఁ జదువుకొని యొండొ
రులఁ జూచుకొందురు)

రాజు—మమ్ముల నన్యథాభావింపవలదు. ఇది రాజుగారి బహుమానము
కావున నన్నొక రాజపురుషునిఁగా నెఱుంగుఁడు.

ప్రి—ఆకారణముననే యీయుంగరము మీవ్రేలి నెడఁబాయఁదగదు.
దేవరమాటచేతనే యిప్పుడీమె ఋణవిముక్తురాలయ్యెను. (ఇం
చుకనవ్వి) సఖీ శకుంతలా! కరుణాళుఁడగు నార్యునిచే నేల!
మహారాజుచే ఋణవిముక్తురాలవైతివి. ఇఁకనీవిప్పుడుపొమ్ము.

శకుం—(ఆత్మగతము) నేనస్వతంత్రనైనచో! (ప్రకాశముగ) నన్నడ్డగించు
టకుగాని పోనిచ్చుటకుగాని నీవెవతవు?

రాజు—(శకుంతలనుజూచి స్వగతముగ) ఈమెయెడనాకెట్లున్నదో యీమె
కునాయెడ నట్లేయుండునా? ఉండ కేమి? నామనోరథమున కవకా
శముకలదు ఎట్లన?

గీ. కలిసిమాటలాడఁగా నొల్లనట్లుండు
వీనులొగ్గుఁ బల్కుఁబూనినంత
నన్నుఁజూడనట్లులున్నది గాకీమె
కంటి కన్యవిషయమంటదెందు.

(నేపథ్యమున)

ఓతాపసులారా! చేరువనుండి యాశ్రమమృగముల రక్షించుకొనుఁడు.
మృగయావిహారియై దుష్యంతమహారాజు సమీపించియున్నాఁ
డఁట.

తే.గీ. కొమ్మలందు జలార్ద్రవల్కమ్ములార
గట్టు నాశ్రమద్రుమముల బిట్టు † రాలు
పరిణతారుణనిభమైన తురగఖురహ
తరజ * మియ్యది మిడుతలదండువోలె.

మఱియు.

† పడెడు   * మామఱియు

మ. ఒకదంతంబున దీవ్రఘాతహత వృక్షోరుప్రకాండంబు ని
ల్పి కరంబద్ధులలాగఁజుట్టుకొను తీవెల్ పాశముల్ గాగ భి
న్నకురంగాఘము మాతపంబునకు విఘ్నంబెత్తురూపట్లు పా
యకు తేరుంగని యేన్గిదే బెదరి ధర్మారణ్యముంజొచ్చెడిన్.

(స్త్రీలందరు చెవియొగ్గివిని యించుక తత్తరపడుచున్నారు)

రాజు—(ఆత్మగతము) ఇసీ! పౌరులు మమ్మువెదకుచువచ్చి తపోవనమును గలఁతఁబెట్టుచున్నారు. కానిమ్ము. మేమిఁకవెళ్ళెదము.

సఖులు—ఆర్యా! యీ యారణ్యకవృత్తాంతముచేతఁ గలఁతఁబొందినాము. పర్ణశాలకుఁ బోవుటకు మాకనుజ్ఞనిండు.

రాజు—(సంభ్రమముతో) మీరుపోయిరండు. మేమును నాశ్రమమున కెగ్గు జరగకుండునట్లుగఁ బ్రయత్నించెదము.

(అందఱు లేచుచున్నారు.)

సఖులు—ఆర్యా! మీకతిథిసత్కార మొనర్పనిమేము తిరిగిదర్శనమిండని ప్రార్థింప సిగ్గుపడుచున్నాము.

రాజు—అట్లనకుఁడు. మీరు దర్శనమిచ్చుటయే మాకు సత్కారము.

(శకుంతల రాజునుజూచుచు నెపముపెట్టి యాలసించి చెలులతో నిష్క్రమించును.)

రా—నగరగమనమునుగూర్చి మాకు నుత్సాహము తగ్గుచున్నది. పరివారజనమును గలిసికొని వారినిఁ దపోవనమున కనతిదూరమున విడియించెదను. శకుంతలావ్యాపారమునుండి మనసుమఱలింప నా వశముగాకున్నదిగదా! ఏలయన నాకు

కం. తనువా! ముందఱకడుగిడు
మనమా! యపరిచితమనగ మరలుచు బోఁటున్
అనిలమున కెదుఱఁగొను కే
తనచీనాంశుకముఁబోలెఁ దటతటమనుచున్.

(ఇట్లందఱు నిష్క్రమింతురు.)

ఇది యాంధ్రీకృతాభిజ్ఞాన శాకుంతలమునందలి
ప్రథమాంకము సమాప్తము.

అభిజ్ఞాన శాకుంతలము.

ద్వితీయాంకము.

అంతట విషణ్ణుఁడగు విదూషకుఁడు ప్రవేశించుచున్నాఁడు.

విదూ—(నిట్టూర్పువిడిచి) హాదైవమా! మృగయాసక్తుఁడగు నీరాజు సఖ్యమున దుఃఖముదెచ్చుకొంటిని. ఇదిగో మృగము, అదిగో వరాహము; అల్లదె శార్దూలమని మధ్యాహ్నమునందుఁగూడ వేసవి నల్పచ్ఛాయలగు వృక్షములక్రింద నొకయడవినుండి మఱియొక యడవికిఁ దిరుగవలసివచ్చినది. ఆకలములుపడి చివికి వగరెక్కిన వెచ్చని సెలయేటినీళ్లుఁ ద్రాగవలసివచ్చినది. వేళకానివేళలలోఁ దఱుచుగఁ గాలుకుట్లతోఁ బొట్ట నింపుకోవలసివచ్చినది. వేటయందు గుఱ్ఱములవెంబడి పఱుగులెడుచుండుటచేఁ గీళ్లుసడలి రాత్రులందుసైతము పడకకుమురక బొత్తిగా నిద్దురపట్టుటలేదు. ఇంకను దెల్లవాఱలేదు. అప్పుడే తొత్తుకొడుకు లీపిట్ట వేటకాండ్రు వలలుగిలలుతీసుకొనుచు నడవి నరికట్టఁజేయు కోలాహలమువలనఁ బట్టిన నిద్రభంగమైనది. ఇప్పటికి నింతటితోఁ బీడతొలఁగిపోలేదు. ఇప్పుడు గోరుచుట్టుమీఁద రోకంటిపోటువలెనైనది. నిన్న మేమెవ్వరమును లేనప్పుడు మృగమును వెంబడించుచు నాశ్రమపదముఁ బ్రవేశించిన మారాజునకు నాదురదృష్టమునఁ దాపసకన్యయగు శకుంతలకంటఁ బడినదఁట. ఇప్పుడిట్లు నూరికిఁబోవుటయేఁ దలపెట్టఁడు. నేఁడు నామెలకింతతోనే రాజునకుఁ దెల్లవాఱినది. ఏమిగతి! మహారాజు కాల్యకృత్యములఁ దీర్చుటతోడనే దర్శింతును. విండ్లు చేఁబూని వనపుష్పమాలికలధరించిన యవనస్త్రీలు వెంటరాఁగాఁ బ్రియవయస్యుం డిటకేవచ్చుచున్నాఁడు. కానిమ్ము. అంగభంగవిక

ఱునివలె నిలిచెదను. ఇట్లైనను నాకుఁ గొంతవిశ్రాంతి లభించు నేమో! (అని కఱ్ఱనూతఁ జేసికొని నిలుచున్నాఁడు.) (పైనవర్ణింపఁ బడినట్లు రాజు పరివారముతోఁ బ్రవేశించుచున్నాఁడు.)

రాజు—గీ. ఎంచఁ బ్రియురాలు సులభ కాదెటుతోదీయ
భావ దర్శనాశ్వాసి నాస్వాంతమార
కాయజుండు కృతార్థుండు గానిపట్ల
రతినొసంగు పరస్పర ప్రార్థనంబు.

(మందహాసము చేసి) ఇటులనే కదా! తనయభిప్రాయమున కనుగుణముగ నిష్ట జనమనోవృత్తులను గల్పించుకొని కాముకుఁడు నవ్వుల పాలగుచున్నాఁడు.

మ. కనియెన్ నిద్దపుఁజూపుఁ గ్రేవలుదెస నక్కంజాక్షి వీక్షించుచున్
జనియెన్ మెల్లఁగలీలఁగా జఘనవిస్తారంపు భారంబునన్
జనుచోఁ గూడదటంచు నాఁగుచెలిమిన్నన్ బల్కె సేర్ష్యంబుఁగాఁ
గనసర్వంబుమదర్థ మద్దిరగనుంగా కామి స్వాత్మీయతన్.

విదూ—(అట్లేనిలుచుండి) సఖుఁడా! నాకుఁ గాలుసేతులు కదలుట లేదు. వాఙ్మాత్రమున నే విజయీభవయని పలుకుచున్నాను.

రా—ఈయంగవైకల్యము నీకెట్లు తటస్థించినదోయి?

విదూ—ఎట్లా! కన్నుఁబొడచిన నీవే కన్నీటి కారణమడుగుచున్నావు!

రా—నాకేమియుఁ దెలియలేదు.

వి—సఖుఁడా! ప్రబ్బలిచెట్టు మరిగుజ్జువలె వంగుట స్వప్రభావము చేతనా? నదీవేగము చేతనా?

రా—దానికిఁ గారణము నదీవేగమే.

విదూ—నాకును నీవే కారణము.

రా—అదియెట్లు?

వి—రాచకార్యముల నుజ్జగించి భయంకరమైన యీయరణ్యప్రదేశమందు నీవిట్లడవిద్రిమ్మరివి కావలసివచ్చినది. నిక్కము వచింతు. ప్రతిదినము నీయడవిమృగముల వెంటఁ బరుగులిడుటచేఁ గీళ్లుసడలి యవయవములు నాకు వశముగాకున్నవి. కావున నొక్కదినమైనను విశ్రమించుటకు నన్ను విడువఁ బ్రార్థించెదను.

రాజు—(స్వగతము) ఇతఁడు నిట్లు చెప్పుచున్నాఁడు. నాకుఁగూడ కాశ్యప సుతఁతలఁపునకు వచ్చిన వేటమీఁద మనసుపోకున్నది. ఏలయన

గీ. వనిని బ్రియురాలితో సహవాసమమరఁ
గలిగి చూడ్కి-లక్కి-కిఁ గఱపినవన
నొప్పులెల్ల నే నేయంగనోవనకట
యమ్ముఁదొడిఁగిన బాణాసనమ్ము వంచి.

విదూ—(రాజు మొగముఁ జూచి) మీరేదియో మనసునఁ బెట్టుకొని యాలోచించుచున్నారు. నేఁజెప్పినదంతయు నరణ్యరోదనమయ్యెను.

రాజు—(ఇంచుకనవ్వి) వేఱేమున్నది? స్నేహితునిమాట దాఁటఁగూడనిది గదా? యని యూరకుంటిని.

విదూ—చిరంజీవ (అని వెళ్ళఁగోరును.)

రాజు—వయస్యా! ఉండుము. ఇంకను జెప్పవలసినమాట యున్నది.

విదూ—దేవరయానతిచ్చెదరుగాక.

రాజు—నీవు శ్రమతీర్చుకొనుచు ననాయాసమైనయొక కార్యమందు నాకును సహాయపడవలసియున్నది.

విదూ—మోదకభక్షణమునందాయేమి? అయినఁ దీరికయే.

రాజు—ఇదిగో! చెప్పుచున్నాను. ఓరీ! ఎవఁడురా! అక్కడ.

(ప్రవేశించి దండమిడి) దౌవారికుఁడు — దేవరయాజ్ఞాపింపుఁడు.

రాజు—రైవతకా! సేనాపతినిటకుఁ బిలుచుకొని రమ్ము.

దౌవా—చిత్తము. (అని నిష్క్రమించి సేనాపతితోఁ దిరిగి ప్రవేశించి సేనాపతితో) దేవరవారాజ్ఞాపించు నాతురతతో నిటువైపే చూచుచున్నారు. సన్నిధి కరుగుఁడు.

సేనా—(రాజునుజూచి) వేటనింద్యమైనప్పటికిని మహారాజు నెడ కేవలము గుణముగనే పరిణమించినది. ఎట్లన,

మ. అమరం గానసనీమ సంతత ధనుర్జ్యాస్ఫాలన క్రూరపూ
ర్వముఁ సర్కాంశు సహిష్ణువుణ్ జెమట యల్పంబైన లేకుండి దా
ర్ఢ్యముకల్మిఁ గడు దగ్గియుణ్ దెలియఁగా రాకున్న ప్రాణసా
రమునో మేనిటు కొండయేన్గువలె మీరల్ దాల్తురిప్పట్టునణ్.

(సమీపించి) ప్రభువునకు జయమగుఁగాక జయమగుఁగాక! క్రూరమృగములు గదలకుండ నడవి నరికట్టియుంచితిమి. ఇంక నిక్కడ జాగేలచేసెదరు?

రాజు— వేటనునిందించు మాధవ్యునిచే నుత్సాహరహితునిగఁ జేయఁబడితిని.

సేనా—(జనాంతికముగ) సఖుఁడా! నీ వామాటమీఁదనే యుండుము. నేను మహారాజు చిత్తవృత్తి ననుసరించెదను. (ప్రకాశముగ) ఈమూర్ఖు నాలాగే ప్రేలుచుండనిండు. నిశ్చయముగా దీనికిఁ బ్రభువులే నిదర్శనము.

ఉ. క్రొవ్వఱిబొజ్జ సన్నగిలి గొబ్బున లేవఁగఁ దేలికౌను మే
నివ్వన సత్త్వధీవికృతు లెల్లఁగనం దగుఁ గ్రోధ భీతులం
దవ్వలఁ బాఱుజంతువులఁ దద్దయు నేయుట మెప్పు ధన్వికిం
కెవ్విధి వేటదూష్యమనుటే మృష యెయ్యెడ సద్వినోదమౌఁగన్.

విదూ— ఓరీ! ప్రోత్సాహకారకుఁడా! పోపొమ్ము. మహారాజిప్పుడు స్వస్థచిత్తుఁడై యున్నాఁడు. నీవొకయడవినుండి మఱియొకయడవికిఁ దిరుగుటలో నరనాసిక యందిష్టముగల యెదేనొక వృద్ధభల్లూకపు వాతఁబడఁగలవు.

రాజు— భద్రా! సేనాపతీ! మనమాశ్రమ సమీపమునందున్నాము. ఆ కారణమున నీమాటల నే నంగీకరింపను. ప్రకృతము

ఉ. కొమ్ములనీళ్ళు జిమ్ముచును గుంటల దున్నలు మున్గగాత వృ
క్షమ్ముల నీడ లేళ్ళుగమి చర్వితచర్వణముల్ రచించుతన్
నమ్మికఁ బల్వలంబున ఘనంబుగ పందలు ముస్తలెత్తుతన్
నెమ్మది నెక్కుడించుటను నేఁటికి గాంచుత నాదు చాపమున్.

సేనా— దేవరచిత్తము వచ్చినట్లు కానిండు.

రాజు— అట్లయిన ముందుపోయిన వనగ్రాహిణుల మఱలింపుము. మన సైనికులు తపోవనమునుఁ గలఁతఁ బెట్టకుండునట్లు నివారింపఁబడుదురుగాక. చూడు

గీ. శమప్రధానులగు తపస్విజనులందు
నణఁగియుండు తేజంబు దాహాత్మకంబు
సూర్యకాంతంబులటు ముట్టఁజాలకనయ్యు
నన్యతేజోభిభవమున నదివెలార్చు.

సేనా— చిత్తము. దేవర యాజ్ఞాపించినట్లే.

విదూ— నీయుత్సాహవృత్తాన్తము భంగమైనదిలే! పో!

(సేనాపతి నిష్క్రమించును.)

రాజు— (పరిజనమును విలోకించి) మీరు వేటవేషమునుదీసివేయుఁడు. రైవతకా! నీవు నీపనిమీఁదనుండుము.

రైవ— దేవర యాజ్ఞాపించినట్లే. (అని నిష్క్రమించును.)

విదూ— ఒక్కపురుగైన లేకుండఁజేసితివి. లతలచే మేలుకట్లుగా నొనర్పబడి మనోహరముగానున్న యీ చెట్లనీడను గూర్చుండుము. నేనును సుఖముగఁ గూర్చుండెదను.

రాజు— నీవు ముందునడువుము.

విదూ— నీవురమ్ము. (ఇద్దఱుఁబోయి కూర్చుందురు.)

రాజు— మాధవ్యా! నేత్రసాఫల్యముఁ గాంచకపోతివి. ఏల యనఁ జూడఁదగిన దానినిఁ జూడకపోతివి.

విదూ— నీవు నాయెదుటనే యుంటివిగదా!

రాజు— అందఱు నాత్మీయమును మనోజ్ఞముగ నెంతురు. కాని నేను మాత్ర మాశ్రమమున కంతయు నలంకారమైన శకుంతలనుగూర్చి చెప్పుచున్నాను.

విదూ— (స్వగతము) కానిమ్ము. ఇతని కవకాశ మెంతమాత్రమీయను. (ప్రకాశముగ) చెలికాడా! మునికన్యక నీవు కోరఁదగినదిగాఁ గనఁబడుచున్నదే!

రాజు— పౌరవులకుఁ బరిహరింపఁదగిన వస్తువులమీఁద మనస్సు పోదు సుమా!

గీ. దేవకాంతకుఁబుట్టి యదివిడువంగ
మునికిఁ దొరుకుట నతనికిఁ దనయయయ్యె

నూఁకిజిల్లేడుపైఁబడి యొప్పుచుండు
నవ్యనవమాలికా ప్రసూనంబువోలె.

విదూ — (నవ్వి) స్త్రీ రత్నములను సరకుఁగొనని నీకీ కోరికపుట్టుట పిండ ఖర్జూరములతో మొగము మొత్తినవానికిఁ జింతపండు రుచించినట్లే.

రాజు — నీవామెను జూడలేదు కావున నిట్లు చెప్పుచున్నావు.

విదూ — అట్లయిన నీకుఁగూడ నాశ్చర్యమును బుట్టించునది తప్పక రమణీయముగ నుండవలయును.

రాజు — వయస్యా! వేయేల?

గీ॥ చిత్రమునఁగూర్చి ప్రాణంబుఁ జేర్చెనో విధి
మదిని నొప్పులకుప్ప నమర్చెనో కొ-
మానవతిమేను బ్రహ్మసామర్థ్యమరయ
నూత్నమైతోఁచు నద్ది స్త్రీ రత్నసృష్టి.

విదూ — అట్లయిన రూపవతులందఱకు నిఁకఁ బరాభవమే.

రాజు — నా మనస్సులోనిమాటయు నిదియే.

మ. కన నాఘ్రాణము సేయనట్టి సుమమా కల్యాణరూపంబు చే
తనుగిల్లంబడనట్టి పల్లవమవిద్ధంబైన సద్రత్నమా
ననిక్రొందేనియ పుణ్యపూర్ణఫలమౌ నానిర్గలంబౌర యె
వ్వనికిన్ భోగ్యముగా విధాత సమకూర్పన్ జేసెనో నేర్పుమై.

విదూ — గారనూనె జిడ్డోడుచున్న తలగలజడదారిచేతిలో నామె పడక మున్నె యామెను శీఘ్రముగ నేలుకొనుము.

రాజు — ఆమె పరాధీనురాలుగదా! తండ్రియును జెంతలేఁడు.

విదూ — ఇంతకు నీయెడల నామెచూపు వలపెట్లున్నది.

రాజు — స్వభావముగానే తపస్వికన్యలు ప్రగల్భరాండ్రు కారు అట్లయ్యు,

గీ. ఏ నెదురుగాఁగ మఱలించెదృష్టి నొర
కారణాంతరమున్నట్లు కలికినవ్వె
తద్వినయవారితుండగు దర్పకుండు
బయలుపడలేదు దాగినవాఁడుఁ గాడు.

విదూ — అట్లుగాక చూచినమాత్రముననే నీతోడ నెక్కునాయేమి?

రాజు—సఖులతో వెళ్లినపుడు లజ్జావతియయ్యు నామె దనభావమును స్పష్టముగఁ బ్రకటించెను. అది యెట్లంటే

సీ. సాగి రెండడుగు లూరక యేఁగెఁ దన్వి
గ్రుచ్చుకొనెఁ బాదములఁ గుశాంకురమటంచుఁ
జెట్లకొమ్మలఁ దగులని చేలకొంగుఁ
దీసికొనుమిష వెనుకకుఁ దిరిగిచూచె.

విదూ—అట్లయిన బత్తెము కట్టుకొని సిద్ధముగనుండుము. నీవు తపోవనము నుద్యానవనముగఁ జేసికొన్నట్లున్నది పో!

రా—సఖుఁడా! కొందఱు తపస్వులు నన్నుగుర్తించినారు. ఏ నెపము మీద నీయాశ్రమమున మనము నిలువవచ్చునో నీవు కొంత యాలోచింపుము.

విదూ—రాజవైన నీకు వేఱొకనెపమేమున్నది? తాపసులు నీవారధాన్యమున నాఱవభాగము మాకుఁ గప్పముఁ జెల్లింపవలసినదని,

రాజు—మూర్ఖుఁడా! రత్నరాసులనుసైతము త్రోసిపుచ్చి మనము గ్రహింపఁదగిన కప్పము వీరిని రక్షించుటచే మనకు ముట్టుచున్నది. చూడు.

ఆ. వె. ప్రజలనుండు వన్నపార్థివులకుఁ జూడ
శాశ్వతంబుగాదు జగమునందు
అక్షయముతపమున నాఱవపాలిత్తు
రాటవికులు మాకునది ధ్రువంబు.

(తెరలో)

ఆహా మనము కృతార్థులము.

రాజు—(చెవియొగ్గి) ఓహో యీధీర ప్రశాంతస్వరమును బట్టిచూడ వీరు తాపసులు కావలయును.

దౌవారికుఁడు—(ప్రవేశించి) దేవా! జయముగుగాక! జయమగుగాక! ఋషికుమారులిద్దఱు ద్వారమందు వేచియున్నారు.

రాజు—అట్లయిన వారిని వెంటనే ప్రవేశపెట్టుము.

దౌవా—ఇదిగో తోడ్కొనివచ్చెదను.

(అని నిష్క్రమించి ఋషికుమారులతోఁ బ్రవేశించి)

తమరిటు దయచేయుఁడు.

(ఉభయులు రాజును జూచుచున్నారు.)

ప్రథముఁడు—కాంతిమంతుఁడయ్యు నీతఁడెంత విశ్వసనీయుఁడుగాఁ గనుపట్టుచున్నాఁడు. ఋషులకుఁ దనకు విశేషభేదములేని యీరాజున కిదితగియేయున్నది. ఏలయన,

ఉ. ఈనృపుఁడుండు నాశ్రమము దెన్నఁగ సర్వజనోపభోగ్యమై
బూనితపంబుఁ బెంచుదినముల్ ప్రజఁ బ్రోచియితండు దాంతుఁడై
వినికి రాజపూర్వమయి వెల్గెను సన్మునిశబ్దముం గోరిన్
దా నభమంటఁ జారణుల ద్వంద్వము పాడెను గీతికాళిన్.

ద్వితీ—గౌతమా! ఇతఁ డింద్రసఖుఁడగు దుష్యంతుఁడా?

ప్రథ—మఱేమి?

ద్వితీ—అట్లగుట నేకదా!

ఉ. వింతయొకింతలే దుదధివేష్టితభూవలయంబు నంత న
త్యంతము నీతఁడేలు నగరార్గళబాహుఁడొకండె యన్నస్వః
కాంతలు దైత్యవైరమునఁ గాంతురయోనర్తి జయంబు నీధరా
కాంతునధిజ్యచాపమునఁ గౌశికు వజ్రమునందు నన్నచోన్.

ఉభ—(సమీపించి) మహారాజా! విజయమగుగాక! విజయమగుగాక.

రాజు—(ఆసనమునుండి లేచి) మీ కభివాదము చేయుచున్నాను.

ఉభ—నీకు శుభంబగుగాక! (అని ఫలముల నర్పించుచున్నారు.)

రాజు—(నమస్కారపూర్వకముగ గ్రహించి) మీయాజ్ఞకు వేచియున్నాను.

ఉభ—తమరిచట నున్న ట్లాశ్రమవాసులకుఁ దెలిసి మనవి చేసికొనుచున్నారు.

రా—ఏమి యాజ్ఞాపించుచున్నారు.

ఉభ—"పూజ్యులగు కణ్వమహర్షులాశ్రమమున లేనందున రాక్షసులు మా యజ్ఞములకు విఘ్నముగలిగించుచున్నారు. కావున సారథి

సమేతముగ దేవరవారు కొలదిదినము లాశ్రమమును సనాథ
ముగఁ జేయుదురు గావుతమని"

రాజు—అనుగ్రహింపఁబడినాఁడను.

విదూ—(అపవారించి) ఇప్పు డీ వేడికోలు నీ కనుకూలమైనదే!

రాజు—(చిఱునవ్వుతో) రైవతకా! సారథితో బాణాసనముతో,రథమును
సిద్ధపఱచి తెమ్మని నేఁజెప్పినట్లు చెప్పుము.

దౌ—దేవరవారాజ్ఞాపించినట్లు. (అని నిష్క్రమించును.)

ఉభ—హర్షముతో

కం. పెద్దలయాచారంబది
యొద్దికమై ప్రోచునీకు నొప్పుఁగద యిదే
యుద్ధుర పౌరవులను
వృద్ధదీక్షితులార్త రక్షణాధ్వరములలోన్.

రాజు—(అంజలిఁజేసి) మీరుముందు సాగుఁడు. నేనును మీవెంట వచ్చు
చున్నాను.

ఉభ—జయముగుగాక! (అని నిష్క్రమింతురు.)

రా—మాధవ్యా! శకుంతలాదర్శన కుతూహలముకలదా!

విదూ—మొదటఁ గుతూహలము పొర్లిపోవుచుండెనుగాని యిప్పుడు
రాక్షస వృత్తాంతముచేత నొక్క బొట్టయినను మిగులలేదు.

రాజు—భయపడకుము. నాదగ్గఱనే యుందువుగానిలే.

విదూ—అట్లయిన! ఈరాక్షసబాధ యొకటితప్పినది.

(ప్రవేశించి)

దౌవా—రథ మాయత్తమైనది. దేవరవిజయప్రస్థానము నపేక్షించు
చున్నది. మఱియు నగరమునుంచి దేవేరులయాజ్ఞనుగొని కరభ
కుఁడిదె వచ్చియున్నాఁడు.

రాజు—(సాదరముగ) అమ్మగారు పంపినారాయేమి?

దౌవా—చిత్తము.

రాజు—ఓరీ ప్రవేశపెట్టుము.

దౌవా—చిత్తము. (అని నిష్క్రమించి కరభకునితోఁ బ్రవేశించి) వారే ప్రభువులు దగ్గఱకుఁబొమ్ము.

కరభ—ఏలినవారికి విజయమగుఁగాక. అమ్మగారిట్లాజ్ఞాపించు చున్నారు. "నేటికి నాలవదినమువరకు నుపవసించి యానాఁడు పారణఁజేయఁదగిన మద్వ్రతసమయమునఁ జిరంజీవిశప్పక వచ్చి నన్ను సంభావింప వలసినదని"

రాజు—ఇటఁ దపస్విజనకార్యము. అటగురుజనులయాజ్ఞ రెండును దాఁటగూడనివే! ఇపుడేమిచేయవలయును?

విదూ—త్రిశంకునింబోలె నంతరాళమున నిలువుము.

రాజు—నిక్కముగ నేను మిక్కిలి కలఁతఁ జెందియున్నాను.

గీ. రెం డవశ్యకృత్యంబులు రెండుచోట్లఁ
జేయఁదగినవియగుటచేఁ జిత్తమొందె
ద్వివిధభావంబు నొక మహాద్రియెదురఁ బ్రతి
హతమగుతరంగిణీ ప్రవాహంబువోలె.

(చింతించి) సఖుఁడా! మాయమ్మగారు నిన్నుఁ బుత్రునివలెఁ జూచుచున్నది. కావుననిక్కడనుండి బయలుదేరి తపస్వికార్యమందు నామనస్సు లగ్నమైనట్లు తల్లిగారికి నివేదించి వారికిఁ బుత్రకృత్యము నిర్వహింప నర్హుఁడవు.

విదూ—నన్ను రాక్షసులకు భయపడినవానిఁగాఁ దలంపవుగద!

రాజు—(మందహాసముచేసి) నీయందట్టిభావమెట్లు కలుగఁగలదు?

విదూ—అట్లయిన రాజుగారి తమ్ముఁడు వెళ్లునట్లు వెళ్లెదను.

రాజు—తపోవనమునఁ గలతలేకుండునట్లు చేయవలయును. కావునఁ బరివారము నందఱినీతోడఁ బంపెదను.

విదూ—అట్లయిన నిపుడు యువరాజనైతిని గదా!

రాజు—(తనలో) ఈ బ్రహ్మచారి చపలుఁడు. ఒకవేళ నాకోరిక నంతఃపురములోఁ జెప్పినను జెప్పవచ్చును. కానిమ్ము! ఇతనితో నిట్లు చెప్పెదను. (విదూషకుని హస్తముఁ బట్టుకొని ప్రకాశముగ) వయస్యా! ఋషులయందలి గౌరవమునుబట్టి యాశ్రమమునకుఁ

బోవుచున్నాను. తాపస కన్యకయందు నా కభిలాషయనునది సత్యముకాదుసుమా! చూడుము.

గీ. హరిణశాబకతతిఁ బెరిగి మరునిమాట
యే నెఱుంగని జనమీద నేడమనము
సఖుఁడ! మత్పరిహాస విజల్పితంబు
నెంచవలదయ్య పరమార్థమంచు మదిని.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ద్వితీయాంకము.

అభిజ్ఞానశాకుంతలము.

తృతీయాంకము.

(అంతటఁ గుశలను దీసికొని కణ్వుని శిష్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

శిష్యుఁడు—ఆహా! దుష్యంతమహారాజు మహానుభావుఁడు. పూజ్యుఁడగు నాతఁడు ప్రవేశించినంత మాత్రముననే యాశ్రమానుష్ఠానములు నిర్విఘ్నముగాఁ గొనసాగినవి.

గీ॥ నారిటంకృతి మాత్రనె దూరమునన
వింటివాఱంకృతి వన్నల్లు విఘ్నవితతిఁ
దఱుముచుండెడు నీతఁడే దారిఁజూడ
బాణసంధాన కథమఱి పలుకనేల!

వేదికపైఁబఱచుటకు నీదర్భలను ఋత్విజులకొఱకుఁ దీసికొని పోవుచున్నాను. (కొంచెము నడిచి యాకాశమువంకఁజూచి) ప్రియంవదా! ఈ వట్టివేళ్ళగంధమును, దూండ్లతోనున్న యీ తామరాకులను నెవ్వరినిమిత్తము గొనిపోవుచున్నావు? (వినుటనభినయించి) ఏమనుచున్నావు? ఎండదెబ్బచేత శకుంతల మిక్కిలి యస్వస్థురాలుగానున్నది. ఆమె శరీరతాపము నివారించుటకనియా! అట్లయిన శీఘ్రముగఁ బొమ్ము. ఆమె కులపతులగు కణ్వభగవానులకుఁ బ్రాణముకదా! నేనుగూడ యజ్ఞసంబంధమైన తీర్థము నామెకొఱకు గౌతమిచేతఁ బంపెదను. (అని నిష్క్రమించును.)

ఇది విష్కంభము.

(అంతటరాజు మదనార్తితోఁ బ్రవేశించుచున్నాఁడు.)

రాజు—(చింతతో నిట్టూర్పువిడిచి)

కం. తాపసవీర్యం బెఱుఁగుదు
నాపడతిపరవతి యగుట యట్లెఱుఁగుదునే

స్తోవనటుఁలయ్యె మనమది
యాత్రేయసినుండి త్రిప్ప హా యేమందుర్!

(మదనబాధ నిరూపించి) భగవానుఁడా! కుసుమాయుధుఁడా! నీవును శీతకరుండును గామిజనసమూహము నెంత నమ్మించి మోస పుచ్చుచున్నారు? ఏలయన,

ఉ. నీసుమసాయకత్వమును నీరజవైరి హిమాంశుకత్వమున్
నాసరివారియందివిగుణంబులు రెండునుగల్ల, మంచు పైఁ
బూసిన స్వాంశుజాలమునఁ బోరనఁ జెందురుఁడగ్గిఁ జల్లు నీ
వేసరి! వజ్రసారముల నేపునఁ జేసెదు పూవుటమ్ములన్.

అటుగాదేని,

కం. కాముఁడు నామదికనిశము
బాములు కల్పించియైనఁ బరమహితుండే
నేమన్ననట్టు లేఁచుట
యామది రేతుణనుగూర్చియ కదా తలఁపన్.

(కొంతనడిచి) ఇప్పటికి ఋషులయాగము ముగిసినది. సదస్యులచే ననుజ్ఞాతుండనై వచ్చితిని. మేనెల్ల బడలియున్నది. శ్రమపడి యున్న నాడెందము నెందు వినోదింపఁజేయుదును! (నిట్టూర్పు విడిచి) ప్రియురాలి దర్శనముకంటె నాకొండొక శరణమేమున్నది! నే నామెనే వెదకెదను. (సూర్యునివంకఁజూచి) ఈ మిట్టమధ్యాహ్నసమయమున నెండవేడిమికి శకుంతల చెలికత్తెలతో మాలినీ తీరమునఁ బొదరిండ్లయందుఁ ద్రాయికముగాఁ గాలముగడుపుచుండును. నే నచ్చటికే పోయెదను. (కొంతనడచి స్పర్శసుఖమును రూపించి) ఆహా ప్రకృష్టమైన మారుతముచే నీప్రదేశ మెంత మనోహరముగనున్నది.

గీ. మాలినీతరంగ మాలికాకణవాహి
పద్మసౌరభయుతపవనుఁడొప్పుఁ
గరముగాఁగిలింపఁగామసంతప్తాంగ
కములకెపుడు ప్రీతికరముగాఁగ.

(కొంతనడచి, చూచి) వేతసపరివృతమగు నీపొదరింట నామె యుండవలయును. నిజమే. (క్రిందుచూచి)

గీ. ద్వారమందిచట జఘనభారకలన
మసమమై పున లోతుగ మఱియు వ్రేళ్లి
వైపునందేలి నవపద పంక్తియిదిగో
కానవచ్చెడు స్వేతసైకతము నందు.

ఈ కొమ్మలసందునుండి చూచుచుండెదను. (ముందుసడచి అట్లొనరించి హర్షముతో) ఆహా కన్నులపండువైనది. ఇదె నామనోరథ ప్రియతమురాలు శిలాపట్టముపైఁ గుసుమశయనంబున సఖీజన పరివృతయై యున్నది. అగుఁగాక! వీరి విస్రంభాలాపముల వినుచుండెద.

(అని చూచుచు నిలుచున్నాఁడు.)

(యథోక్తవ్యాపారమున సఖులతో శకుంతల ప్రవేశించుచున్నది.)

సఖులు—(విసురుచు స్నేహముతో) సఖి శకుంతలా! నీకీ పద్మపత్రముల గాలి హాయిగానున్నదా!

శకు—సఖులారా! విసురుచున్నారాయేమి?

సఖు—(విషాదము నభినయించుచు నొకరినొకరు చూచుచున్నారు)

రాజు—శకుంతల మిక్కిలి యస్వస్థశరీరగాఁ గనబడుచున్నది. (వితర్కముతో) ఏమిది? ఎండదెబ్బయైయుండునా! లేక నే ననుకొన్నట్లునా! (అభిలాషతోఁ దిలకించి) ఇంతయేల? సందేహమే లేదు.

చ. స్తనయుగమందుశీరమును జారెడు నొంటి మృణాళకంకణం
బునుగల ప్రేయసీతనువు పొల్పగు మిక్కిలి నొచ్చియేనియుఁ
మనసిజ ఘర్మపీడల సమంబగుఁ దావముగాని స్త్రీలయం
దున నిటుదర్శనీయముగఁ దోఁచున గ్రీష్మకృతావరాధముల్.

ప్రియం—(జనాంతికముగ) అనసూయా! శకుంతల యారాజర్షిని దొలుతఁ జూచినదిమొదలు తహతహపడుచున్నట్లున్నది. ఈమె యస్వస్థత తన్నిమిత్తంబు కాదుగద!

అన—సఖి! నాకును మనసున నిట్టి సందేహమీగును అయిన నామె

నశిగెదను. (ప్రకాశముగ) సఖీ శకుంతలా! నిన్నొకమాట యడుగవలసియున్నది. నీకు సంతాప మధికముగా నున్నదికదా!

శకు—(పడకనుండి సగము లేచి) సఖి! ఏమియడుగఁ దలఁచితివి.

అన—సఖీ! శకుంతలా! మేము మదనవృత్తాంతమున బరిచయము లేనివారముగదా! అట్లయ్యు నితిహాస ప్రబంధములయందుఁ గామార్తుల కీయవస్థ వర్ణింపఁబడినదో! అట్టిస్థితిని నీయందుఁ జూచుచున్నాము. నీసంతాపమున కేమికారణము? చెప్పుము. వ్యాధి నిదానము నిక్కముగ నెఱుఁగక చికిత్స జేయరాదుకదా!

రాజు—నాకుఁ గలిగిన యూహయే యనసూయకుఁ గూడ గలిగినది. నాయభిప్రాయ ప్రకారమే యిట్లు తోఁచుచటకాదు.

శకు—(ఆత్మగతముగ) నావలపు మిక్కిలి యెక్కువగా నున్నదికదా! ఇప్పటికిని వీరికి శీఘ్రముగాఁ దెలుపఁ జాలకున్నాను.

ప్రియ—సఖీ శకుంతలా! ఈమె చక్కగఁ జెప్పినది. నీ వ్యాధినేలయుపేక్షఁ జేయుచున్నావు? నానాఁటికి నీయవయవములు కృశించి పోవుచున్నవి. లావణ్యమయమైన చాయ యొక్కటియే నీ శరీరమును వదలకున్నది.

రా—ప్రియంవద యథార్థము పలికినది. అట్లేకదా

చం. వదనమునందు నెంతయును వాడెఁ గపోలములక్కునన్ స్తనం
బుఁదోరగెఁ గక్కశత్వమదిబో త్రిగఁ జిక్కెనుగాను మూపులన్
వదులయి జాఱెఁ దెల్లఁబడె వన్నియశోచ్యయు దర్శనీయయౌ
నిదె కుసుమాయుధార్తయగు నింతి సదాగతి నాకు వాడియున్
ముదమిడు మాధవీలతికఁ బోలెఁ గనంబడునాదు చూడ్కికిన్.

శకు—సఖీ! మఱి యొరులకెవ్వరికిఁ జెప్పెదను? ఇప్పుడు మీకాయాసము గలుగఁ జేసిన దాననగుదును.

ఉభయులు—కావుననేకదా! నిన్ను నిర్బంధించుట. సఖులతోఁ బంచుకొన్నప్పుడేసుమా దుఃఖము భరింపనగును.

రాజు—

చ. ఇనుమలయందు సౌఖ్యము లనేకమతిన్ జరియించువారు ద
న్నడుగఁగ బాలయిద్ది హృదయంబునడాగిన యాధి హేతువు

న్నదువలఁబోదు మాటికినన్నందమిమున్నటుమళ్ళి చూచినఁ
గడువడినింతలో శ్రవణకాతరతఁ భ్రమఁజెందుదుఁగదా!

శకు—సఖీ! ఏనాఁడు తపోవనరక్షకుఁడైన రాజర్షి నాకంటఁబడెనో. (అని సగముఁజెప్పి లజ్జనభినయించు చున్నది.)

ఉభ—ప్రియసఖీ! చెప్పుము చెప్పుము.

శకు—అప్పటినుండియు నాతనియందలి యభిలాషచే నీయవస్థ నొందిన దాననైతిని.

రాజు—(సంతోషముతో) వినఁదగినది వింటిని.

గీ. జంతు సంతాపము నకు గ్రీష్మాంతమందు
నంబుదశ్యామమైన దినంబువోలె
మారుఁడే నాకుఁ దొలి తాపకారణంబు
వాఁడె సౌఖ్యప్రదుండయ్యె నేఁడుచూడ.

శకు—కాన మీకుసమ్మతమేని నేనట్లా రాజర్షియనుగ్రహమునకుఁ బాత్రురాలనగుదునోయట్లువర్తింపుఁడు. కాదేని నాకుఁ దిలోదకమును వదలుఁడు.

రాజు—ఈమాటతో సందేహము తీరినది.

ప్రియ—(జనాంతికముగ) అనసూయా! మితిమీఱిన మన్మథావస్థనొందిన యీయామె, కాలహరణము సహింపదు. ఈమె యెవనియందు బద్ధానురాగయైయుండెనో యతఁడు పూరువంశభూషణుండు. కావున నీమె యభిలాష యభినందింపఁ దగియున్నది.

అన—నీవు చెప్పినది సత్యమే.

ప్రియ—(ప్రకాశముగా) సఖీ! అదృష్టవశమున నీకోరిక యెంతయుఁ దగియున్నది. సముద్రమునుగాదని మహానది మఱిదేనిఁ జేరును? చిగిర్చిన మాధవీలతను సహకారముఁగాక మఱి యొకండేది భరించును?

రాజు—చంద్రరేఖను విశాఖ లనుసరించుటలో వింతయేమున్నది ?

అన—శీఘ్రముగాను గూఢముగాను మనసఖి మనోరథము నెఱవేర్చుట కేయుపాయముండును ?

ప్రియ—గూఢముగాఁ జేయువిషయ మాలోచింపవలెనేగాని శీఘ్రముగా నొనర్పుట సులభమే.

అన—ఎట్లు ?

ప్రియ—స్నేహభావము గలచూపులచే నీమొయందభిలాషను గనఁబఱచిన యారాజర్షి నిద్రలేక యిన్నాళ్లు కృశించుచున్నట్లు గనపట్టుచున్నాఁడు.

రాజు—నిజముగ నే నట్లులేనైతిని.

చ. మనమునఁబుట్టు తాపమున మాపునమాపున వచ్చునోచు బా
హాన నిడుకంటికోనఁ బడుచుండెడు నీటవివర్ణరత్నమా
కనకపుకంకణంబు గుణఘాతకిణంబులనాఁగి జాఱిపో
యిన మనికట్టునుండి లలినే నెగఁ ద్రోయుదు మాటిమాటికిన్.

ప్రియ—(ఆలోచించి) చెలీ ! ఆతనికొక మదనలేఖను వ్రాయనిమ్ము. దానిని బుష్పములనడుమదాచి దేవతాప్రసాదమును నెవమున నాతని చేతికందునట్లు చేసెదను.

అన—ఈసుకుమార ప్రయోగము నాకునచ్చినది. శకుంతల యేమనునో!

శకుం—మీనియోగము నెన్నఁడేని కాదంటినాయేమి?

అన—అట్లయినచో స్వవిషయమును వివరముగఁదెలుపునట్టి లలితపదబంధమును యోజింపుము.

శకు—సఖీ! యాలోచించెదను గాని తిరస్కారభయముచే నాచిత్తము త్తలపడుచున్నది.

రాజు—(సంతోషముతో)

గీ. ఎవఁడునిన్నొల్లఁడని భీరుహృదయుయంచె
దిదిగో నిన్గూడుతమి నతఁడిచటఁ గలఁడు
శ్రీని బ్రార్థింపఁజేరునఁ జేరకుండు
లక్ష్మియేకోరనెవఁడు దుర్లభుఁడుజగతి.

సఖులు—స్వసౌందర్యము నవమానించుకొను నోశకుంతలా! ఇప్పుడు దేహతాపశాంతికరంబగు శరత్కాలపు వెన్నెలనెవఁడేనిఁ జేలాంచలమున వారించునా?

శకు—(చిఱునగవుతో) ఇప్పుడు మీరుచెప్పిన పనిలోనున్నాను. (అని కూర్చుండి యాలోచించుచున్నది.)

రాజు—తెప్పపాటు మఱచినకనులతోఁ బ్రియురాలి నవలోకించెదను. ఇది యుక్తమేకదా!

గీ. ఇంతి పదములఁగూర్చెడు చింతనెత్తు
కన్నుబొమగలమోముది కంటకితక
పోలమునఁదెల్పుచున్నదిహా! తలంప
నంగనకు నాయెడఁగల ప్రేమాతిశయము.

శకుం—సఖీ! పద్యమునవ్రాయఁదగు విషయమాలోచించితిని. లేఖన సాధనములు దాపున లేవుగదా!

ప్రియ—కీరగర్భకోమలమైన యీపద్మదళంబున నఖంబులతో నక్షరముల లిఖింపుము.

శకుం—(చెప్పినట్లుచేసి) ఇందలియర్థము చక్కఁగఁ బొందుపఱుపఁబడి యున్నదో లేదో వినుఁడు.

సఖులు—జాగరూకులమై యున్నాము.

శకుం—(చదువుచున్నది.)

కం. నేనెఱుఁగను నీ హృదయం
బో నిర్దయ హృదయ మరుఁ డహోరాత్రంబుల్
* తానత్యంతం బేఁచెడు
హా! నినుఁదమిగోరు నస్మదంగము లన్నిన్.

రాజు— (సత్వరముగఁ బ్రవేశించి)

గీ. ఇంతి తపియించునిను మరుఁడింతియకడ
నన్నుఁటన్న నోదహించుచున్నవాఁడు
వాసరంబది రాజను వాడ్చురీతి
వాడఁజేయుదు గద కుముద్వతినిఁజగతి.

సఖులు—(హర్షముతో) ఈప్సితార్థస్వరూపుఁడవగు నీకు స్వాగతము.

శకుం—(ప్రత్యుత్థానము జేయ నిచ్ఛగించును.)

* (పాఠ) తానుంగడునేఁ చెడుగద.

రాజు—ఆయాసపడవలదు.

గీ. రమణి! సంసక్తపుష్పాస్తరణములాకు
శోషిత మృణాళ భంగసంసురభిళములు
గురు పరీతాపములునీదు కోమలాంగ
ములివి పరికింప నుపచారమునకుఁ దగవు.

అన—ఈజాలిమీఁద నొక ప్రదేశము ప్రియవయస్యుఁ డలంకరించుఁగాక.

రాజు—(కూర్చుండును. శకుంతల సిగ్గుపడుచుండును.)

ప్రియ—మీయిరువురకును గల యన్యోన్యానురాగము ప్రత్యక్షమయి నను సఖీ స్నేహము నన్ను మరల నడుగునట్లు చేయుచున్నది.

రాజు—కల్యాణీ! ఇది మానఁదగనిది. చెప్పవచ్చినమాట చెప్పకుండుట యనుతాపమును గలిగించును.

ప్రి—ఆపన్నులగు విషయవాసులైన నరులయార్తి హరించుట మీకు ధర్మము.

రాజు—దానికంటె నుత్కృష్టధర్మము రాజునకులేదు.

ప్రియ—అట్లయిన నీ మాప్రియసఖయగు శకుంతల నిన్నుఁగూర్చి మన్మథుని చే నిట్టి యవస్థఁబొందింపఁబడినది. కావునఁ గరుణించి మాచెలి ప్రాణముల నిలువఁబెట్ట నర్హుఁడవు.

రాజు—కల్యాణీ! ఈప్రార్థన మీరువురకు సమానమే. అన్నివిధముల ననుగ్రహింపఁబడితిని.

శకు—(ప్రియంవదనుజూచి) సఖీ! అంతఃపుర జనవిరహముచే వేగుచున్న యీరాజర్షి నేల ప్రతిబంధించెదవు?

రాజు—గీ. హృదయ సన్నిహితా! మదిరేక్షణా! య
నన్యసక్తంబు నాహృదయంబు దాని
నన్యథా సమర్థించితే సంగజశర
హతుఁడనైనట్టి నేఁ బునర్హతుఁడ నగుదు.

అన—ఆర్యా! భూకాంతులు బహుకాంతాప్రియులని వినికిడి. మాప్రియసఖి బంధుజన శోచనీయ కాకుండ నట్లాదరింపుము.

రాజు—కల్యాణీ! పెక్కుమాట లేల?

గీ. ఎందఱిల్లాండ్రు గలిగిన నేమిఫలము
కులము వెలయింపనిరువురే గలరునాకు
వనధి మేఖలయైన యావసుమతియును
మీకుఁ జెలియై చెలంగు నిమ్మాస నయన.

ఉభ—ఆనందించితిమి.

ప్రియ—(చూపుసిగిడించి) అనసూయా! ఇదిగో లేడిపిల్ల యుత్కంఠతో నిటువైపు చూచుచుఁ దల్లిని వెదకుచున్నది. ఈపిల్లను దల్లిని జేర్చుదము రమ్ము (అని యిద్దరు బయలుదేరి పోయెదరు).

శకు—చెలులారా! నిరాశ్రయురాలనైతిని. మీ యిరువురలో నొకరు నాదగ్గఱకు రండు.

ఉభ—పృథ్వికంతకును శరణమైనవాఁడు నీ సమీపమునన్నాఁడు (అని నిష్క్రమింతురు.)

శకు—సఖులు పోనేపోయిరి, ఇఁకెట్లు?

రాజు—సంభ్రమమేల? నిన్నారాధించు సేవకుఁడు నీసమీపముననే యున్నాఁడు.

చ. శ్రమమునడంపఁజాలు కడుచల్లని పద్మదళంపుతాళవృం
తములను నార్ద్రవాతములఁ దద్దయు వీతునో? లేక పద్మరా
గములగు నీపదంబుల సుఖంబుగ నో కరభోరు నాదువం
కమునను జేర్చి హస్తనలినమ్ముల సంహాన నమ్మనర్తునో!.

శకు—సమ్మానింపఁదగినవారియెడ నపచారము చేయఁజాలను (అని లేచి పోనిచ్ఛగించుచున్నది.)

రాజు—సుందరీ! ఎండవేడిమింకనుదగ్గలేదు. నీశరీరావస్థయు నిట్లున్నది!

ఆ. వె. పద్మనయన పూలపాన్పు, నబ్జదళకృ
తస్తనావరణముఁ దద్దవిడిచి
పంచబాణుబారి బడలు నంగంబుల
నా తపమున నెట్లు లరిగెదీవు.

(అని బలవంతముగా నామెను మరల్చుచున్నాఁడు)

శకుం—పౌరవా! సౌశీల్యము గాపాడుము. మదనపీడితనైనను నేనుస్వతంత్రురాలను కానుగదా!

రాజు—పిఱికిదానా! గురులవలని భయమువలదు. పూజ్యుండును, ధర్మజ్ఞుఁడును నైన కులపతికిఁ దెలిసినను నీయందిది దోషముగా నెంచఁడు. చూడు.

కం. తొలి రాచతపసికన్నెలు
వలువురు గాంధర్వ విధిని బరిణీతలనర్
దలిదండ్రులచే నటవా
రలుసభినందితలు సనఁగ రమణీ వినమే.

శకుం—ఇప్పటికి నన్ను విడువుము. సఖీజనుల యనుమతిఁ బడసి తిరిగివచ్చెదను.

రాజు—కానిమ్ము! వదలెదను.

శకుం—ఎప్పుడు ?

రాజు—గీ. అనుపహాత మృదులనవసుమాసవంబు
భృంగమల్లన నానెడు భంగిసదయ
ముఁగను నీయధరామృతంబు తమిదీరఁ
గ్రోలు నవలగద మదమరాళగమన.

(అని యామె ముఖము నెత్తఁబోవును.)

శకుం—(నివారించుట యభినయించును.)

నేపథ్యమున

ఓ చక్రవాకవధూటీ! నీసహచరుని వీడ్కొనుము. రాత్రి సమీపించుచున్నది.

శకుం—(సంభ్రమముతో) పౌరవా! సందేహము లేదు. నాశరీర వృత్తాంతమును విచారించుటకుఁ బూజ్యురాలగు గౌతమి యిచ్చటికే వచ్చుచున్నది. కావునఁ గొమ్మల చాటున నుండుము.

రాజు—అట్లే (కొమ్మల మఱుగున దాగియుండును)

(అంతట హస్తమునందొకపాత్ర నుంచుకొని గౌతమి సఖులతోఁ బ్రవేశించుచున్నది.)

సఖులు—అమ్మా గౌతమీ! ఇటు! ఇటు!

గౌతమి—(శకుంతలను సమీపించి) బిడ్డా నీ శరీరతాపము తగ్గినదా!

శకుం—నాకుఁ గొంత మార్పుకలదు.

గౌతమి—ఈ దర్భోదకముచేత నీ శరీరబాధ యంతయుఁ దొలఁగిపోఁగలదు. (అని శకుంతలశిరస్సుమీఁద ప్రోక్షించి) వత్సా! సాయంకాలమైనది. పర్ణశాలకే పోవుదము రమ్ము. (అని బయలుదేరుదురు.)

శకు—(ఆత్మగతము గ) హృదయమా! ప్రథమమున సుఖముగ మనోరథములభింపఁగా భీరుత్వమును విడువవైతివి. పశ్చాత్తాపపూర్వక విఘటనమునకు నిప్పుడు నీకు సంతాపమేల? (కొంతనడచి, యచ్చటనిలిచి ప్రకాశముగ) సంతాపమునార్చు నో లతాగృహమా! మరల నిన్ననుభవించుటకు వచ్చెదను. అనుజ్ఞయిమ్ము. (అని విషాదముతో శకుంతల తక్కినవారితో నిష్క్రమించును.)

రాజు—(పూర్వస్థానము ప్రవేశించి నిట్టూర్పువిడిచి) అయ్యో! అభీప్సిత కార్యసాఫల్యమునకు నంతరాయము లుండునుగదా!

* గీ. అసకృదంగుళీ సంఛాదితాధరము, ని
షేధవర్ణవిక్లబ సురుచిరము భుజ శి
రోవివర్తియౌ పక్ష్మలాక్షీవదనము
నెట్టులో యెత్తియును ముద్దుపెట్టుకొనను.

నేనిప్పు డెచ్చటికినిపోవుదును! ప్రియురాలనుభవించి వదలిన యీ లతాగృహమునం దిప్పుడు కొంచెము సేపు నిలిచెదను. (కలయఁజూచి)

చం. ఇదె శిలదేహసంమృదితమింతి సుమాస్తరణమ్మిదే నవా
బ్జదళనఖాంకురార్పితము వాడినతత్కుసుమాస్త్రలేఖ యి
య్యదెకద తత్కరచ్యుత బిసాభరణంబని చూచి చూచి వే
కదలఁగఁ జాలవేతసనికాయము వెళ్ళడి శూన్యమైననున్.

* గీ. సారెకధరంబు వ్రేళ్ళచేఁ జాటుచేయు । చస్ఫుటముగ నిషేధవాక్యములఁ బలుకు
చంసమునకుఁ ద్రిప్పెడు పక్ష్మలాక్షి ముద్దు । మోమెట్టోయెత్తితిని గాని ముద్దుగొన.

ఆకాశమున

ఓ రాజా!

ఉ. సాయమునందుఁ జేయఁదగు జన్నముఁ బాసల్పెడు వేళ నగ్నిహో
త్రాయతనైకవేదివయి నల్లవె మిక్కిలి భీతిఁగొల్పుచుఁ
బాయక సంచరించు బహుభంగుల సాంధ్యపయోద పింగళ
చ్ఛాయల రాక్షసౌఘముల చాయలు చూడఁగ నెల్లచాయలన్.

రాజు—ఇదిగో వచ్చుచున్నాను. వచ్చుచున్నాను. (అని నిష్క్రమించును).

తృతీయాంకము
సంపూర్ణము.

అభిజ్ఞానశాకుంతలము.

చతుర్థాంకము

విష్కంభము.

(అంతట సఖులిద్దఱు పువ్వులుగోయుట యభినయించుచుఁ బ్రవేశించు చున్నారు)

అనసూయ—సఖీ! ప్రియంవదా! మన శకుంతల గాంధర్వ వివాహము చేఁ దగినవరుని బొందినదని నాచిత్తమునకు సంతోషమేకాని ఇది యొక్కటిమాత్ర మాలోచింప వలయును.

ప్రియ—ఏమది?

అన—ఇప్పు డారాజర్షి యజ్ఞమును బరిసమాప్తముచేసి ఋషులచే ననుజ్ఞవడసి స్వనగరమును బ్రవేశించి యంతఃపుర స్త్రీలంగూడినవాఁడై యిచటి వృత్తాంతమును స్మరించునో లేదోయని.

ప్రియ—నమ్మకము కలిగియుండుము. అట్టి స్వరూపాతిశయము గుణవిరోధముగా నుండదుసుమా! అయినను దండ్రిగారీ వృత్తాంతమును విని యేమందురో తెలియరాదు.

అన—నాకుఁ దోఁచినంతవఱకు నిదియాయనకు సమ్మతముగనే యుండును.

ప్రియ—ఎట్లు?

అన—గుణవంతునికిఁ గన్య నీయవలయుననికదా ప్రథమ సంకల్పము. దానిని దైవమే సమకూర్చినప్పుడు తండ్రిగారాయాసపడకయే కృతార్థులైనారుగదా.

ప్రియ—(పువ్వుల బుట్టనుజూచి) సఖీ! బలికర్మమునకుఁ జాలినన్ని పూవులు కోసితిమి.

అన—చెలీ! మన ప్రియసఖియగు శకుంతల సౌభాగ్యదేవతనుగూడ నర్చింపవలెనుగదా!

ప్రియ—ఓను నిజమే! (అని యూపవనినే యూరంభించు చున్నారు)

నేపథ్యమున

ఓహో! నేనిదె వచ్చినాఁడను.

అన—(చెవియొగ్గి) సఖీ! అతిథులమాటవలె నున్నది.

ప్రియ—శకుంతల పర్ణశాల సమీపముననే యున్నదిలెమ్ము.

అన—ఇప్పుడు బొత్తిగా నామెమనసు మనసులో లేదు. ఈపువ్వులు చాలును. (అని బయలు దేరును)

(నేపథ్యమున)

ఓసీ! అతిథినిఁ బరిభవించినదానా!

గీ. ఎవని నీవనన్యమతిలో నెంచుచుండి
సను దపోధను నెదుటవచ్చిన యతిథినిఁ
దెలియవో వాఁడుమఱచునిను దెలుపఁబడియు
మత్తుఁడు ప్రథమకృత కథమఱచుభంగి.

ప్రియ—అకటకటా! అప్రియమేజరిగినది. శూన్యహృదయయగు శకుంతల పూజనీయుఁడగు నెవనియెడలనో యపరాధము చేసినది. (ముందుకు దృష్టిని బ్రసరించి) ఎవనియెడలనో యనుకొననేల మక్కువ కోపముగల యా దుర్వాసమహర్షియే మనసఖినట్లు శపించి దుర్వారవేగముతోఁ దిరిగిపోవుచున్నాఁడు.

అన—తగులఁబెట్టుట కగ్నిదేవునికంటె సామర్థ్య మెవరికిఁ గలదు? పోపొమ్ము. పాదములకు మ్రొక్కి యాయనను మఱలింపుము. ఇంతలో నే నర్ఘ్యోదకము సమకూర్చెదను.

ప్రియ—అలాగే (అనినిష్క్రమించును.)

అనసూ—(ఒకయడుగునడిచి కాలుజారుటనభినయించి) అయ్యో! వేగముగ నడుచుటచేఁ గాలుజారినందునఁ జేతినుండి పువ్వులబుట్ట క్రిందఁబడినది. (అని క్రిందఁబడిన పువ్వుల నేఱుచున్నది)

(ప్రవేశించి)

ప్రియ—సఖీ! స్వభావకుటిలుఁడైన యాతఁడెవ్వరి వేఁడికోలు నంగీకరించును? అయినను కొంతవఱకుఁ బ్రసన్నునిఁ జేసి వచ్చితిని.

అన—(విజునగవుతో) అతనియెడ నదియే పదివేలు. చెప్పుము.

ప్రియ—ఎంతకును మరలనొల్లకుండుటఁజూచి నే నిట్లు విన్నవించుకొం టిని. "మహాత్మా! తపఃప్రభావము నెఱుఁగని యీ బిడ్డచేసిన యొక్కతప్పిదమును మొదటిదనియెంచి మీరు మన్నింపవలె"నని

అన—తరువాత! తరువాత!

ప్రియ—అంతట నతఁడు నా వచనమన్యథా జరుగదు. అయిన నానవాలు కొఱకిచ్చిన యాభరణముఁ జూపుటచేత శాపము నివర్తించునని చెప్పుచు నంతర్ధానుఁడైనాఁడు.

అన—ఇప్పుడు మన మూఱడిల్లవచ్చును. ఆరాజర్షి వెడలిపోవునప్పుడు స్వనామధేయాక్షరములుగల యుంగరము జ్ఞాపకార్థము, తానే యిచ్చినది యున్నదికదా! దానశకుంతల స్వాధీనోపాయయే.

ప్రియ—సఖీ! రమ్ముపోదము. దేవకార్యమును నెఱవేర్తము.

(ఇట్లు బయలుదేరుదురు.)

ప్రియ—(చూచి) అనసూయా! అల్లదె చూడుము. మనప్రియసఖి యెడమచేతఁ దనవదనమునానించుకొని చిత్తరువునఁ వ్రాయఁబడినట్లున్నది. భర్తమీఁదిచింతచేఁ దన్నేఁ దానెఱుఁగకున్నది. ఇఁకనాగంతుకునిమాట చెప్పవలెనా?

అన—ప్రియంవదా! మననోటిలోనే యీ వృత్తాంత ముండవలయును సుమా! ప్రకృతికోమలయగు ప్రియసఖి రక్షింపఁదగినదిగదా!

ప్రియ—వేఁడినీళ్ళచే పిరజాజుల నెవ్వఁడుతడుపును.

(అని నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

(అంతట నిద్రనుంచి లేచిన శిష్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

శిష్యు—ప్రవాసము నుండివచ్చిన పూజ్యులగు కాశ్యపులు వేళనుజూచి రమ్మని నన్నునియమించినారు. బయటికిఁబోయి రాత్రి యింకనెంతయున్నదో చూచెదను. (అనిపోయిచూచి) అయ్యో తెల్లవారినది. ఔను.

ఉ. చనియెడు నోషధీశుఁడొకచాయను దా నపరాద్రిమీఁదికిన్
దినకరుఁడొక్క ప్రక్క నరుదేరుననూరు పురస్సరుండునై
యనయము రెండు తేజములకౌ యుగపద్వ్యసనోదయమ్ములన్
జనముపదిష్టమౌనటు నిజమ్ముగ నాత్మదశాంతరమ్ములన్.

మఱియును.

చ. అరయఁగనాకుముద్వతియె యస్తగిరిన్ శశి చేరనాఁకుఁ దా
మురిపెముగొల్పకున్నయది మున్నటు సంస్మరణీయశోభయై
కరము ప్రియప్రవాసమునఁ గల్గెడునయ్యబలాజనంపు ము
మ్మరమగుబాధలౌర యతిమాత్ర సుదుస్సహముల్ గదా భువిన్.

(తెఱను ద్రోసికొని ప్రవేశించి)

అన—విషయపరాఙ్ముఖమైన జనమునకునిట్టి దెంత తెలియకపోయినను, శకుంతలపట్లమాత్రము రాజుచే నధర్మమే యాచరింపఁబడినది.

శిష్య—హోమవేళ సమీపించినదని గురువునకు నివేదించెదను.

(అని నిష్క్రమించును.)

అన—తెలిసికొన్నను నేనేమిచేయఁగలను? ఉచితమైన నిజకృత్యములందుఁ గూడ నాకుఁగాలుసేతు లాడకున్నవి. అసత్యసంధుఁడగు రాజునెడ శూన్యహృదయయగు మా సఖ కభిలాష కలిగించిన కాముని కోరిక లీడేరును గాక. ఒకవేళ దుర్వాసశాపంబున నిట్టి మఱపు కలిగెనేమో! అట్లుగానియెడల నటువంటి మాటలు చెప్పి పోయిన రాజర్షి యిన్నిదినముల కొకలేఖనైనఁ బంపియుండఁడా! కావున నిటనుండి యానవాలుగా నొసఁగఁబడిన యుంగరము నతని కంపెదము. ఆహారాదినియమములచేఁ గష్టజీవులగు సిఋషుల యం దెవ్వరినిఁ బ్రార్థింపనగును! సఖ యందే తప్పుండుటచేఁ బ్రవాసమునుండి వచ్చిన కాశ్యపులకు దుష్యంతుని వివాహము చేసికొని గర్భవతిగ నున్న శకుంతలఁగూర్చి నివేదింప నోరాడకున్నది. ఇట్టి సమయమునందు మేమేమి చేయఁదగును.

(ప్రవేశించి)

ప్రియం—(హర్షముతో) సఖీ! మన శకుంతలకుఁ బ్రయాణోత్సవము

చేయుటకుఁ ద్వరపడుము! త్వరపడుము.

అన—ఇది యెట్లు సఖీ!

ప్రియ—వినుము. "సుఖముగ నిద్రపట్టినదా!" అని యడుగుటకు నిపుడే శకుంతలయొద్ద కేగితిని.

అన—తరువాత! తరువాత!

ప్రియ—అప్పుడు లజ్జావనతముఖయగు శకుంతలను కౌఁగిలించుకొని తండ్రి కాశ్యపులే యిట్లభినందించిరి. "పొగచేఁగన్నులు కానరాకున్నను యజమానుని యాహుతి యదృష్టముచే నగ్నిహోత్రుని యందే పడినది. బిడ్డా! మంచిశిష్యునకిచ్చిన విద్యవలె నీవు నాకు నిర్విచారముఁ గల్పించితివి. ఇప్పుడే నిన్ను ఋషులను దోడిచ్చి నీభర్తసమీపమున కనిపెదను.

అన—కాశ్యపులకీ వృత్తాంతము నెవరు చెప్పిరి?

ప్రియ—అగ్నిశాలను బ్రవేశించిన కణ్వునికి నశరీరవాణి ఛందోబద్ధమైన వాక్కుచేఁ జెప్పినది.

అన—(విస్మయముతో) ఏమని చెప్పెను?

ప్రియ—గీ. అగ్నిగర్భశమీలత యట్లు నీదు
దుహిత దుష్యంతభూపతినిహితతేజ
మవని మండలైశ్వర్య సంప్రాప్తికొరకుఁ
దాల్చియున్నది తెలియుమా తాపసేంద్ర!.

అన—(ప్రియంవదను కౌఁగిలించుకొని) సఖీ! నాకు సంతోషమైనది! అయిన, శకుంతలను నేఁడే పిలుచుకొని పోవుచున్నారని యుత్కంఠతోఁ గూడిన సంతోషము ననుభవించుచున్నాను.

ప్రియ—సఖీ! మనచింత నెట్లో పోఁగొట్టుకొందము. పాపమామె సుఖపడుఁగాక.

అన—అట్టయిన నీచూతశాఖకుఁ దగిల్చిన కొబ్బరియాకుల బుట్టలో నెన్నిదినములైన (వాసనచెడక)నుండు పొగడపూవులదండనామె కొఱకు నుంచితిని కాన దీనిని చేతఁబుచ్చుకొనుము. నేనుగూడ నీలోపల నామెకై గోరోచనతీర్థమృత్తికా, దూర్వాంకురములు

మొదలగు మంగళానులేపనములు సిద్ధము చేసెదను.

ప్రియ—అట్లే చేయుము.

(అనసూయ నిష్క్రమించును. ప్రియంవద పువ్వులు కోయుట యభిన యించుచున్నది.)

నేపథ్యమున

గౌతమీ! శార్ఙ్గరవమిశ్రులకు శకుంతలను గొంపోవ నాజ్ఞాపింపుము.

ప్రియ—(చెవియొగ్గి) అనసూయా! త్వరపడుము! త్వరపడుము! ఇదిగో వీరే హస్తినాపురమునకేగు ఋషులు కేకలు వేయుచున్నారు.

(మంగళానులేపనములఁ జేతనుంచుకొని ప్రవేశించి)

అన—సఖి! రమ్ము పోదము. (అని వెళ్ళుదురు)

ప్రియ—ఇదిగో! శకుంతల సూర్యోదయముననే యభ్యంజన స్నానమాచరించి నీవారాక్షతలు చేతఁ బూని యాశీర్వదించు తాపసస్త్రీలచే గొనియాడఁబడుచున్నది. ఈమె దగ్గరకుఁ బోవుదము రమ్ము.

(అని సమీపింతురు.)

(అంతట నిదివరకుఁ జెప్పబడి నట్లాసీనయై శకుంతల ప్రవేశించుచున్నది.)

ఒకతాపసి—(శకుంతల నుద్దేశించి) పుత్రీ! భర్తృగౌరవ సూచకమైన పట్టమహిషీబిరుదమునుఁ బడయుము.

రెండవది—వత్సా! వీరమాతవుకమ్ము!

మూడవది—మగనిమన్ననఁ బడయుము.

(ఇట్లాశీర్వదించి గౌతమితక్క తక్కినవారలు నిష్క్రమింతురు)

సఖులు—(సమీపించి) సఖి! నీకు సుఖాభిషేకమగుగాక!

శకుంతల—సఖులకు స్వాగతము. రండు. ఇటఁ గూర్చుండుఁడు.

ఉభ—(శోభనపుష్పాది భాజనములఁ దెచ్చి కూర్చుండి) సఖి! సిద్ధముగా నుండుము. ఇదె నీకు మంగళాంగరాగము నలందెదము.

శకుం—ఇదియును నాకు మిక్కిలి యాదరణీయము! ఇఁక సఖుల యలంకరణము నాకు దుర్లభమయ్యెడినిగదా! (అని కన్నీటిని విడుచుచున్నది.)

ఉభ—శుభసమయమునం దిట్లేడ్చుట నీకు నుచితము కాదు. (అని కన్నీటినిఁ దుడిచి యలంకరించుట యభినయింతురు.)

ప్రియ—భూషణార్హమైన నీసౌందర్య మాశ్రమ సులభములైన యలంకారములచే వికారము నొందుచున్నది. (కానుకలను జేతఁబట్టుకొన్నవారై యిరువురు ఋషికుమారులు ప్రవేశించి)

ఉభ—ఇవిగో సొమ్ములు. పూజ్యురాలగు శకుంతల నలంకరింపుఁడు.

(అందఱుచూచి యాశ్చర్యపడుదురు)

గౌతమి—వత్సా! నారదా! ఇవియెక్కడవి?

ప్రథమః—తండ్రి కాశ్యపుల ప్రభావమువలనఁ గలిగినవి.

గౌతమి—మానససిద్ధివలననాయేమి?

ద్వితీ—అటుకాదు వినుఁడు. శకుంతల నిమిత్తము వృక్షములనుండి కుసుమములఁ దెమ్మని తండ్రిగారు మాకు నాజ్ఞాపించినారు. అంత నిప్పుడు.

మ. తరువొం డిచ్చెను చంద్రపాండురలసత్క్షౌమంబు మాంగళ్యముఁ
జరణాలంకరణైకయోగ్యమగు లాక్షావృత్తి మొం డిచ్చె నా
భరణంబుల్ పెఱిచ్చెఁ గిసలయాభాసించునాపర్వ ని
స్సరణాంచద్వనదేవతాకరతలాబ్జాతంబులన్ బ్రీతిమై.

ప్రియ—(శకుంతలనుజూచి) సఖీ! యీయనుగ్రహవిశేషము చేత నీవు భర్తృగృహమునం దనుభవింపఁదగిన రాజ్యలక్ష్మి సూచింపఁబడినది.

(శకుంతల సిగ్గుపడుట నభినయించును.)

ప్రథ—గౌతమా, రమ్ము, రమ్ము, స్నానార్థమేగిన కాశ్యపులకు వనస్పతిసేవను నివేదింతము.

ద్వితీ—అట్లే. (అని యిరువురు నిష్క్రమింతురు.)

సఖులు—సఖీ! మేము భూషణముల నుపయోగించిన వారము కాము. చిత్రకర్మపరిచయముచే నీ యంగకముల నీ సొమ్ములచే నలంకరింతుము.

శకు—మీ నైపుణ్యము నే నెఱుఁగుదును.

(ఉభయులు నలంకరించుటయభినయింతురు.)

(అంతట స్నానము చేసివచ్చిన కాశ్యపుఁడు ప్రవేశించును.)

కాశ్యపుఁడు.

శా. ఏగున్నేఁడిదె తా శకుంతలయనఁ బ్రాప్తిన్మనుష్కంఠయా
నాఁగఁ బాష్పములెల్లఁ రాల్చుచియె మాంద్యంబందెఁ జూపిట్టఁ బగన్
రాగంబాకుల పెట్టునన్న యిటరణ్యస్థున్, గటా, యింక నే
లాగున్ గేస్తులు వంతనొందరొకో పిల్లన్ బ్రోగా బంపుచోఁ.

(అని నడచుచున్నాఁడు.)

సఖులు—సఖీ! శకుంతలా! అలంకరణమైనది. ఇప్పు డీ పట్టుబట్టలజత ధరింపుము. (శకుంతల లేచి ధరించును.)

గౌతమి.—కుమారీ, ఇదిగో నీతండ్రి యానందప్రవాహము పొరలు నేత్రములతో నాలింగనము చేయువానివలె వచ్చుచున్నాఁడు. ఆచారముచొప్పున మెలంగుము.

శకు—(సిగ్గుతో) తండ్రీ, వందనము.

కాశ్య—పుత్రీ!

కం. అంగిరస్మిష్ఠయు యాతికి
వలె నీభర్తకును నీవు బహుమతవగుమా
యెంనాగ మున్నుపూరుం
బలె సుతునిఁ నీవుఁ జక్రవర్తినిఁ గనుమా.

గౌతమి—స్వామీ, ఇదివర మేకాని యాశీర్వాదము కాదు.

కాశ్య—వత్సా! ఇప్పు డీ హోమము చేసిన యగ్నులకు నిటుప్రదక్షిణము చేయుము.

(అందఱు పరిక్రమించుచున్నారు.)

కాశ్య—(ఋక్ఛందస్సుచేత నాశీర్వదించుచున్నాఁడు.)

గీ. విరచితస్థానములుగల్గి వేదినంత
టసమిధలు వెలుఁగ నలుగడలను గుశలు
వఱల హవ్యగంధమ్ములఁ బాపచయముఁ
బాఱఁ ద్రోలెడు వై తానవవహ్నులీయ
పావనిని నర్చుఁగావుత బాలనిన్ను.

ఇఁక బయలుదేరుము.

(దృష్టిప్రసారణము చేసి) ఆశార్ఙ్గరవ మిశ్రులెక్కడ ?

(ప్రవేశించి)

శిష్యుఁడు — దేవా ! ఇదె వచ్చితిమి.

కాశ్య — మీ చెల్లెలికి మార్గమును జూపుఁడు.

శార్ఙ్గరవుఁడు — అమ్మా ! ఇటు ! ఇటు !

(అందఱును నడిచెదరు)

కాశ్య — ఓహో ! సమీపతపోవనవృక్షములారా !

మ. తొలుతన్ మీరు గ్రహింపకెవ్వరితె తాఁదోయంబులం గ్రోలదో
తలిరుల్ స్త్రీప్రియభూషయయ్యును భవత్సఖ్యంబునన్ గోయదో
యలరుల్ పుట్టఁగ నద్దిమీకెవతె కౌనానంద మాయీ శకుం
తల ప్రాణేశ్వరునింటికేగెడు ననుజ్ఞన్ మీరలిండెల్లరున్.

(కోకిలరవమును సూచించి)

కం. ఈవినఁబడు కోకిలకల
రావమునం బ్రతివచనముగా ననుమతియా
దావిడఁగ నీ శకుంతల
యీ వనసంవాసబంధు వృక్షంబులచేన్.

(ఆకాశమున)

శా. అందందున్ నళినీ హరిత్సరసులత్యాహ్లాదముల్ గూర్ప పో
కందీవ్రార్క మయూఖ తాపమును వృక్షచ్ఛాయ వారింపఁగాఁ
గ్రిందన్ బద్మపరాగమట్లు మృదువౌ కెంధూళి వర్గన్ పథం
బంకంబై హితశాంతమారుతము నై యానన్ శివంబౌ మొకున్.

(అందఱు నాశ్చర్యముతో వినుచున్నారు.)

గౌ — బిడ్డా ! బాంధవజన స్నేహముగల తపోవనదేవతలచేఁ బోననుజ్ఞ వడసితివి. దేవతలకు నమస్కరింపుము.

శకు — నమస్కార పూర్వకముగా నడచి (జనాంతికముగ) సఖీ! ప్రియంవదా! ఆర్యపుత్రుని దర్శింప నుత్కంఠకలిగినను నాశ్రమమును

వీడు దుఃఖముచే నాయడుగులు ముందుకుఁ గష్టముమీఁద సాగుచున్నవి.

ప్రియ — సఖిమాత్రమే తపోవనమును విడుచుటకు దుఃఖించుటకాదు. నిన్నెడఁబాయనున్న యీతపోవనమునకును నట్టి యవస్థయే కానఁబడుచున్నది.

గీ. జార్చు హరిణములు కుశగ్రాసములనోట
నాటమాని నెమ్ములాట్టనిలుచు
సశ్రువులను రాల్చునట్టుల వనలతల్
గళితధవళపత్రములఁగుఁ జూవె.

శకు — (జ్ఞాపకమునకుఁ దెచ్చుకొని) తండ్రీ! లతాభగిని వనజ్యోత్స్నను వీడ్కొని వచ్చెదను.

కాశ్య — వనజ్యోత్స్న యెడల నీకు సహజస్నేహము కలదని నాకుఁ దెలియును. అది నీకుఁ గుడివైపుననున్నది.

శకు — (లతను సమీపించి) వనజ్యోత్స్నా! చూతవృక్షముతోఁ గూడుకొనియున్నను నిటువైపునకుఁ బర్విన శాఖాబాహువులతో నన్నాలింగనము చేసికొమ్ము. ఇఁకమీఁద నీకు నే దూరస్థురాలనయ్యెదను కదా!

కాశ్య —

గీ. తొలుత నేనెకోఱికెటు నేఁదలఁతునట్లు
తగినవరునందితివి సుకృతమున నీవు
మావిఁబొందిన దీనవమాలికయును
దీఱెనాకిప్డు నీచింత దీనిచింత.

ఇఁక బయలుదేఱుము.

శకు — (సఖులతో) సఖులారా! దీనిని మీయిద్దఱిచేతులలో నొప్పగించుచున్నాను.

సఖులు — సఖీ! మమ్ముల నెవరిచేతి కప్పగించెదవు? (అనికన్నీటిని విడుచుచున్నారు.)

కాశ్య—అనసూయా! ఏడువుఁజాలింపుము. మీరిద్దఱే శకుంతలను ధైర్యవంతురాలఁగాఁ జేయవలెను.

(అందఱు నడుచుచున్నారు.)

శకు—తండ్రీ! మనపర్ణశాల సమీపమునందు గర్భధారణముచే మెల్లఁగ సంచరించుచున్న యీయాఁడుజింక ప్రసవింపఁగానే నాకాప్రియవృత్తాంతము నివేదించుట కెవనినైన నంపుము.

కాశ్య—దీనిని మఱవిపోము.

శకుం—(గతిభంగము నభినయించి) ఎవరిది? నా చీరకొంగుఁబట్టి లాగుచున్నారు? (అని వెనుకకు మఱలుచున్నది.)

కాశ్య—కుమారీ!

ఆ. వె. దర్భసూచి నోరఁ దవుల గాయము మాన్పఁ
బూసినారనూనె ముష్టిఁజామ
లిడుచుఁ బెంచుకొనదొ కొడుకుఁగానే లేడి
నీదుపథము విడువలేద దిదియు.

శకుం—బిడ్డా! సహవాసులఁ బరిత్యజించు నన్నేల యనుసరించెదవు? పుట్టినప్పుడే తల్లిచే విడువఁబడి నాచేఁ బెంపఁబడితివి. మఱి నాచే విడువఁబడిన నిన్నిపుడు తండ్రి విచారించును ఇఁక మఱలిపొమ్ము. (అని యేడ్చుచు బయలుదేరును.)

కాశ్య— గీ. ఱెప్పలెత్తు కనులఁగప్పి దృష్టిని నాఁగు
* బాష్పవితతి స్థిరతఁ బాపు మెచ్చు
తగ్గులు గన కీపథంబున నడచినఁ
దడఁబడుఁగద నీకు నడుగు లబల!.

శార్ఙ్గరవుఁడు—దేవా! బంధుజను లుదకసమీపప్రదేశమువఱకే యనుసరింపఁదగునని శాస్త్రము. ఇదిగో చెఱువుగట్టు. కావునఁ జెప్పవలసినవన్నియుఁ జెప్పి మఱలుట యుక్తము.

---

* బాష్పవితతిస్థిరతఁ బాపు కొన । కెచ్చుతగ్గులున్న నీపథాననడవ.

కాశ్య—అట్లయిన నీ యశ్వత్థవృక్షపునీడ కరుగుదము.

(అందఱు నడచి నిలుచుచున్నారు.)

కాశ్య—(ఆత్మగతము గ) పూజ్యుఁడగు దుష్యంతుని కెట్టి సందేశము పంపఁదగియుండునో కదా? (అని యాలోచించుచున్నాఁడు)

శకుం—(జనాంతికముగ) సఖీ చూడుము! ఈ చక్రవాకి తామరాకుల చాటుననేయున్నను దన సహచరునిఁ జూడఁజాలక యాతురతతో నేను దుష్కరకార్య మొనర్చుచున్నానని యఱచుచున్నది.

అన—సఖీ యట్లు చెప్పకుము.

గీ. ప్రియునినెడబాసియును నిదివిరహదుఃఖ
దీర్ఘతరరాత్రియెట్టులో తివిరిగడుపు
నెంతదుర్భరమైనట్టిదేని విప్ర
యోగబాధనాశాబంధ మోర్వఁజేయు.

కాశ్య—శార్ఙ్గరవా! నీవా రాజుతో నామాటలుగా శకుంతలను బురస్కరించుకొని యిట్లుచెప్పుము.

శార్ఙ్గరవుఁడు—దేవర యాజ్ఞాపింతురుగాక!

కాశ్య॥ఉ. మమ్ముఁదపోధనాఢ్యుల సమంచితరీతిఁదలంచి యెంచిస్వీ
యమ్మగుసత్కులమ్మునలయయ్యదినీయెడ నీమొకెట్లొ చు
ట్టమ్ములెఱుంగకుండఁ గడుఁ డక్కినకూర్మిగణించి దీనిన్యా
యమ్మనపత్నులట్లగన నవ్వలగల్గుఫలంబదెల్ల భా
గ్యమ్మనఁజుమ్ము దానినగునా! వచియింపఁగ నింతి బంధుగుల్.

శార్ఙ్గర—సందేశము గ్రహించితిని

కాశ్య—కుమారీ! ఇప్పుడునీకు బుద్ధులుగఱపవలసియున్నది. వనవాసులముగా నుండియున్నను మేము లౌకికజ్ఞానముగలవారముసుమా.

శార్ఙ్గర—ధీమంతులకుఁ గోచరింపని విషయమే లేదుగదా!

కాశ్య—అట్టినీవిక్కడనుండి నీపతిగృహమును బ్రవేశించి

మ. గురుశుశ్రూషయొనర్పుమా సవతులన్ గొమ్మా సఖీవృత్తితో
వరుఁడేభంగమొనర్చె నేనలుకవార్యాలకున్న జేమానుమా

పరివారంబుగడుం గృపం గనుము సంపద్గర్వము న్వీడుఁ దా
ల్తురు రామల్ గృహిణీపదం బిటు పెరల్ చూడన్ గులాధుల్ గదా.
గౌతమి యెటుతలంచు చున్నదో కదా.

గౌతమి—వధూజనుల కుపదేశమింతమాత్రమే. కుమారీ! దీనినంతయు శ్రద్ధతో మనముననుంచుకొనుము.

కాశ్య—బిడ్డా, నన్నును సఖీజనమ్మును గౌఁగిలించుకొనుము.

శకుం—తండ్రీ! ఇచ్చటనుండియే ప్రియంవద మొదలగు నాసఖులు మఱలి పోయెదరా యేమి?

కాశ్య—బిడ్డా! వీరుగూడ నొకరికీయవలసిన వారుగదా? వీరిద్దఱు నచటికి వచ్చుట యుక్తము కాదు. నీతో గౌతమివచ్చును.

శకుం—(తండ్రిని గౌఁగిలించుకొని) మలయతటమునుండి పెఱికి పారవేయఁ బడిన చందనలతవలెఁ దండ్రియొడినుండి పరిచ్యుతనై దేశాంతరమున నాజీవముల నిపుడెట్లు తాల్తునో కదా.

కాశ్య—కుమారీ! ఏమిట్లు భయపడుచున్నావు?

మ. ఖ్యాతిన్ సత్కులసూతియౌ పతికి నిల్లాలై సదా సల్పుచో
నీతిన్ దద్విభవోరుకృత్యములు నెంతేనాకులీభూతవై
పూతున్ బుత్రునిఁ బ్రాచియర్కునటులన్ మద్దారవేగాంచినీ
చేతంబందున నన్నుఁ బాయువగపున్ జింతింకఁ బోవమ్మరో!.

శకుంతల—తండ్రి పాదములపైఁ బడుచున్నది.

కాశ్య—వాంఛితార్థసిద్ధినీకగుఁగాక.

శకుం—(సఖులను సమీపించి) సఖులారా! మీరిద్దఱొక్కసారిగ నన్నుం గౌఁగిలించుకొనుఁడు.

సఖులు—(అట్లుచేసి) సఖీ! రాజు నిన్నొకవేళ గుర్తించుట కాలసించె నేని యప్పుడాతని కాత్మనామధేయాంకితమైన యీయుంగరమునుఁ జూపుము.

శకుం—ఈ మీసందేహముచేత నాకుఁ గంపము కలుగుచున్నది.

సఖులు—భయపడకుము. అతిస్నేహమెప్పుడు ననర్థముల శంకించుచుండును.

శార్ఙ్గ—జాము ప్రొద్దెక్కినది. అమ్మా! త్వరపడవలయును.

శకుం—(ఆశ్రమమున కెదురుగనిల్చి) తండ్రీ, మరల నీతపోవనము నెప్పుడు కాంచెదనో,

కాశ్య—వినుము.

గీ. చాలకాలంబు సవతివై సకలమహికి
నప్రతిరథుఁ డనూజు దౌష్యంతి నిలిపి
తన్నిహితకుటుంబభరుని ధవునిఁగూడి
మరలవచ్చెదీశాంతాశ్రమమున కబల.

గౌతమి—బిడ్డా! ప్రయాణసమయ మతిక్రమించుచున్నది. తండ్రినిబంపుము. (కణ్వునితో) దేవా! ఎంతకాల మైనసీమెయిటులే మరల మరలఁ జెప్పుచుండును. మీరు తిరిగిపొండు.

కాశ్య—కుమారీ! మాతపోనుష్ఠానములకాటంకము కలుగుచున్నది.

శకుం—(మరలఁ దండ్రిని గౌఁగిలించుకొని) తండ్రీ, శరీరము తపస్సుఁజేయుటచే కృశించియున్నది. కావున మరల నాకొఱకెక్కువగ నుత్కంఠఁ జెందకుము.

కాశ్య—(నిట్టూర్పుతో)

గీ. మున్ను నీవుటజద్వారమున నునిచిన
నివ్వరపుబలి మొలకలు నిగుడుచుండఁ
గన్నులారంగఁ గాంచు నాకెన్న నెద్ది
దుఃఖశమనంబుఁ గల్గెడు తొల్లివత్స.

నడువుము. నీపథంబు శివంబగుఁగాక (కూడ వెడలువారితో శకుంతల నిష్క్రమించును.)

సఖులు—(శకుంతల పోయినదిక్కుఁ జూచి) అక్కటకటా! శకుంతల చెట్ల సమూహములో నంతర్హితయైనది.

కాశ్య—(నిట్టూర్పువిడిచి) అనసూయా! మీసహచారిణి వెళ్ళిపోయినది. మీదుఃఖము నణఁచుకొని నాతోఁ గూడ నాశ్రమమునకు రండు.

ఉభ—తండ్రీ! శకుంతలలేమిఁ బాడువడినట్లున్న తపోవనము నెట్లు ప్రవేశింతుము.?

కాశ్య— స్నేహప్రవృత్తిచే నిట్లు కనిపించుచున్నది. (విచారము తో నడిచి) అమ్మయ్యా! శకుంతల నత్తవారింటికిఁ బంపి యిప్పుడు స్వస్థతఁ గాంచితిని. బిడ్డలారా! ఎట్లనఁగా,

గీ. ఆఁడుపిల్ల యొరునిసొత్తె యగుట దానిఁ
ప్రతిగృహీతకుఁ జేర్పంగఁ బంపియిప్పుడు
స్వామికిల్లడ నిచ్చినవాని భంగి
నంతయును నిర్మలమగు నాయంతరాత్మ.

(అని యందఱు వెడలి పోవుదురు.)

ఇది చతుర్థాంకము.

సంపూర్ణము.

అభిజ్ఞానశాకుంతలము.

పంచమాంకము

అంతట నాసనస్థుఁడైన రాజు, విదూషకుఁడు ప్రవేశింతురు.

విదూ—(చెవియొగ్గి) సఖా! సంగీతశాలవైపు నాలకింపుము. అవ్యక్త మధురమైన శుద్ధగీతికయందు స్వరసంయోగము వినవచ్చుచున్నది. ఆఁ తెలిసినది. పూజ్యురాలగు హంసపదికవర్ణము నభ్యసించుచున్నది.

రాజు—ఊరకుండుము. నే వినియెదను.

(ఆకసమునఁ బాట వినఁబడుచున్నది.)

* ఆ. వె. చూతమంజరినటు నూతనాసవపాన
లోలుపుఁడవు నీవు క్రోలి క్రోలి
కమలవసతిమాత్రఁ గడు నిర్వృతిం జెంది
మఱచితెట్లు దాని మధుకరంబ.

రాజు—ఔరా! గీతి, రాగపరివాహిని!

విదూ—ఏమీ! ఈగానమునందలి యక్షరములయర్థము గ్రహించితివా!

రాజు—(చిఱునవ్వునవ్వి) ఈమెతో నొకప్పుడు స్నేహము చేసితిని. అట్లగుట దేవేరి వసుమతినుద్దేశించి నన్నుపాలంభించుచున్నట్లు తెలిసికొంటిని. మిత్రమా! మాధవ్యా! హంసపదికతో "నేర్పుగా నెత్తి పొడిచితివని" నామాటలుగాఁ జెప్పుము.

---

* మత్తకోకిల—నూతనాసవ లోలుపుండవు నోటినిండఁగ నీవుమున్
చూతమంజరి నవ్విధంబునఁ జుంబనంబొనరించి య
బ్జగర్భనివాసమాత్రన పారనిర్వృతి నొందియీ
రీతి దానిస్మరింపవుంటి వశేద్విరేఫ! విరాళిపై.

విదూ — దేవర యాజ్ఞాపించిన ట్లే (అని లేచి) సఖుఁడా! ఆమె నన్ను నిశా
రులచేతఁ జుట్టుపట్టించి కొట్టింప, నప్సరసచేతిలోని విరాగికివలె
నాకిపుడు మఱి మోక్షము కలుగదు.

రాజు — పొమ్ము! ఆమెకు నాగరికవృత్తితోఁ జెప్పుము.

విదూ — హా యేమిగతి! (అని నిష్క్రమించును.)

రాజు — (ఆత్మగతముగ) ఈగీతార్థము నాకర్ణించి ప్రియజనవియోగము
లేకున్నను, మిక్కిలి యుత్కంఠితుఁడ నగుచున్నాను. కాకేమి?

గీ. మధురవాక్కులవినుచు రమ్యము లరయుచు
నరుఁడు సుఖియయ్యు నుత్కంఠితుఁ డగునేని, య
బోధపూర్వంబుగాఁ జిత్తమున స్మరించు
స్వాత్మగత పూర్వజన్మ సఖ్యము లనిదము.

(అని యేమియుఁ దోఁపనివానివలె నిలువఁబడును.)

(అంతఁ గంచుకి ప్రవేశించును.)

కంచు — ఔరా! నే నిట్టిస్థితికి వచ్చితినిగదా!

చ. అనహితుఁడైన నేను నృపశాంతఃపురంబు గాఁ ధర్మపాలఁ జేయుచు
న్న విరతిఁ దాల్చు నద్ది కరమందున నద్దియె వేత్రయష్టి తా
దివసము లేగ నేఁగఁ గొదట్టము నేఁగఁగ దారి నేఁగుచో
నవశతఁ గాళ్లు తొట్రుపడ నద్దిర నాకవు డూఁతకఱ్ఱయా.

ఓహో! రాజునకు ధర్మకార్యము బొత్తిగ నతిక్రమింపరానిది
గదా! ఐనను నిప్పుడే ధర్మాసనమునుండి లేచిన రాజునకు మరల నిర్బంధ
కరమైన కణ్వశిష్యులరాక విజ్ఞాపనము చేయుటకు బుద్ధిపుట్టకున్నది. ఇంత
కును లోకతంత్రాధికారమునకు విశ్రాంతి లేదుగదా! ఎట్లన,

గీ. ఏకవారసన్నద్ధాశ్వుఁడే యినుండు
పగలు రాత్రియుఁ దిరుగుఁ బ్రభంజనుండు
పాపఱేఁ డెప్పుడీ భూమిభరముఁ దాల్చు
నిది యుధర్మంబు షష్ఠాంశవృత్తికగును.

కావున నావని నే నెఱవేర్తును. (నడచి ముందుకుఁ జూచి) ఇదిగో
మహారాజు.

ఆ. వె. కరిఘటలనునడిపి కరిరాజువగ లెండ
నలసి చల్లనియెడ నిల్చినట్లు
నిజతనూజులట్ల ప్రజనేలి నిర్జన
స్థలమునాశ్రయించె స్వస్థుఁడగుచు.

(సమీపించి) దేవరవారికి జయము జయము. హిమాలయమునకు దాపుననున్న యరణ్యవాసులైన మునులు కణ్వుని సందేశముఁగొని స్త్రీలతో వచ్చియున్నవారు. దేవర చిత్తగింతురుగాక.

రాజు—(సాదరముగ) ఏమీ! కాశ్యపుని సందేశముఁ గొనివచ్చినవారా!

కంచు—చిత్తము.

రాజు—అయిన నీ యాశ్రమవాసులను శ్రౌతవిధిచే స్వయముగ సత్కరించి ప్రవేశపెట్టుమని నామాటలుగా నుపాధ్యాయులగు సోమరాతునితోఁ జెప్పుము. నేనుగూడ తపస్విజనులను దర్శించుటకు నుచితమైన ప్రదేశమునందుండి వారికై నిరీక్షించుచుండెదను.

కంచుకి—దేవర యాజ్ఞాపించినట్లే (అని నిష్క్రమించును).

రాజు—(లేచి) వేత్రవతీ! అగ్నిహోత్రశాలకు దారిఁజూపుము.

ప్రతీహారి—ఇటు! ఇటు! దేవా!

రాజు—(నడిచి, యధికార దుఃఖమును నిరూపించి) సర్వప్రాణులునుఁ గోరిన ప్రయోజనములు సమకూరినప్పుడు సుఖపడుచున్నారు. రాజులకన్ననో! చరితార్థతయు దుఃఖోత్తరమేకదా!

గీ. రాజ్యమది యుత్సుకత్వమాత్రంబుఁ బాపు
దానిఁ బాలించుపని దుఃఖదాయకంబ
స్వకర ధృతదండమగు నాతపత్రమట్లు
శ్రమము నకు వలెఁగాదది శ్రమముననెఁప.

(నేపథ్యమున)

వైతాళికులు—దేవరకు విజయమగుఁగాక.

ప్రథముఁడు-గీ. స్వసుఖ నిరభిలాషివగుచుఁ బ్రజలకొఱకు
గాసిలెదు నీదువృత్తి యిక్కరణి సతము

తరువు తీవ్రోష్ణమునఁ దలఁదాల్చి స్వాశ్రి
తాళి పరితాపమును నీడనార్చుఁగాదె.

ద్వారి: గీ. దారిఁదప్పువారి దండించి మరలింతు
కలహమార్చిప్రోవఁగలవు భాగ్య
మెచ్చ బంధులుండుతేమి నీయెడనెయా
బంధుకృత్య సిద్ధి ప్రజకు భూప.

రాజు—విచారమనన్కూలమయ్యు మేమిపుడు వీరి మాటలచే మరల నుత్సాహవంతులమైతిమి (అని నడచును).

ప్రతీహారి—క్రొత్తఁగ శుద్ధముఁజేయుటచే శోభావంతమై సన్నిదియు, హోమధేనువు కట్టివేయఁబడినట్టిదియు నైన యీ యగ్నిహోత్ర శాల బహిర్ద్వార ప్రకోష్ఠమిదె దేవరవారు వేంచేయుఁడు.

రాజు—(ఎక్కి, కూడవచ్చు వాని బుజమూనుకొని నిల్చుండును) వేత్రవతీ! దేని నుద్దేశించి త్రికాలజ్ఞుఁడగు కాశ్యపుఁడీఋషులను నాదగ్గఱ కనిపియుండును ?

మ. వ్రతవత్సంచిత సత్తపోధన తపో వ్యాఘాతమే కల్గెనో!
అతి ధూర్తుండెవఁడేని నేచెనొకో ధర్మారణ్య సత్వంబుల
లతలన్ బూతలు నిల్చిపోయెనొకదా నా చేయుదోసంబులన్
మతి నాకిట్టుల నిర్ణయాకులముగున్ నానా వితర్కంబులన్.

ప్రతీహారి—సచ్చరిత్రముచే సంతుష్టినొందిన ఋషులు దేవరవారిని సంభావించుటకు వచ్చిరని యూహించెదను.

(అంతట గౌతమీసహితులయి, శకుంతలను ముందిడుకొని ఋషులును, వారిముందఱ కంచుకియును బురోహితుఁడు ప్రవేశింతురు.)

కంచుకి—అయ్యలారా ఇటు, యిటు.

శార్ఙ్గరవుఁడు—ఓ శారద్వత!

మి. నరపాలుండురుభాగ్యశాలి క్రమమున్ దప్పండహో యెంతయున్
నరుఁడొక్కండును వర్ణహీనుఁడయినన్ మార్గేతరంబందునన్

జొరఁ డట్లయ్యు సదా వివిక్తవసతిన్ మోదించు చిత్తమ్మునన్
నరకీర్ణంబగు దీని నెంతు శిఖసంతప్తాలయంబుం బలెన్.

శారద్వతుఁడు—పుర ప్రవేశమువలన నీ కిట్లనుట తగియేయున్నది. నేను కూడ.

గీ. స్నాతుఁ డభ్యక్తు నశుచిని శౌచయుతుఁడు
బద్ధు స్వైరియు సుప్తుఁ బ్రబుద్ధుఁ డెటులఁ
గాంచుచుందురో యవ్విధిఁ గాంతు నేను
వీరి సుఖపడుచున్నట్టి వారినిచట.

శకు—(నిమిత్తమును సూచించి) అక్కటా! నా కుడికన్నేటికో యదరుచున్నది.

గౌత—కుమారీ! అమంగళము శాంతించుఁగాక. నీ భర్తకులదేవతలు నీకు శుభము నిత్తురుగాక (అని నడచును.)

పురోహితుఁడు—(రాజును నిర్దేశించి) ఓ మునులారా! వర్ణాశ్రమముల రక్షించునట్టి పూజ్యుఁడగు రాజుగారిదె మీరు వచ్చుటకుఁ బూర్వమే యాసనము నుండి లేచి మిమ్ముల నెదురుచూచుచున్నారు. వీరిని సందర్శింపుఁడు.

శార్ఙ్గ—ఓ మహాబ్రాహ్మణుఁడా! ఇది పొగడఁ దగినదియైనను మేమిందు మధ్యస్థులము ఎట్లన

గీ. ఫలసమృద్ధిని వృక్షముల్ వంగియుండు
నమ్రదశఁ గాంచు ఘనతతి నవరసములఁ
గలిమి పెంపొంద సుజనులు గర్వపడరు
పనిఁ బరోపకారులకు స్వభావమిదియ.

ప్రతీహారి—దేవా! ఋషులు ప్రసన్నముఖవర్ణులుగాఁ గనఁబడుచున్నారు. విశ్వాసయుక్తమైన కార్యముకొఱకే వారు వచ్చియుందురనుకొని యెదను.

రాజు—(శకుంతలనుఁ జూచి) కాని యీమె

గీ. మేలిముసుఁగును నిలువెల్లలీలఁ దాల్చి
మునిలావణ్యమంతయుఁ గానరాక

పాండుదళ మధ్యగత పల్లవంబనంగఁ
దాపసులలోన నుంకు నీ తన్వియెవతె.

ప్రతీహారి—దేవా! గర్భీకృతకౌతుకంబైన నాయూహ ప్రసరింపకున్నది. మహారాజా! ఈమె యాకృతిమాత్రము చూడఁదగినదిగాఁ గనఁబడుచున్నది.

రాజు—అగుఁగాక పరకళత్రము నుఁ బరికించుట తగదు.

శకు—(గుండెపైఁ జేయివైచికొని, యాత్మగతముగ) హృదయమా! ఇట్లులల్లడిల్లెదవు. ఆర్యపుత్రుని భావమెఱిఁగి ధైర్యముగనుండుము.

పురో—(ముందుకునడిచి) వీరె ఋషులు. విధ్యుక్తముగ నర్చింపఁబడిరి. వీరి యుపాధ్యాయుల సందేశమేదో యున్నదఁట. దానిని దేవర వినఁదగును.

రాజు— సావధానుఁడనై యున్నాను.

ఋషులు—(చేతులనెత్తి) రాజా! నీకుఁ జయముగుగాక!

రాజు—మీయందఱకు నభివాదముచేయుచున్నాను.

ఋషులు—ఈప్సితార్థసిద్ధియగుఁగాక!

రాజు—మునులకుఁ దపస్సు నిర్విఘ్నముగ జరగుచున్నదా!

ఋషులు

గీ. రక్షకుఁడవీవుగాఁగ సద్రాజకెల్ల
ధర్మకర్మాంతరాయ మే దారిఁగలుగు
దివినిఘర్మాంశుఁ డత్యంతదీప్తినుఁగ
బుడమి నెవ్విధి తిమిరంబు పుట్టఁగలదు.

రాజు—నాకు రాజశబ్దమిప్పుడుగదా యర్థవంతమైనది. పూజ్యులైన కాశ్యపులు లోకానుగ్రహార్థము కుశలముగనున్నారా?

ఋషులు—సిద్ధిమంతులకుఁ గుశలము స్వాధీనమే ఆయనయనామయ ప్రశ్న పూర్వకముగ మీతోనిట్లు చెప్పుమనిరి.

రాజు—మహానుభావులేమని యాజ్ఞాపించుచున్నారు?

శార్ఙ—గాంధర్వవిధివలన నీ నాపుత్రికను నీవు వివాహమాడితివి. మీ యిరువురవివాహమునకు సంతోషించి నే నంగీకరించితిని.

ఎట్లన

గీ. పూజ్యతముఁడందు మాకీవు ముఖ్యుఁడవుదు
సరి! శకుంతల రూపొందు సత్క్రియకద
దంపతులఁ దుల్యగుణముల సంఘటించి
యిన్నినాళ్ళకు సడిఁబాసె సృష్టికర్త.

కావునఁ గర్భవతిగానున్న యీమెను సహధర్మాచరణము కొఱకు గ్రహింపుము, అని

గౌతమి—ఆర్యా! నేనుకూడ కొంతచెప్పఁగోరెదను నామాటలకవసరమే యుండదు, ఏలన

గీ. ఈమె గుర్వుల మతిఁ గోరదించుకైన
నాప్తజనులను నీవైన నడుగనైతి
వారొకరొకరు పరస్పరమొప్పఁ జేయు
పనికి నొక్కొక్కరికి నేమి పలుకుదాన.

శకుంతల—(ఆత్మగతముగ) ఆర్యపుత్రుఁ డేమిచెప్పునోగదా!

రాజు—ఏమిది? ఇట్లుపన్యసించుచున్నారు!

శకుం—(ఆత్మగతముగ) అగ్గిగదా! ఈవచనరచన!!

శార్ఙ్గ—ఎట్లనియా! మీరే లోకవ్యవహారము గడు నెఱింగినవారుకదా!

గీ. భర్తగల్గి పుట్టినయింటఁ బాయకున్న
సాధ్వినే నన్యథా యెంతురి జనులుగాన
ప్రియయౌ యప్రియయౌ ప్రమద పెనిమిటికడ
నుంట నిజబంధువులు గోరుచుందురుర్వి.

రాజు—ఈమెను భార్యను నేఁ బరిణయమాడితినా?

శకుం—(విషాదముతో-నాత్మగతముగ) హృదయమా నీవు భీతిల్లినట్లే యిపుడు జరిగినది.

శార్ఙ్గ—ద్వి. ఏమియీ ద్వేషంబు కృతకార్యమందు
నేమి యీ విముఖత నృప! ధర్మమందు.

రాజు—ఏలనిట్టి మిథ్యాకల్పితమైన ప్రశ్నలనడుగుచున్నారు?

శార్ఙ్గ—ద్వి. ఎందేనిఁగనఁబడు నీవికారంబు
లందు నైశ్వర్యమత్తాత్ములనిజము.

రాజు—విశేషముగ నన్నునిందించుచున్నారు.

గౌతమి—బిడ్డా! ముహూర్తకాలము సిగ్గుపడకుము. నీమేలిముసుగునిప్పుడు తొలఁగించెదను. అప్పుడు నీభర్త నిన్నుగుర్తించును. (అని యట్లు చేయును,)

రాజు—(శకుంతలను బరికించి, స్వగతముగ)

మ. అనవద్యద్యుతి నిట్లు తోఁచినది యీ యజ్ఞాత రూపంబు దీ
నిని నేఁ దొల్లి పరిగ్రహించుటది సందేహించుట౯ మంచు ప్రొ
ద్దునలోనుంకుట మల్లెఁ దేఁటివలె నేఁ దోడ్తోడ భోగింపఁ జా
లను వీడ౯ మనం నిశ్చయింపఁగను జాల౯ బాపురే దైవమా!

(అని విచారించుచుండును.)

ప్రతీహారి—ఏమీ! ప్రభువుగారి ధర్మదృష్టి! సుఖముగ లభ్యమైన యిట్టి రూపవతినిఁ జూచి యితరుఁ డెవ్వఁడు విచారించును.?

శార్ఙ్గ—ఓ రాజా! ఏమియూరకున్నావు?

రాజు—తపోధనులారా! నేనెంత యాలోచించినను, ఈ పూజ్యురాలిని గ్రహించినట్లు నాకు స్ఫురింపకున్నదికదా కావున స్పష్టముగ గనఁబడుచున్న గర్భచిహ్నములుగల యీమెను సందేహించుచున్న నే నెట్లు భార్యగా గ్రహింపఁగలను!

శకుం—(అపవారించి) ఆర్యునికిఁ బరిణయమే సందేహమైనది నాకిపుడింక నడియాసయేల?

శార్ఙ్గ—అట్లుకాదు.

గీ. నీవుముట్టిన బిడ్డపై నెనరుఁజూపు
మానియేనీకు నిపుడవమాన్యుఁడయ్యె
దొంగిలించిన స్వార్థంబు దొంగనదియ
గోరఁగఁ బ్రార్థించినట్టు లిమ్మునికిఁ దగిలి.

శారద్వ—శార్ఙ్గరవా! నీవిప్పుడూరకుండుము, శకుంతలా! మేము చెప్పవలసినది చెప్పితిమి. ఈప్రభువు నిట్లు చెప్పుచున్నాఁడు. ఆయనకు నమ్మకము కలుగునట్లు ప్రతివచనమిమ్ము.

శకుం—(అపవారించి) అట్టి యనురాగమున కిట్టి గతిపట్టినపుడు నేను జ్ఞప్తికిఁ దెచ్చుటవలని లాభమేమి? ఇఁక నాయాత్మ, దుఃఖములపాలు గావలెనని స్థిరపడినది. (ప్రకాశముగ) ఆర్యపుత్రా! (సగముచెప్పి) పరిణయమునందే సందేహము కలిగినప్పు డీ వ్యవహారమును కూడదు. పౌరవా! పూర్వము తపోవనమునందుఁ బ్రతిజ్ఞాపూర్వకముగాఁ గపటమెఱుంగని యీ జనమును వంచించి యీ విధములగు పలుకులచే నన్ను నిరాకరించుట నీకు యుక్తముకాదు సుమా!

రాజు—(చెవులను మూసికొని) పాపము శాంతించుఁగాక.

గీ॥ కలుష మొనరింపనెంచితే కులము పేరు
పతితుఁజేయుంగఁ దలఁచితే పడతి నన్ను
దరుల నొఱయుచు, బాఱెడు తటిని స్వచ్ఛ
జలము నొద్దుననున్న వృక్షంబునువలె॥

శకుం—కానిమ్ము నిజముగఁ బరకళత్రమను సంశయమునీకుఁ గలదేని నీసందేహము నొక యానవాలుచేతఁ బోఁగొట్టెదను.

రాజు—ఇది యుత్తమ పక్షము.

శకుం—(ఉంగరపుఁ వ్రేలిని దడవిచూచుకొని) అయ్యో! వ్రేలునందుంగరము లేదు. (అని విషాదముతో గౌతమినిఁ జూచును)

గౌత—శక్రావతారమునందు శచీతీర్థమునకు నమస్కరించునపుడు నీ యుంగరము నిశ్చయముగా నందుజారి పడియుండవచ్చును.

రాజు—(చిఱునవ్వుతో) స్త్రీలు సమయోచిత బుద్ధికలవారనుట యిట్టిదే కదా!

శకుం—ఈవిషయమున విధి తన సామర్థ్యమును జూపెను. నీకు వేఱొక్కటి చెప్పెదను.

రాజు—ఇఁక వినఁదగినది యున్నది!

శకుం—ఒకదినమున వనమాలికామండపమునఁ దామరాకుదొన్నెతో నీటిని నీహస్తమునందుంచుకొంటివి

రాజు—వినుచున్నాము.

శకుం—అప్పుడే నాపెంపుడు బిడ్డయగు దీర్ఘాపాంగమను లేడిపిల్ల సమీపించినది. నీవు కనికరముతో మొదట యది నీరు త్రాగవలెనని దానిని బుజ్జగించి పిలిచితివి. కాని నీకది మచ్చిక పడినది కాదు గావున నీదగ్గఱకు రాలేదు. అంతట నే నానీటి నే పుచ్చుకొనఁ జెనవునవచ్చి త్రాగినది. అపుడు నీవు "అందఱుజనులును వారివారి బంధుగులనే విశ్వసింతురు. మీరిరువు రరణ్యవాసులు" అని పరిహసించితివి.

రాజు—స్వప్రయోజనమును సమకూర్చుకొనుటకు స్త్రీ లిటువంటి మిథ్యాభూతమైన వాఙ్మధువుచే విషయాభిలాషులగు జనులనాకర్షింతురు.

గౌత—ఓమహాభాగా! ఈవిధముగా నీవు చెప్పఁదగదు. ఆశ్రమమునందుఁ బెరిగిన యీబిడ్డ కపటము నెఱుఁగదుసుమా.

రాజు—వృద్ధ తాపసీ.

ఉ. నేరుపనట్టినేర్పులు గణింప నమానుషజాతులందె యా
ప్పారును స్త్రీలు, బుద్ధి యుతలందునఁ జెప్పఁగనేల మింటిపై
దారికముందె గీఁ బరభృతంబులు స్వీయ మపత్య జాతముఁ
ధారుణిఁ బెంపఁజేయుఁ గద తద్దయునన్య విహంగజాతిచే.

శకుం—(రోషముతో) అనార్యుఁడా! నీమనసులోని యనుమానమును బట్టి (సర్వమును) గాంచుచున్నావు. గడ్డిచేఁగప్పబడిన కూపంబట్లు ధర్మకంచుకముధరించిన నీవలె నన్యుఁడెవ్వఁడు వర్తించును?

రాజు—(ఆత్మగతముగ) నన్ను సందేహముపాలుచేయుచు నీమెకోపము కపటము లేనట్టులే, కనఁబడుచున్నది.

గీ. విస్మృతి క్రూరమానస వృత్తినగుట
నేరహఃకృత ప్రణయంబు నెఱుఁగననఁగ
మరునివిల్ద్రుంచినట్లయ్యె నరుణనయన
కుటిలభ్రూభంగమున నతి క్రోధమునను.

(ప్రకాశముగ) కల్యాణీ! దుష్యంతునిచరిత మంద తెలిసినదియే. ఐననం దిదికనఁబడదే.

శకుం—పూరువంశము నందలి నమ్మకముచే హృదయమున హాలాహలమును ముఖమునఁ దేనెయుఁగల యీరాజుచేతఁబడి యిప్పుడు స్వచ్ఛందచారిణిఁగాఁ జేయఁబడితిని. (అని ముఖముపై గుడ్డపెట్టుకొని యేడ్చుచున్నది.)

శార్ఙ్గ—స్వతంత్రముగాఁ జపలతతోఁ జేసినపని యెప్పుడు నిట్లుదహించును.

గీ॥ చేయఁదగునట్లగుటఁ బరీక్షించి చెలిమి
యదిరహస్యమైన మఱియు నరయవలయు
ననవగత హృదయులయిన జనులయందు
సౌహృదము తలఁపఁగ నిటుశత్రువగును.

రాజు—ఈమెయందలి విశ్వాసమునుఁబట్టి మాయందు దోషారోపణము చేసి యాక్షేపించుచున్నారా!

శార్ఙ్గ—(అసూయతో) నామాటలు మీరు వ్యత్యస్తముగ విన్నారు.

గీ॥ జననమాదిగ శాఠ్యంబుఁ గననివారి
మాటలవి చూడనీకప్రమాణమయ్యె
జగతిఁ బరవంచనమె తమచదువుగాఁగఁ
బడయువారే నిజముఁ బల్కువారలైరి.

రాజు—ఓ యథార్థవాది! నీవు చెప్పినదంతయు నంగీకరించితిమను కొనుఁడు. కాని యీమెను వంచించుటచే మాకుఁగల్గు లాభ మేమి?

శార్ఙ్గ—నరకము.

రాజు—పూరువంశరాజులు నరకమును గోరుదురనుట విశ్వసింపఁదగినది కాదు.

శారద్వ—శార్ఙ్గరవా! ఉత్తరముఁ జెప్పనేల? గురువుగారి సందేశము నను ష్ఠించితిమి. ఇక మనము తిరిగిపోదము.

(రాజునుద్దేశించి)

గీ॥ కాన నీకాంత నీకాంతదీనినింక
విడిచిపెట్టు చేపట్టు మెవ్విధినొనర్పు
భర్తలకు సర్వతోముఖ ప్రాభవంబు
దారలందున నద్దియు ధర్మ్య నిజము.

గౌతమీ! ముందునడువుము. (అని బయలు దేరుదురు.)

శకుం—ఎట్లు? ఈధూర్తునిచేత వంచింపఁబడితిని. నన్నుమీరును వదలి పెట్టి పోవుచున్నారా! (అని వారి వెంట బయలుదేరును.)

గౌతమి—(నిలిచి) వత్సా! శార్ఙ్గరవా! దీనముగ నేడ్చుచు శకుంతల మన వెంట వచ్చుచున్నది. భర్త క్రూరుఁడై వదలిపెట్టినప్పుడు నాబిడ్డ పాప మేమిచేయఁగలదు?

శార్ఙ్గ—(కోపముతోఁ దిరిగి) దోషదర్శినీ! ఏల స్వాతంత్ర్య మవలంబించె దవు?
(శకుంతల భీతిచే వణకును) శకుంతలా!

గీ॥ అధిపుఁ డాడినయట్ల నీవైతివేని
తప్పినడిచిన నీవునీతండ్రికేల?
శుద్ధచరితంబు నీదాట బుద్ధిఁదలఁతు
వేని పతిగృహంబున దాస్యమేనిమేలు.

నిలువుము. మేము పోయెదము.

రాజు—మునీంద్రా! పూజ్యురాలగు నీమె నేల వంచించెదవు? ఏలన,

గీ॥ కలువలనె విరియఁగఁజేయుఁ గలువఱేఁడు
కమలమిత్రుండు నవ్విధి కమలములనె
పరపరిగ్రహ సంశ్లేష పరతఁ బొందు
విముఖము జితేంద్రియుల మనోవృత్తినిజము.

శార్ఙ్గ—అన్యసంగమువలనఁ బూర్వవిషయముల మఱచినప్పుడు నీ వధర్మమునకు భయపడిన వాఁడ వెట్లయ్యెదవు?

రాజు—(పురోహితునివంకఁ దిరిగి) ఈవిషయములో గురులాఘవముల గుఱించి మిమ్ములనే యడుగుచున్నాను.

క॥ నేమూఢుడనా! యీసతి
తామిథ్య వచించెన? యనుతర్కంబున భా
ర్యామణి నే విడుతునొ? పర
భామామణి నంటునట్టి పాపినగుదునో?

పురో—(విచారించి) అటులయిన మీరిట్లు చేయుఁడు.

రాజు—నన్నుఁ దమరాజ్ఞాపింపుఁడు.

పురో—పూజ్యురాలగు నీమె ప్రసవపర్యంతము మాయింట నేయుండుఁగాక. ఈవిధముగా నేలఁజెప్పితిననఁగా "మీకు ప్రథమమునఁ జక్రవర్తియగుపుత్రుఁ డుదయించునని సాధువులు మిమ్ముఁ గూర్చి చెప్పిరి. ఆముని దౌహిత్రుఁ డట్టిలక్షణములు కలిగియుండనేని సంతోషముగ నామె నంతఃపురమునఁ బ్రవేశపెట్టుము. విపరీతము జరిగెనేని యామెను దండ్రికడకంపుట యున్న దేకదా!

రాజు—ఆచార్యులవారికిఁ దోఁచినట్లు చేయుఁడు.

పురో—కుమారీ! నావెంటరమ్ము.

శకుం—ఓ భగవతీ! భూదేవీ! నాకువివరమునిమ్ము.

(ఇట్లేడ్చుచు బయలుదేరును.)

(శకుంతల పురోహితునితోడను ఋషులతోడను నిష్క్రమించును.)

రాజు—(శాపముచేత మఱచినవాఁడై శకుంతలనుఁగూర్చియే చింతించుచున్నాఁడు.)

నేపథ్యమున

ఆశ్చర్యము.

రాజు—(విని) ఇది యేమైయుండును?

(ప్రవేశించి)

పురో—(ఆశ్చర్యముతో) దేవా! ఒకయద్భుతము జరిగినదికదా.

రాజు—ఎట్లు?

పురో—మహారాజా! కణ్వశిష్యులు తిరిగిపోగానే

సీ॥ బాహువుల్ సాఁచి కన్నీటి యుబ్బులయేడ్పుఁ
దొడఁగెఁ దనభాగధేయంబు దూఱుకొనుచు

రాజు—తరువాత!

ఒక్క స్త్రీరూపతేజ మాయువిదబైకిఁ
గొనిచనియె నప్సర స్తీర్థమునకుఁ జెంత.

(అందఱు నాశ్చర్యపడుచున్నారు.)

రాజు—స్వామీ! పూర్వమే మన మీ విషయమును నిరాకరించితిమి. ఇప్పుడు వ్యర్థవాదములతో నామెను వెదకుటయేల? మీరు విశ్రమింపుఁడు.

పురో—(చూచి) విజయీభవ (అని నిష్క్రమించును.)

రాజు—వేత్రవతీ! నామనస్సు కలఁతఁజెందియున్నది. పడకటింటికి మార్గముఁ జూపుము.

ప్రతీ—దేవా! ఇటు! ఇటు! అని బయలుదేరును.

రాజు—గీ॥ ఏనువలదన్న మునిసుత నెంతమాత్ర
మేని నా భార్యఁగాస్మరియింప, నైన
నాకు దోధూయమాన మానసము నమ్మ
కంబుగలుగంగ బోధించుకరణినుండె.

(అని యందఱు నిష్క్రమింతురు.)

ఇది పంచమాంకము.

అభిజ్ఞానశాకుంతలము.

షష్ఠాంకము.

ప్రవేశకము.

(అంతట నగరపాలకుఁడగు శ్యాలకుఁడును వెడజెక్కలు విఱిచికట్టిన పురుషునిఁదెచ్చిన యిద్దఱు రక్షకభటులును ప్రవేశించుచున్నారు.)

రక్ష—(పురుషునిఁగొట్టి) ఓరి దొంగా, చెప్పరా! రత్నాలకట్టున రాజుగారి పేరుచెక్కిన యీ యుంగరము నీకెక్కడ దొరకినదిరా!

పురు—(భయమునభినయించి) అయ్యలారా! దయయుంచుఁడు. నే నిట్టి పని చేయువాఁడను కాను.

ప్రథ—తగిన బ్రాహ్మణుఁడవని విచారించి రాజుగారు నీకు దీనిని దానము చేసిరి కాఁబోలు.

పురు—ఇప్పుడు నామనవిఁ జిత్తగింపుఁడు. శక్రావతారతీర్థము నందు వసించు నేనొక జెస్తవాఁడను.

తృతీ—దొంగా! నీజాతిని మేమడిగితిమా యేమి?

శ్యాల—సూచకా! ఇతనినంతయుఁ గ్రమముగఁ జెప్పనిండు మధ్య సద్దు పెట్టకుఁడు.

ఉభ—దేవర యాజ్ఞాపించినట్లే! చెప్పుము.

పురుషు—నేను వలలు, గాలములు మొదలగువానిచేఁ జేపలుపట్టి కుటుంబమునుఁ బోషించుకొనుచున్నాను.

శ్యాలకుఁడు—(నవ్వి) ఆహా! నీజీవనమెంతయుఁ బరిశుద్ధమైనది.

పురుషు—గీ॥ హేయమయ్యును సహజమౌనద్ది కర్మ
మట్టిదానిని వర్జింప గిట్టదెందు

దారుణుండెయైనఁ బో పశుమారణమునఁ
జూడఁ గృపకల్మి సౌమ్యుండె సోమయాజి.

శ్యాలకుఁడు—తరువాతఁ దరువాత.

పురుషుఁడు—ఒకదినమున రోహితమను మత్స్యమును గోసితిని. దాని కడుపునందు రత్నములచే మెఱయు నీయుంగరము కనఁబడినది. తరువాత దానిని విక్రయింపఁజూపుచున్న నన్ను మీరు పట్టుకొంటిరి. నన్నుఁజంపినను జంపుఁడు. విడిచినను విడువుఁడు. నాకిది లభించిన విధమిది.

శ్యాలక—ఓజానుకా, నీచుకంపుచే నితఁడు గోధాదియగు జాలరివాఁడే యనుటకు సంశయము లేదు. వీనికి నుంగర మగపడుటనుగూర్చి విచారింపవలెను. రాజగృహమునకే పోవుదము.

రక్షకులు—అలాగే, ఒరే కత్తిరదొంగా, పద.

(అని యందఱు బయలుదేరుదురు.)

శ్యాలకు—సూచకా, పురద్వారమునం దీచోరుని భద్రముగఁ గనిపెట్టి యుండుఁడు. నే నీ యుంగరము పట్టుపడినవిధము ప్రభువుగారికి నివేదించి వారియాజ్ఞవడసి తిరిగివచ్చెదను.

ఉభ—శమము స్వామిప్రసాదమునొందుటకు లోనికిఁ బ్రవేశింపుఁడు.

(శ్యాలకుఁడు నిష్క్రమించును.)

ప్రథ—జానుకా! శ్యాలకుఁ డాలస్యము చేయుచున్నాఁడుకదా!

ద్వితీ—సమయమును గనిపెట్టికదా రాజుల ననుసరింపవలయును.

ప్రథ—జానుకా! వధార్హుఁడైన వీనికిఁ బూవులుచుట్టుటకు నా చేతులు గులగులలాడుచున్నవి. (అని పురుషునిఁజూపుచున్నాఁడు.)

పురు—పూజ్యులగు మీరునన్ను నిర్హేతుకముగఁ జంపనెంచుట పాడిగాదు.

ద్వితీ—(చూచి)ఇదిగో మనయేలిక! ప్రభు చేతబట్టుకొని రాజాజ్ఞను బడసి యీదిక్కు మొగంబై వచ్చుచున్నాఁడు. నీవు గద్దలకు బలియయ్యెదవు! లేదా కుక్కలవాతఁబడెదవు.

(ప్రవేశించి)

శ్యాల—సూచకా! ఈబెస్తవానిని వదలిపెట్టుము. ఈయుంగరపురాక సహేతుకముగనే యున్నది.

సూచ—దేవరయాజ్ఞాపించినట్లే.

ద్వితీ—వీఁడు యమసదనమునకుఁ బోయి తిరిగివచ్చినాఁడు.

(అని పురుషుని బంధముల వదలించును)

పురు—(శ్యాలకునికి నమస్కరించి) ప్రభూ! ఇఁక నాజీవనమునకెట్లు?

శ్యాల—రాజుగా రుంగరమునకు సరియైనధనము బహుమానముగఁ గూడ నీకుఁబంపినారు. (అని వానికి ధనమునిచ్చును.)

పురు—(నమస్కార పూర్వకముగ గ్రహించి) ప్రభూ! అనుగ్రహింపఁబడితిని.

సూచ—తప్పకుండా యనుగ్రహమే. కొఱతనుండిదింపి యేనుఁగమీఁద నెక్కించినారు.

జాను—శ్యాలకా! ఈయుంగరమనిన రాజుగారికిఁ జాలప్రీతియుండునని యీబహుమానమే చెప్పుచున్నది.

శ్యాల—అందుండు గొప్పరత్నముమీఁద రాజుగారి కంతయాదరమున్నట్లనుకొనను. దానిదర్శనముచేత నాయనకు మిక్కిలి ప్రియమైనవారెవరో జ్ఞాపకమునకువచ్చిరి. స్వభావముగా గంభీరులైనను, ముహూర్తకాలము చింతాక్రాంతులైరి.

సూచ—ప్రభువుగారికి సేవచేయుట తమకు లభించినదికదా!

జాను—ఏల! ఈబెస్తలదొరకొఱకని చెప్పు (అని పురుషుని నసూయతోఁ జూచుచున్నాఁడు.)

పురు—అయ్యా! దీనియందు సగము మీసుమనోమూల్యమగుగాక.

జాను—ఇదిసరిగానున్నది.

శ్యాల—జాలరీ! ఇప్పుడు నీవునాకు గొప్పయనుంగుచెలికాఁడవైతివి. కాదంబరీసాక్షిగ మనము ప్రథమమైత్రి చేసికొనవలెను. కావున గల్లంగడికే పోపుదమురమ్ము. (అనియందఱు నిష్క్రమింతురు).

ఇదివిష్కంభము.

(అంతట విమానముతో సానుమతియను నప్సరస ప్రవేశించును.)

సానుమతి—సాధుజనులు స్నానము చేయునంతకాలము నప్సర స్తీర్థము నందు వేచి నావంతు నేఁ జక్కఁగ నిర్వర్తించితిని. ఇప్పుడే రాజర్షి చరితము ప్రత్యక్షముగ నరసెదను. మేనకసంబంధముచేత శకుంతల నాకు శరీర సదృశయైనది. మేనకతనకుమార్తెవిషయ మిదివరకే నన్ను నియమించియున్నది. (అంతటఁగలయఁజూచి) వసంతోత్సవ సమయమైనను నీరాజగృహము సంతోషరహితముగఁ గనుపట్టుచున్నది. ఏమి హేతువై యుండునోకదా! నాకుధ్యానముచేతనే సర్వముఁ దెలిసికొను సామర్థ్యముకలదు. అయినను నా సఖియాదరమును బాటింపఁదగును. కానిమ్ము. ఈ యిరువురుద్యానపాలికలకుఁ గనఁబడకుండ పార్శ్వమునందుండి తెలిసికొనెదను. (అని దిగుటనభినయించి నిలుచును.)

(అంతటఁ జూతాంకురమును జూచుచుఁ జేటియు దానివెనుక మఱియొక చేటియుఁ బ్రవేశింతురు.)

ప్రథమ॥ గీ॥ చైత్రమాసజీవ సర్వస్వమా! తామ్ర
హరితపాండురమగు నామ్రకోర
కంబ! గాంచఁబడితి కడుఋతుమంగళం
బుగ నిను బరితుష్టముగ నొనర్తు.

ద్వితీయ—పరభృతికా! నీలో నీవొంటరిగ మాట్లాడుకొనుచున్నావు. అదేమి?

ప్రథమ—మధుకరికా! చూతకలికను జూచి పరభృతిక యున్మత్తురాలగును.

ద్వితీ—(సంతోషముతోఁ దగ్గఱకువచ్చి) మధుమాసము వచ్చినదా యేమి!

ప్రథమ—మధుకరికా! మదవిభ్రమకరములగు పాటలఁబాడుటకు నీకిదియేకదా కాలము!

ద్వితీయ—సఖీ! నన్నుఁబట్టుకొమ్ము. కొనవ్రేళ్లమీద నిలిచి మావిమొగ్గ లగ్రహించి కామదేవార్చనముఁ జేసెదను.

ప్రథమ—అర్చనఫలములో సగమునాకు నిచ్చెదవేని పట్టుకొనెదను.

ద్వితీ—మనశరీరములు రెండైనను జీవితమొక్కటియగుట నేనట్లు చెప్పకున్నను నీ కిదసిద్ధించును. (సఖినూతిమ చేసికొని నిల్చుండి మావి చిగుళ్లను గోయుచున్నది.) చెలీ! చూతప్రసవము చక్కగ వికసింపకున్నను దోషము ప్రసరించుటచే బరిమళము వచ్చుచున్నది.

(అని కపోతహస్తము పట్టి)

గీ. అర్పణము జేసితి నిను జూతాంకురంబ
ధనువు నెక్కి నట్టి మారదర్పకునికి
రసికజన యువతిశోభ్యము గుచు
నై దుశరములలో మేటివగుమనీవు.

(అని చూతాంకురములను వదలుచున్నది.)

(తెరను ద్రోసికొని కోపముతోఁ గంచుకి ప్రవేశించును)

కంచుకి—అట్లువలదు. అజ్ఞానురాలా! దేవరవారు వసంతోత్సవము నిషేధించి యుండఁగా నీవు మావిమొగ్గల నేటికిఁ గోయ మొదలుపెట్టితివి?

ఉభ—(భయముతో) అయ్యా! దయఁజూపుఁడు. మాకీ విషయము తెలియదు.

కంచు—మీరు వినలేదా యేమి? వసంతమునఁ బుష్పించు తరువులును, వానినాశ్రయించియున్నపక్షులుగూడ దేవరశాసనమును బ్రమాణముగ గ్రహించినవి. చూడుఁడు.

మ. చిరసంభూతములయ్యుఁ జూతకళికల్ స్వీయోపచితంబౌ రజం
బు రహిందాల్పప్రసిద్ధమై కురవకంబుల్ సిల్పెడుల్ మొగ్గఁగాఁ
బొరిపీతేరిఁ యుగంతగద్గదికము ల్ పుంస్కోకిలారావము ల్
స్మరుఁడున్శంకితుఁడై సగమె తీజంకిపోదియుంచం టోలుసంచెంచెడల్.

ఉభయులు—సందేహములేదు. రాజర్షి మహామహిమ సంపన్నుఁడు.

ప్రథమ—అయ్యా! రాష్ట్రియుఁడగు మిత్రావసునిచేత మేము రాణిగారి పాదసేవనిమిత్తము కొన్నిదినములక్రిందటఁ బంపఁబడితిమి. ఇట్లుండగా నిచ్చట ప్రమదవనరక్షణమునకై మేము నియమింపఁబడి

తిమి. క్రొత్తగవచ్చినవారమగుట నీవృత్తాంతము మేమింతవఱకు విన లేదు.

కంచుకి—కానిమ్ము. మఱలనిట్టిపనినిఁ జేయకుఁడు.

ఉభ—అయ్యా! మాకుఁ గుతూహలముగనున్నది. మాబోఁటి మనుష్యులు వినఁదగునేని రాజుగారేనిమిత్తమున వసంతోత్సవమును నిషేధించిరి? చెప్పుఁడు.

సాను—మనుష్యు లుత్సవప్రియులు కదా! (ఏదియో) గొప్ప కారణమున నై యుండును.

కంచు—చెప్పఁగూడదనేమి? ఇది యంతఃపురమునఁ దెలిసినదియే. శకుంతలను రాజు నిరాకరించుటవలన నైన లోకాపవాదము మీచెవినిఁ బడలేదా!

ఉభ—ఉంగరమును రాజు చూచినంతవఱకు శ్యాలకముఖమున విని యున్నాము.

కంచు—అయిన నేఁ జెప్పవలసినది కొంచెమే. రాజు తన యుంగరమును జూచిన నాటనుండియుఁ బూజ్యురాలగు శకుంతలను సత్యముగాఁ దొల్లి రహస్యముగ వివాహమాడితిననియు నజ్ఞానమున నామెను దిరస్కరించితిననియుఁ దెలిసికొని యదిమొదలు ప్రభువుగారు పశ్చాత్తాపపడుచున్నారు. అట్లుగదా!

మ. కడుద్వేషించునురమ్యమన్వహము ప్రాగ్భంగిన్ బ్రకృత్యాళికిన్
గొలువీఁ డిట్టటు శయ్యపైఁ బొరలుచున్ మేల్కన్నదే లేక రేల్
గడపున్ దాముగ మాటనంతఃపురి యుక్తంబైనమాటాడునన్
య్యెడ గోత్రస్ఖలితుండునై త్రపను నెంతేని వ్రీడన్ దాల్చెడున్.

సాను—నాకు సంతోషమైనది.

కంచు—దీనివలన రాజుగారు వికలమనస్కులై యుండి యుత్సవమును వలదని యాజ్ఞాపించిరి.

ఉభ—యుక్తముగనే యున్నది.

నేపథ్యమున.

దేవా! రమ్ము! రమ్ము!

కంచుకి—(చెవియొగ్గి) ఓహో! ప్రభువుగారీవైపునకే వచ్చుచున్నారు. మీపనులు మీరొనర్చుచుండుఁడు.

ఉభ—అట్లే (అని వెళ్ళుచున్నారు.)

(అంతటఁ బశ్చాత్తాపమున కనుగుణమైన వేషముతో రాజును, విదూషక ప్రతీహారులును బ్రవేశించుచున్నారు.)

కంచుకి—(రాజునుఁజూచి) ఆహా! రూపవంతులు సర్వావస్థలయందును, రమణీయములుగనె యుందురు. రాజవరుఁ డుత్కంఠితుఁడైనను మనోహరముగ నున్నాఁడు. అట్లుగదా!

చ. ఉడిగి విశేషభూషణము లొక్కటిబంగరు మేలుకడెంబునుం
దొడుగుచు వామహస్తమునఁ దోరపుటూర్పున మోవికెంపఱం
గడు, వగనిద్రలేమియును గన్నులు కెంపయిచిక్కియుఁ గనం
బడఁడటు, సానఁబట్టు నరు వజ్రముకైవడి స్వాత్మకాంతిచేన్.

సానుమతి—(రాజుఁజూచి) శకుంతల యట్లు తిరస్కృతయై యవమానింపఁబడియు వీనికొఱకు నవయుచుండుట యుక్తమేగదా!

రాజు—(పరధ్యానముచే మందముగ నడచుచు)

ఆ. వె. చెలిమృగాక్షి మేలుకొలిపినను దొలుత
హతహృదయము సుప్తమయ్యెనిద్ది
మేలుకాంచె నకట! చాల పశ్చాత్తాప
శోకమనుభవింపఁ జూవెయిపుడు.

సానుమతి—పాపము! శకుంతల యదృష్టమిట్టిదేకదా!

విదూ—(జనాంతికముగ) శకుంతలావ్యాధి మరలవీనినిఁ బట్టుకున్నది. దీనికెట్లు చికిత్సఁజేయవలయునో నాకుఁ దెలియకున్నది.

కంచుకి—(సమీపించి) దేవరవారికి జయము జయము. మహారాజా! ఉద్యానవనప్రదేశములను జక్కఁగఁ బరిశీలించితిని. రమ్యస్థలములఁ దమకు యథేచ్ఛముగ విహరింపవచ్చును.

రాజు—వేత్రవతీ! మంత్రియగునార్యపిశునినితో "మేము చాలకాలము మేలుకొనియుండుటచే నిప్పుడు ధర్మాసనమునఁ గూర్చుండుట కశక్తులముగ నున్నామనియుఁ బురజనులకార్యములను జక్కఁగఁ

విచారించి పత్రికయందులిఖించి పంపుమనియు" నామాటలుగాఁ జెప్పుము.

ప్రతీహారి— దేవర వారాజ్ఞాపించినట్లే (అని నిష్క్రమించును.)

రాజు— వాతాయనా! నీవును నీపనిమీఁదనుండుము.

కంచుకి— దేవా! చిత్తము. (అని నిష్క్రమించును.)

విదూషక— ఈఁగనైన లేకుండఁ జేసితివి. ఇప్పుడు చల్లఁగనుండి యెండక న్నెఱుఁగని రమణీయమైన యీయుద్యాన వనప్రదేశమునందు నీవిప్పుడు క్రీడింతువుగాని లెమ్ము.

రాజు— వయస్యా! సందుదొరికినప్పుడాపదలు సంప్రాప్తమగుననెడి వచనము కల్లగాదుసుమా! ఎట్లంటే

గీ. మునిసుతా ప్రణయస్మృతిఁ బోలియుఁ జేయు
తమము విడిచెను నాదుచిత్తమ్మునిఁక గొ
మనసిజుండును నన్నేయమనసుపుట్టి
విఁటఁ జూత శరంబెక్కువెట్టె సఖుఁడ.

విదూ— నీవు కొంచెమూరకుండుము. నేనీదుడ్డుకఱ్ఱతోఁ గందర్పబాణమును నాశమొనరించెదను. (అనికఱ్ఱనెత్తి చూతాంకురమునుఁ బడఁగొట్టఁబోవుచున్నాఁడు)

రాజు— (నవ్వి) చాలు! చాలు. బ్రహ్మవర్చస్సునుజూచినాము సఖుఁడా! నాప్రియురాలి ననుకరించుచున్న లతలందు దృష్టినిసారించుటకు నేనెక్కడగూర్చుందును?

విదూ— మాధవీమండపమునందీ సమయములో నుండెదననియు స్వహస్తమునఁ జిత్రింపఁబడిన పూజ్యురాలగు శకుంతల ప్రతిబింబము ను దెచ్చియిమ్మనియు, నీవు దాపుననున్న పరిచారికయగు చతురిక నాజ్ఞాపించి యుంటివికదా.

రాజు— మనోరంజకస్థానమిట్టిదే, కావున నామార్గమునే చూపింపుము.

విదూ— ఇటు దేవరా! ఇటు (ఇద్దఱుప్రవేశించి కూర్చుండెదరు.)

(సానుమతికూడ పోవుచున్నది.)

విదూ— మణులుచెక్కిన శిలలతో నీమాధవీమండప మువహార రమణీ

యున్నది మనకు స్వాగతమిచ్చుటకు నపేక్షించుచున్నదనుట నిస్సంశయము. అచటికి వెళ్ళి నీవు కూర్చుండుము. (అని యిరువురు ప్రవేశించి కూర్చుందురు.)

సాను—ఈతీఁగ నాశ్రయించుకొని నాచెలి చిత్రపటమునుఁ జూచెద. తరువాత భర్తకామెయెడలఁగల పలువిధములైన యనురాగమునుఁ గూర్చి నివేదించెదను. (అని యట్లు చేయుచున్నది.)

రాజు—వయస్యా! ఇప్పుడు శకుంతల ప్రథమ దర్శనమును గూర్చినదంతయు జ్ఞాపకమునకు వచ్చుచున్నది. నీకునది చెప్పియేయుంటిని గదా! ఆమెను నిరాకరించిన సమయమునందు నాసమీపమున నీవులేవు కాని దానికిఁ బూర్వము నందైనను నాతో నామెపేరు నుచ్చరింపనైనలేదు. నావలెనే నీవును మఱచిపోతివాయేమి?

విదూ—మఱచిపోలేదు. కాని యప్పుడు నీవంతయుఁ జెప్పియుఁ జివరకు నదియెల్ల పరిహాసోక్తియేగాని సత్యముగాదంటివి. బంకమన్ను ముద్దవంటి బుద్ధిగలనేను నదియట్లేయని గ్రహించితిని. ఇంతకు నీశ్వరేచ్ఛ బలము కలదుగదా!

సాను—అదియట్టిదే!

రాజు—(ఆలోచనామగ్నుఁడై) మిత్రుఁడా! నన్ను రక్షింపుము.

విదూ—ఇదియేమిరాజా! నీకిట్లుండుట క్రమము కాదుసుమా! ధీరులెప్పుడును దుఃఖసమయములందొకరిచేతఁ జెప్పించుకొనరు. పర్వతములెంతగాలికినైనఁ జలింపవుగదా!

రాజు—వయస్యా! నిరాకరణదుఃఖపరవశయగు ప్రియురాలి శోచనీయావస్థనుఁ దలంచుకొని మిక్కిలి యశక్తుఁడనగుచున్నాను. ఆమె

ఉ. ఏపిటఁ బోసిపుచ్చ జన * నేఁగగ బంధులతోడ మాటికిం
దే నిలు మంచదల్పు మునిశ్రీడగు కణ్వునిశిష్యుఁ డంత నా
చానయు శాప్పవారికలుషంబగు దృష్టిని గ్రూరుఁడైన నా
పైనిడ నల్లదే సవిషబాణము భంగిననుఁ దహించెడున్.

సెంచ.

సాను—అహా! ఈరాజుయొక్క సంతాపముచేత నాకుసంతోషము కలుగుచున్నది. స్వప్రయోజనాశక్తియిట్టిదే!

విదూ—రాజా! పూజ్యురాలగు శకుంతల నాకాశచరుఁడెవ్వఁడో యపహరించియుండునని నాసందేహము.

రాజు—అన్యుఁ డెవ్వఁడుపతిదేవతయైనయామెనుస్పర్శింపఁబూను. నీసఖికి మేనక కదా జన్మకారణమని వింటిని. మేనక సహచరులెవ్వరో యామెను దీసికొనిపోయి యుందురనినాయూహ.

సాను—సమ్మోహముకలుగుట చాలయాశ్చర్యకరముగనున్నది. కాని జ్ఞాపకముఁబడుటకాదు.

విదూ—అట్లయిన యెడలఁ గొలదికాలములోనే నీ కామెసమాగమము కలుగును.

రాజు—ఎట్లు?

విదూష—జననీజనకులు పతివిరహదుఃఖముగల పుత్రికఁ జూచుచుండుటకు సహింపరుగదా!

రాజు— వయస్యా!

గీ. స్వప్నమో! మాయయో! మతిభ్రమణమొక్కొ
అంతెఫలమైన పుణ్యసమాప్తియొక్కొ
మరల పొడచూపకయె యదిమరలెనుగద
పట్టికోరికలు తటప్రపాతము లివి.

విదూ—అట్లుకాదు. అవశ్యముగ ననుభవింపఁ దగినవి తప్పక తమంతట తాము సంభవించుననుటకీ యంగుళీయకమే నిదర్శనము.

రాజు—(అంగుళీయకమునుజూచి) ఉంగరమా! దుర్లభస్థానమునుండి చ్యుతమైతివి. నీగతి శోచనీయముగనున్నది.

గీ. ఫలమునుంబట్టి చూడనల్పంబునీ య
దృష్టముంగరమా! నాయదృష్టమట్లు
అరుణనఖరకాంతిమ్మొలౌనామె వ్రేళ్ళ
యందుఁ బదమబ్బియును జ్యుతంబైనకతన.

సాను—ఇది యితరుల చేతిలోఁ బడియుండినట్లయిన నిక్కముగ శోచనీయ మేయగును.

విదూ—రాజా! నీనామముద్రాంకితమైన యుంగర మేసందర్భమున నామె చేతఁ బెట్టితివి?

సాను—నాకునలె నే కుతూహలముచే నీతఁ డడుగఁబడెను.

రాజు—వినుము. స్వనగరమునకు బయలు దేరునపుడు ప్రేయసికన్నీళ్ళతో నార్యపుత్రుఁడెంతకాలమునకుఁ గబురంపునని నన్నడిగెను.

విదూ—తరువాత? తరువాత?

రాజు—అనంతరము నే నీ యుంగరము నామె వ్రేలనుంచుచు నిట్లంటిని.

గీ॥ నాదునామాక్షరములు దినమున కొకటి
గాఁగ లెక్కింపుమిటుఁ దుదిఁ గల్గునాఁటిని
ప్రియ, మదవరోధసద్మ ప్రవేశనేత
సేవకుఁడు నీసమీపముఁ జేరు ననుచు.

క్రూరమనస్కుఁడనైన నేను దానిని మోహముచే ననుష్ఠింప నేరనైతిని.

సాను—కడురమణీయముగ నేయున్నది. దైవము తలక్రిందులు చేసినాఁడు.

విదూ—జాలరివాఁడు చెప్పిన రోహితమత్స్యముయొక్క గర్భమున నిది యెట్లుండెను?

రాజు—శచీతీర్థమునకు నమస్కరించుచుండఁగా నీసోదరి హస్తమునుండి యది జారి భాగీరథిలోఁ బడినది.

విదూ—యుక్తముగనున్నది.

సాను—కావుననే యధర్మభీరువైన యీరాజునకు దీనురాలగు శకుంతల పరిణయవిషయమున సందేహము కలిగెను. అయిన నిట్టి యనురాగమభిజ్ఞానము నపేక్షించునా! అదెట్లు?

రాజు—ఈ యుంగరమును నిందించెదను.

విదూ—(ఆత్మగతముగ) ఈతఁ డున్మత్తుల మార్గము ననుసరించినాఁడు.

రాజు—గీ. లలిత బంధుర కోమలాంగుళి కరంబు
విడిచి జలముల నీవెట్లు పడితివో కద

అదియేల!

జడము గుణమది తెలియదు సరియయేల
ప్రియయు నాచేతనే తిరస్కృతినిఁ బొందె.

విదూ—(ఆత్మగతముగ) నే నాఁకలిచే మ్రింగివేయఁబడుచున్నాను. ఇఁక నెట్లు?

రాజు—ఓ ప్రియురాలా! అకారణముగ నిన్ను విడిచి పశ్చాత్తాపముఁ గుములుచున్న వీనిని బునర్దర్శనమున ననుగ్రహింపుము.

(చిత్రఫలకమును జేతఁబట్టుకొని చతురిక తెరఁద్రోసికొని వచ్చుచున్నది)

చతు—ఇదిగో! చిత్రపటరూపమున నున్న రాణిగారు (అని చిత్రపటమును జూపించుచున్నది.)

విదూ—మేలు! మిత్రుఁడా! భావముయొక్క యనుప్రవేశము రమణీయస్థితిచేఁ గను దర్శనీయముగ నున్నది. నిమ్నోన్నత ప్రదేశములందు నాదృష్టి తొట్రుపడుచున్నది.

సాను—ఆహా! ఏమి యీరాజర్షి నైపుణ్యము. సఖి యెదుటనున్నట్లే యున్నది.

రాజు—కం. ఏదేది దర్శనీయము
కాదో యది యెల్లఁ జక్కఁగాఁ జిత్రమునం
దే దిద్దఁబడు నయినని
దాఁడయితే చెలువ మొకింత యలవడు రేఖన్.

సాను—అధికపశ్చాత్తాపముతోఁ గూడిన ప్రేమకును గర్వారాహిత్యమునకు నిది తగియున్నది.

విదూ—రాజా! ఇందు మువ్వురు పూజ్యురాండ్రు కనఁబడుచున్నారు. అందఱును సౌందర్యవతులే. వీరియందు దమురాలగు శకుంతల యెవ్వరు?

సాను—ఇట్టి సౌందర్యరాశినిఁగూడ గుర్తింపనేరని యీతఁ డెంతటి యప్రాజ్ఞుఁడు.

రాజు—వీరిలో నెవరని నీ వూహించుచున్నావు?

విదూ—ముడివీడి పూవులు రాలుచున్న కొప్పుతోడను, చెమటబొట్టులతోఁగూడుకొన్న మోముతోడను, మిక్కిలి వంగినభుజంబులతోడను, జలాభిషేకముచే స్నిగ్ధమైన కోమలపల్లవములుగలరసాలవృక్షముచెంతనించుకబడలికతో నిలిచినట్లు వ్రాయఁబడినయామెయే శకుంతలయనియుఁ దక్కినవారామెసఖులనియు నేనూహించెదను.

రాజు—నీవునిపుణుఁడవోయి! ఇచట నాభావచిహ్నమున్నది.

గీ. చెమరిచిన వ్రేళ్ళతాఁకుటచేత మరక
యల్లరేఖలకడఁ దోఁచు నశ్రువిదిగొ
గండములనుండిజారిన కరణితోఁచు
వర్ణికోచ్ఛ్వాసరీతినిఁ బట్టిచూడ.

చతురికా! వినోదస్థానమును సగము లిఖంచితిని. నీవు వెళ్ళి తూలికను దీసికొనిరమ్ము.

చతు—ఆర్యా మాధవ్యా! ఈచిత్రఫలకమునుఁబట్టుకొనుము. నేనిదె పోయివచ్చెదను.

రాజు—నేనేదీనినిఁబట్టుకొనెదను. (అనిచెప్పినట్లుచేయును.) (చేటినిష్క్రమించును.)

రాజు— నేనన్ననో

సీ. చెంతఁబ్రత్యక్షముగఁజేరఁ జెలినిమున్న
విడిచిమఱిచిత్రగతదీనిఁ బెద్దఁజేయు
నేనుద్రోవఁబూర్ణజలవాహినినిదాఁటి
యూరమృగతృష్ణ వలచువాఁడైతిసుఖుఁడ.

విదూ—(ఆత్మగతముగ) ఈప్రభువు నదినిదాఁటి మృగతృష్ణనుజేరినాఁడు. (ప్రకాశముగ) చెలికాఁడా! ఇందికేమి లిఖంపవలెను?

సాను—ఏయేభాగములు నాచెలికి నింపగునో యాయాభాగముల వ్రాయఁ గోరినవాఁడై యుండవలెను.

రాజు—వినుము.

చ. పులినవిలీన హంసయుగముల్గలమాలినిఁ దన్నదీతటం
బులశయనించు లేళ్ళగమిఁ బొల్చునుమాగురుపూతపాదముల్

వలయురచింప, వ్రాయఁగను వాంఛయొనర్తుము శాఖలందు వ
ల్కలము లువ్రేల గట్టిననగంబు నధస్థలి వామనేత్రముగ్
జిలచనజింక కొమ్ముకొనఁ జేర్చుచునల్లనఁ గీరుకొంగమ్మృగిగ్॥

విదూ—(ఆత్మగతముగ) నాకుఁజూడనీతఁడు వ్రేలాడు గడ్డములుగల తాపస సమూహముతోఁ జిత్రఫలకము నింపునట్లున్నది.

రాజు—వయస్యా! మేము వ్రాయ నభిలషించిన శకుంతల యాభరణము నొండు మఱచితిమి.

విదూ—అదియెద్ది?

సాను—ఎద్దియరణ్యావాసమునకును వినయ సౌకుమార్యములకును ననురూపముగ నుండగలదోయది.

రాజు—గీ. చెక్కుపైఁ గేసరములాడఁ జెవిని నిడిన
దిరిశినపు పుష్పబంధంబుఁ దీర్పలేదు
మరియు శరదిందుకిరణ కోమలమృణాళ
తంతువును వ్రాయ సఖుఁడ! స్తనాంతరమున.

విదూ—ఓ చెలికాఁడా! ఏమిది! ఈయమ్మ యెఱ్ఱకలువచిగురువలెఁ బ్రకాశించుచున్న హస్తాగ్రముచేత మోమును గప్పుకొని యులికి యులికి పడుచున్నట్లున్నది?
(సావధానముగ విమర్శించి) ఔరా! ఇదిగో! తొంటికొడుకు! మకరందచోరుఁడు. మధుకరుఁడు పూజ్యురాలగు శకుంతలముఖముమీదికి నెగురుచున్నాఁడు.

రాజు—ఓయీ! ప్రగల్భుఁడైన వీని నివారింపుము.

విదూ—దుష్టులను శిక్షించునీవే వీని నివారింప నర్హుఁడవు.

రాజు—మంచిది. ఓపుష్పవల్లిప్రియాతిథీ! మధుకరా! ఇచట నేలతిరిగితిరిగి వేసటఁ జెందెదవు?

గీ. కుసుమమున వ్రాలియునుఁ దప్పి గొనియునైన
మధుకరియిదిగో నీపైనమమతఁ బూని
నీదురాకనిరీక్షించి నిలచియుండె
నానదుగద నిన్ను విడచి తేనెఁ దాను.

సాను—ఈతఁడిపుడు సముంజసముగా వారింపఁ బడినాఁడు.

విదూ—ఈమధుకరజాతి, నివారింపఁబడినను వక్రస్వభావముగలది.

రాజు—ఓయీ! నీవిట్లు నాయాజ్ఞలో నిలువనియెడల వినుమిప్పుడుమఱి

గీ. అనుపహతబాల తరుపల్లవాభి రామ
యువతి బింబాధరము రతోత్సవములందు
నే సదయముగ నానితిభృంగ! దాని
ముట్టితేని*, గమలగర్భమున బిగింతు.

విదూ—ఇట్టికఠినశాసనమునకు భయపడకుండునాయేమి?
(నవ్వి—ఆత్మగతముగ) ఈతఁడిప్పుడు వెఱ్ఱివాఁడైనాఁడు. నేనుగూడ నీతనిసాహచర్యమున నిట్టులైతిని.
(ప్రకాశముగ) వయస్యా! ఇదిచిత్రముకదా!

రాజు—ఏమీ! చిత్రమా!

సాను—నేనేయిప్పటికిఁ దెలిసికొంటిని. లిఖించినదంతయు యథార్థముగ ననుభవించుచున్న యీతని మాటచెప్పవలయునా!

రాజు—వయస్యా! ఈదుష్కరకార్యము నేలయనుష్ఠించితివి?

గీ. తన్మయంబైనమనముతో దరిశెనసుఖ
మనుభవించుచునిజముట్టులలరుచున్న
నాకుస్మృతిఁ గేఁగించి పరాకు డించి
చెలియమఱలఁ జిత్రీకృతఁ జేసితిగద.

(అనికన్నీరువిడుచుచున్నాఁడు.)

సాను—అపూర్వమైన యీ విరహమార్గము పూర్వాపర విరోధిగ నున్నది.

రాజు—వయస్యా! ఇట్టి యెడతెగని దుఃఖము నెట్టు లనుభవింతును?

ఆ. వె. కన్నుమూఁతఁ బడమిఁగలనైన నాకాంతఁ
గలియునట్టి యెడరు కలుగదయ్యెఁ

---

* ముట్టినట్టులైన భ్రమర! కట్టివేతు
నజ్జగర్భబంధన గృహమందునిన్ను.

గనుల బాష్పవారి కననీదు చిత్రస్థ
యైన యీయామెనైన నకటకట.

సాను—శకుంతలను నిరాకరించుటచే శకుంతలకుఁగలిగిన దుఃఖమును సర్వవిధములఁ బోగొట్టితివి.

(ప్రవేశించి)

చతురిక—దేవరవారికి జయము జయము. రంగులపెట్టెను దీసికొని యిటుమొగంబై బయలుదేరితిని.

రాజు—తరువాత !

చతు—మార్గమధ్యమునఁ దరళికతో వచ్చుచున్న వసుమతీదేవి తానే ప్రభువుగారికి నొసంగెదనని చెప్పి నాచేతినుండి పెట్టెను బలాత్కారముగ లాగుకొన్నది.

విదూ—అదృష్టవశమున నీవు విడువఁబడితివి.

చతు—చెట్టుకొమ్మకుఁ దగులుకొన్న దేవిగారి పైఁటకొంగును దరళిక విడిపించునంతలో నేను దప్పించుకొని వచ్చితిని.

రాజు—వయస్యా! బహుమానగర్వితయైన దేవియును వచ్చుచున్నది, నీ వీచిత్రఫలకమును గాపాడుము.

విదూ—"నన్ను"ని చెప్పుము. (చిత్రఫలకమును దీసికొని లేచి) అవరోధ జన కాలకూటమునుండి విడువఁబడితివేని నపుడు మేఘప్రతిచ్ఛందమను ప్రాసాదమున నన్నుఁ గేకవేయుము.

సాను—ఇతర స్త్రీయం దాసక్తచిత్తుఁడైనను బ్రాచీన గౌరవమును బాలింప నిచ్ఛించుచున్నాఁడు. కావున నీతఁడతిశిథిలమైన సౌహార్దము కలవాఁడు.

ప్రతీ—(పత్రమును జేతఁబట్టుకొని) దేవరవారికి జయము జయము.

రాజు—వేత్రవతీ! దారిలో దేవినిఁ జూడలేదా!

ప్రతీ—ఔను! పత్రమును జేతఁబట్టుకొని వచ్చు నన్నుఁజూచి యామె మఱలి పోయినది.

రాజు—దేవి కార్యజ్ఞురాలు! నాకార్యములకుఁ బ్రతిబంధము కలుగ నీయదు.

ప్రతీ—దేవా ! "ధనసమూహము నధికముగ లెక్కింపవలసియుండుటచేఁ బౌరకార్యమొకటి మాత్రమే విచారింపఁబడినది. ఈపత్రిక యందు వ్రాయఁబడిన యీవిషయము దేవరచిత్తగింతురుగాత" అని మంత్రి మనవిచేయుచున్నాఁడు.

రాజు— ఏదీపత్రిక నిటుచూపుము.

ప్రతీ— (చూపును.)

రాజు—(చదివి) ఎట్లా! నావిక వ్యవహారియైన ధనమిత్రుఁడను వర్తకుఁ డోడ వగులుటవలన మరణించెను. పాపమాతఁడు బిడ్డలులేనివాఁ డఁట, అతని ధనసమూహమంతయు రాజును జెందవలయునని మంత్రి వ్రాసియున్నాఁడు. సంతు లేమికష్టముగదా! వేత్రవతీ! మహాధనసంపన్నుఁడగుటచే నాతనికిఁ బెక్కండ్రుభార్య లుండి యుందురు. ఆతనిభార్యలయందెవతెయైన గర్భవతిగానున్న దేమో విచారింపవలెను.

ప్రతీ—మహారాజా! సాకేతవర్తకుని పుత్రికయగు నితనిభార్యకు నిపుడే పుంసవనము జరగినట్లు వినికిడి.

రాజు—అట్లయిన పితృసంబంధమైన ధనము ననుభవింప నాగర్భస్థ శిశువునకు నర్హతగలదని నీవేగి యమాత్యునితో నిట్లుచెప్పుము.

ప్రతీ— దేవర వారాజ్ఞాపించినట్లే. (అని బయలుదేరును)

రాజు—ప్రతీహారీ! ఇటురమ్ము.

ప్రతీ—ఇదిగో వచ్చితిని.

రాజు—సంతానముఁకలదు లేదనెడి విచారమేల?

గీ. వసుధను బ్రజలేయే ప్రియబంధుజనముఁ
గోలుపోవుదురో వారికొఱకుఁ బాప
విషయమునదక్క దుష్యంతవిభుఁడె సుమ్మి
యట్టి బందుగుఁడని చాటుఁ డన్నిదిశల.

ప్రతీ—దేవరవారు సెలవిచ్చినట్లు చాటింపఁదగినదే (నిష్క్రమించి)

(మరలఁ బ్రవేశించి)

దేవరవారిశాసనమును సకాలమునఁగురిసిన వర్షమువలె నెల్లరు కొనియాడిరి.

రాజు—(వేడినిట్టూర్పు విడిచి) ప్రతీహారీ! ఇవ్విధంబున నేకదా సంతానరహితమై నిరాశ్రయమైన వంశములకు మూలపురుషుల యనంతరము వారిసంపదలన్యులఁ జేరును నాయవసానమునందుఁ గూడ పురువంశసంపదలకు నిట్టిగతియే.

ప్రతీ—అమంగళము తొలఁగుఁగాక.

రాజు—ఇసీ! సమీపించిన శ్రేయస్సునవమానించిన వాఁడనైతిని.

సాను—సందేహములేదు. నాసఖినే మనమున నిడుకొని తననిట్లునిందించుకొనుచున్నాఁడు.

రాజు—గీ॥ ఆత్మతేజంబుఁదాల్చిన యన్వయప్ర
తిష్ఠనాదు సద్ధర్మపత్నిసవిడిచితి
దగ్ధపంటకు నైతజదున్ని విత్తి
కడుఫలోన్ముఖమౌసస్య విడుచు భంగి.

సాను—ఇప్పుడు నీసంతతి యవిచ్ఛిన్నము గనుండఁగలదు.

చతు—(జనాంతికముగ) ప్రతీహారీ! ఈవంశవృత్తాంతముచేత రాజునకు భయమినుమడించినది. ప్రభువుగారి నూరడించుటకు మేఘప్రతిచ్ఛందము నుండి పూజ్యుఁడగు మాఢవ్యునిఁ దీసికొనిరమ్ము.

ప్రతీ—లెస్సగఁజెప్పితివి. (అని నిష్క్రమించును.)

రాజు—అక్కటా! దుష్యంతుని పితరులు సందేహించుచున్నారు ఏలన?

చ. ఇతనికి వెక్కమాకునిఁకనెవ్వఁడు మాకులమందు నక్కటా
శ్రుతివిహితంబుగానొనరుచున్ బితృతర్పణమంచునెంచు సం
తతివికలుండనే వదలు నారముతొలిత బాష్పశేషమున్
బితరులు ద్రావుచుండ్రుగద! పేరుచువేదనతోనిజంబుగన్.

(అని మూర్ఛిల్లుచున్నాఁడు.)

(ప్రవేశించి)

చతురిక—(సంభ్రమముతోఁ జూచి) మహారాజా! ఊఁటాడిల్లుఁడు. ఊఁటాడిల్లుఁడు.

సాను—అక్కటకటా! ఈతఁడు దీపముండఁగనే యది తెలియమికుగున నున్నదోషమున నంధకారదోషము ననుభవించుచున్నాఁడు. నే నిప్పుడే యీతని నానందింపఁ జేయుదును. ఏల! "యజ్ఞభాగముల నందుకొనుచున్న దేవతలే శ్రీఘ్రకాలములో ధర్మపత్నివగు నిన్ను నీభర్త కడఁ జేర్చెదరని శకుంతల నాశ్వాసించుచుండిన యింద్రజనని నోటినుండియే వినియున్నాను. కావున నట్టిసమయమునకై ప్రతీక్షించియుండుట యుక్తము. ఈవృత్తాంతముచే నాప్రియసఖిని సమాశ్వాసించెదను. (అని యాకాశమార్గమున కెగిరి నిష్క్రమించుచున్నది.)

(నేపథ్యమున)

అబ్రహ్మణ్యము.

రాజు—(తెలివి తెచ్చుకొని యాలకించి) ఈయార్తనాదము మాధవ్యునిదిగ నున్నది! ఎవరక్కడ?

(ప్రవేశించి)

ప్రతీ—(సంభ్రమముతో) ప్రాణాపాయస్థితిలో నున్న ప్రియవయస్యుని రక్షింపుఁడు.

రాజు—బ్రహ్మచారినిఁ బరాభవించినవాఁ డెవ్వఁడు?

ప్రతీ—అదృశ్యమైన భూతమేదో యతనినిఁ బట్టుకొనిపోయి మేఘప్రతిచ్ఛంద ప్రాసాదముయొక్క కొట్టకొమ్మునఁ గూర్చుండఁబెట్టినది.

రాజు—(లేచి) అట్లుండదు. మాగృహములుకూడ భూతములచేఁ బీడింపఁబడుచున్నవిగా! ఇంతయేల.

౬౦. దినదినము దాఁ బ్రమాదం
బున నొనరుచుఁ బాపములఁ గొలఁదటన్నన్
జనులందెవ్వండేపథ
మునజనునో వశముపూర్ణముగఁ దెలియంగన్.

(నేపథ్యమున)

ఓవయస్యా! అయ్యో! అయ్యో! వయస్యా!

రాజు—(గతిభేదముగ నడచుచు) మిత్రుఁడా భయపడవలదు.

(నేపథ్యమున)

(మరల నట్లేయఱచి) ఎట్లు భయపడకుండఁగలను. వీఁడెవ్వఁడో! నన్నుఁ జెఱుకుగడను విఱచినట్లు మెడను వెనుకకుఁ ద్రిప్పి మూఁడుముక్కలు చేయుచున్నాఁడు.

రాజు—(దృష్టి ముందుకుసారించి) విల్లు నిట్లందిమ్ము!

(ధనుస్సును జేతఁబట్టుకొని యవనిక ప్రవేశించుచున్నది.)

యవ—మహారాజా! నత్రముతోఁగూడ నిదిగో విల్లు (రాజుధనుస్సున బాణముఁ దొడుగుచున్నాఁడు.)

(నేపథ్యమున)

గీ. అభినవ గళరక్తార్థియౌ వ్యాఘ్రమువలె
మానపశువునట్లు వధింతు నేనునిన్ను
నార్తభయమునుఁబాపు శరాసనంబుఁ
*బట్టు దుష్యంతుఁడిపుడు కాపాడునిన్ను.

రాజు—(రోషముతో) ఎట్లూ! నన్నే యుద్దేశించుచున్నాఁడు. ఓ కుణపాశనుఁడా! నిలు నిలు. నీవిఁకఁ బ్రదుకఁబోవు (విల్లెక్కిడి) వేత్రవతీ! సోపానమార్గమునుఁ జూపుము.

ప్రతీ—ఇటు మహారాజా! ఇటు.

(అందఱును సత్వరముగ వచ్చుచున్నారు.)

రాజు—(అంతటఁ గలయఁజూచి) ఇక్కడ నెవ్వరును లేరే!

(నేపథ్యమున)

అయ్యో! అయ్యో! పూజ్యుఁడవగునిన్ను నేఁజూచుచున్నాను. నీవునన్నుఁ జూడకున్నావు. పిల్లిపట్టుకొనిన యెలుకవలె జీవితాశను వదలుకొంటిని.

పాఠాంతరము.

*పూను దుష్యంతు నిపుడునిజ బ్రోవనిమ్ము.

రాజు—ఓ తిరస్కరణీ గర్వితుఁడా! నా బాణము నిన్నుఁ జూడఁగలదు. ఇదిగో బాణమును సంధించుచున్నాను.

ఆ.వె. చంపఁదగిననిన్నుఁ జంపునెయ్యదియట్లు
కావఁదగినవిప్రుఁ గాచుమఱియు
హంసపాలుగోలి యందుమిళితమైన
యుదకమును విడుచుచునుండుఁగాదె.

(అని యస్త్రము సంధించుచున్నాఁడు.)

(అంతట విదూషకునిఁదలి మాతలి ప్రవేశించుచున్నాఁడు.)

మాతలి—గీ. నాకపతినీకు దానవానీకముఁగుఱి
గ నొనరించె వారివయి నీధనువులాగు
సుజనుల ప్రసాదసౌమ్య దృష్టులవిగాక
సఖులపైఁబడవుగ తీవ్రశరములెందు.

రాజు—(అస్త్రముఁపసంహరించి) మహేంద్రసారధివగు మాతలీ నీకు స్వాగతము

విదూ—(ప్రవేశించి) ఎవనిచేతనేను యజ్ఞపశువువలె బాధింపఁబడితినో యతఁడే యీరాజుచే మన్నింపఁబడుచున్నాఁడు.

మాతలి—(చిఱునగవుతో) ఆయుష్మంతుఁడా! నేనింద్రునిచే నీయొద్దకు ననుపఁబడిన కారణమును వినుము.

రాజు—సావధానచిత్తుఁడనై యున్నాను.

మాతలి—కాలనేమిసంతతి దుర్జయంబను దానవగణము కలదు.

రాజు—కలదు. నారదునివలనఁ బూర్వము వినియున్నాను.

మాతలి—గీ. హరికి నీమిత్రునకు వారలలవిగారు
అసురహంతవంద్రుఁడు నిను రణాగ్రమందు
రాత్రి హరిహరింపని తిమిరంబురాజు
సంహరించుట యల్లది సహజమకద.

దేవర యాయుధముల ధరించియే, యిప్పు డింద్రునిరథమెక్కి విజయార్థము బయలుదేరుఁడు.

రాజు—ఇంద్రుని మన్ననచే ననుగ్రహింపఁబడితిని. కాని మాధవ్యుని యెడమీరేల యట్లు ప్రవర్తించితిరి?

మాతలి—అదియుఁ జెప్పెదను. ఆయుష్మంతుఁ డేకారణముననో మనస్సంతాపమువలన వివశుఁడై యుంటఁ జూచితిని. తరువాత దేవరకుఁ గోపముఁబుట్టించుటకై యట్లొనర్చితిని. ఏలన.

ఆ. వె. జ్వాలలెగయఁజేయుఁ జలితేంధనం బగ్ని
విప్రకృతముఱగము విప్పుపడగ
క్షోభితలమునందు క్షోభితుండగు జనుం
డాత్మమహిమఁగాంచు నతిశయముగ.

రాజు—(జనాంతికముగ) వయస్యా, దేవేంద్రునియానతి యతిక్రమింపరానిది. విషయమును దెలిపి మహామంత్రి పిశునినితో నామాటలుగా నిట్లు చెప్పుము.

గీ. ఎక్కువెట్టిన నాధనువిది మఱొక్క
కార్యమున వ్యాపృతమగు తత్కాలమునను
కేవలము నీదుప్రతిభయే యీవసుమతిఁ
బ్రజలఁ బరిపాలనము సేయవలయుఁగాత.

విదూ—దేవర యాజ్ఞాపించినట్లు. (అని వెళ్లుచున్నాఁడు.)

మాతలి—ఆయుష్మంతుఁడు రథారోహణము సేయుఁగాక.

(రాజు రథమునెక్కుట నభినయించుచున్నాఁడు.)

అందఱు నిష్క్రమింతురు.

ఇది

షష్ఠాంకము సంపూర్ణము.

అభిజ్ఞానశాకుంతలము.

సప్తమాంకము.

(అంత నాకాశయానమున రథమునెక్కి మాతలితో,
రాజు ప్రవేశించుచున్నాఁడు.)

రాజు—మాతలీ! నే నింద్రుని యాజ్ఞానుసారముగ నడచుకొనిన వాఁడనయ్యును నాకాతఁ డొనరించిన బహుమానాతిశయమువలన నన్ను నుపయుక్తునిగఁ దలంచుకొనుచున్నాను.

మాతలి—(చిఱునవ్వునవ్వి) ఆయుష్మంతుఁడా! నాకుఁ జూడ మీ రిరువురును సంతుష్టులైనట్లు లేదు.

గీ. నాకపతి నీకొనర్చు మన్ననలఁ దలఁచి
చూతు ప్రథమోపకృతమునుఁ జుల్కఁగాఁగ
హరియు నీపౌరుషంబున కచ్చెరువడి
తనదుసత్కృతి గొప్పగాఁ దలఁపఁడయ్యె!

రాజు—మాతలీ! వలదు. అట్లనవలదు. నన్నుఁ బంపునప్పుడు దేవేంద్రుఁడు చేసిన గౌరవము నాయభిలాషలకుగూడ మించియున్నది. చూడుము. దేవతలందఱుముందఱ నన్నుఁ దనయర్ధాసనమునఁ గూర్చుండఁబెట్టుకొని

గీ. చెంత నాసించియున్న జయంతుఁ జూచి
నాకపతి సస్మితుండౌచు నాదుకంఠ
మందు మృష్టవక్షోహరిచందనాంక
చారుమందారమాల నింపారఁ బెట్టె.

మాతలి—ఆయుష్మంతుఁ డమరేశ్వరునివలన దేనినిఁ బొంద నర్హుఁడు కాఁడు. చూడుము.

గీ. భోగపరుఁడైన దేవేంద్రుపురము పరగ
రెంట నుద్ధృతదానవ కంటకముగ
నాఁడు నతపర్వములపు హరిసఖులనటు
నీదుదివ్య శరంబులు నేఁడునిట్లు.

రాజు—ఈసందర్భమున మహేంద్రునిమహిమయేకదా స్తుతింపఁదగినది.

చ. పెనుక్రియలందు నేనియును భృత్యులుసిద్ధినిగాంచుటెందునుఁ
గనఁగ నధీశ గౌరవగుణంబని * నెమ్మదినీవెఱుంగుమా
యనుపమతేజుఁడౌతఁడు సహస్రకరుండెనిజాగ్రభాగమం
దునఁదనునిల్పుకున్న నరుణుండు తమంబెటుఁబాప నోపెడుఁ .

మాతలి—ఇదియుక్తమే. (కొంచెముసేపారమే గి) ఆయుష్మంతుఁడా! నాక
పృష్ఠప్రతిష్ఠితమైననీకీర్తిసౌభాగ్యము నిచటనుండియే కాంచుము.

గీ. అమరకాంతలు నెమ్మనవలదమిగులు
రంగులను గల్పలతికాంబరంబులందు
జక్కఁ జొరాడించి గేయార్థజాతమద్ది
యాసురలు వ్రాయుచున్నారు నీ సుచరిత.

రాజు—మాతలీ, నాఁడు రాక్షససంహారోత్సుకత్వమున, దివంబధిరోహిం
చునవుడు స్వర్గమార్గమును జూడలేదు. మనమిప్పుడేవాయు
పథమందున్నాము?

మాతలి—చ. గరిమనభస్స్థితఁ త్రిపథగఁ వహియించెడి నెద్దిజ్యోతులం
జరుపువిభక్తరశ్మియయి సవ్యముగామలీయెద్ది, దానికిఁ
బరివహమారుతంబునకు మార్గమటంద్రు ద్వితీయమైన శ్రీ
హరిపదవిక్రమంబున నిరస్తతమస్కము దీని, భూవరా!.

రాజు—మాతలీ! కావుననేకదా! బాహ్యాంతఃకరణ సహితముగ నా
యంతరాత్మ ప్రసన్నముగనుండుట (రథచక్రమునుజూచి) మేఘ
మార్గమునకు మనము దిగుచున్నాము.

మాతలి—ఎట్లు తెలిసినది?

(పా) * నిక్కముగానె.

రాజు—గీ. అరవివరనిష్పతచ్చాత కాళిచేతఁ
జంచలాకాంతి పరివృతాశ్వములచేత
నీరథమిదె శీకరసిక్తనేమిఁ దెలుపు
వారిగర్భోదరాభ్రాలపై నిపోక.

మాతలి—ఆయుష్మంతుఁ డింక క్షణములో స్వాధికారభూమిం జేరఁ గలఁడు.

రాజు—(క్రిందికిఁ జూచి) వేగముగ దిగుటవలన మనుష్యలోక మాశ్చర్య దర్శనమై కనఁబడుచున్నది. అట్లేకదా!

చ. ఎగయుననంగఁదోఁచు నగశృంగమునుండి ధరిత్రిసిగ్గున
ట్లగు, దళలీనతఁ దరువులట్టివిడుఁ గనుపింపటోదెలా
పగలుసమీపవృత్తిఁదనుభావవినష్టజలత్వముఁ విడుఁ
దగభువినెవ్వఁడో విసిరెనాఁజుమి తేఁబడునాదుచెంతకుఁ.

మాతలి—లెస్సఁగాఁ బరికించితివి (సగౌరవముగఁ జూచి) ఆహా! పృథివి యెంతయు రమణీయమైయున్నది.

రాజు—మాతలీ! పూర్వసముద్రమునుండి పశ్చిమసముద్రమువఱకు వ్యాపించి సువర్ణధాతు స్రావమున, సంధ్యాకాల మేఘరాశివలె మనముందు నొకపర్వతము కనఁబడుచున్నదే! అదియెద్ది?

మాతలి—ఆయుష్మంతుఁడా! ఇదికదా! హేమకూటమను పేరుగల కింపురుష పర్వతము. తాపసులకు సిద్ధక్షేత్రము చూడుము.

గీ. బ్రహ్మసుతుఁ డౌమరీచి కెవ్వఁడుజనించె
నెవ్వఁడు ప్రజాపతి యనఁగ నెసఁగుచుండు
సురల కసురుల కెవ్వాఁడు గురువరుండు
భార్యతో నిందు నతఁడు తపంబొనర్చు.

రాజు—అట్లయిన శ్రేయములనతిక్రమణీయములుకదా మహాత్ముఁ బ్రదక్షిణించి పోఁగోరుచున్నాను.

మాతలి— ఉత్తమపక్షము. (అని యిరువురు దిగుట నభినయించుచున్నారు.)

రాజు—(సవిస్మయముగ)

గీ. శబ్దము రథాంగ నేములు సలుపవయ్యె!
ధూళిక్రమ్మటయైనను దోఁపదిందు
నిగ్రహింపని నీతేరునేలఁ దాఁక
కుంట దిగియును దిగని యట్లుంచుఁ జుమ్ము.

మాతలి—ఇంద్రునకు నాయుష్మంతునకుఁ గల విశేష మింతమాత్రమే.

రాజు—మాతలీ! మారీచాశ్రమ మెక్కడ?

మాతలి—(చేతితోఁ జూపుచు)

మ. తనువందర్ధము పుట్టఁజూడఁగ నహిత్వగ్వ్యాప్తమై వక్షముం
దనరం జీర్ణలతాప్రతానవలయాత్యంతారూఢమై కుత్తుకన్
ఘనశాకుంతకులాయ పూరితజటాభారంబు మూపంటఁగా
నినులక్షింపుచు స్థాణువట్లుచలుఁడై యెందుండు నమ్మౌనితాన్.

రాజు—దుష్కర తపోనిష్ఠుండవైన నీకు నమస్కారము.

మాతలి— (పగ్గముల లాగిపట్టుకొని) మహారాజా! అదితి పెంచినమందా రవృక్షములుగల మారీచాశ్రమ మిదె ప్రవేశించినారము.

రాజు—స్వర్గముకంటె నుత్కృష్టతరమైన సౌఖ్యస్థానము. అమృతసర స్సున మునిఁగిన వానివలెనైతిని.

మాతలి—(రథమునునిలిపి) ఆయుష్మంతుఁడుదిగవచ్చును.

రాజు—(దిగి) మాతలీ! మఱియిప్పుడుమీరో?

మాతలి—రథమును నియమించితిమి. మేముకూడ దిగుచున్నాము. (అట్లుచేసి) ఆయుష్మంతుఁడా! ఇటు! (పరిక్రమించి) పూజనీయు లగుమునుల తపోవనభూములను జూచెదవుగాక.

రాజు—ఓహో! ఆశ్చర్యముతో నవలోకించుచున్నాను.

చ. సురతరుకాననంబున ననుల్ నిలుపన్ బవనంబు, హేమప
ద్మరుచిర రేణుపీతజల ధర్మనిమజ్జనమారఁ, ధ్యానముల్
గురుమణివేదులన్, యమమునున్ సురకాంతలచెంత దేసిక
ర్ఋషులొనర్తు రీప్సితపమునట్టి యెడన్ దపియింత్రుమీరలున్.

మాతలి—మహాత్ముల యభిలాషయంతకంతకునున్నతపదము నాక్రమింపఁ జూచుచుండునుగదా! (కొంతనడిచి ఆకాశమువంకఁజూచి) ఓవృద్ధ

శాకల్యా! మహాత్ముఁడైన మారీచుఁడేమిచేయుచున్నాఁడు? ఏమనుచున్నావు? తన్నుదాక్షాయణి పతివ్రతా ధర్మమును గూర్చి యడుగఁగా మహర్షిపత్నీసమేతయైన యామెకుదానినిఁ జెప్పుచున్నాఁడనియా!

రాజు—(చెవియొగ్గి) ఓయీ! అట్లయిన నీసందర్భమున మనము సమయమును బ్రతీక్షింపవలయును.

మాతలి—(రాజునుచూచి) ఆయుష్మంతుఁడీయశోకవృక్షముక్రింద నించుకసేపు నిలువవలయును. ఇంతలో నేనింద్రజనకునితో మిమ్ములఁ గూర్చి నివేదించుటకు నవసరము నరయుచుండెదను.

రాజు—మీకుఁదోఁచినట్లే (అని నిలుచుండును.)

మాతలి—ఆయుష్మంతుఁడా, నేఁబోయివచ్చెదను.

(అని నిష్క్రమించును.)

రాజు—(నిమిత్తమునుసూచించి)

కం. మదినాసింపమనోరథ
మదరెదవింకేల బాహువా! వృథ, శ్రేయ
మ్మదిమున్న వధీరణమై
పదపడిదుఃఖంబుగఁ గదపరిణతిగాంచున్.

నేపథ్యమున

అల్లరిచేయవలదు సుమా! వీఁడెట్లు తన పద్ధతికే వచ్చినాఁడో!

రాజు—(చెవిగొగ్గి) అవినయమునకిది తావుకాదు. ఈ నివారింపఁబడువాఁడెవఁడోకదా! (శబ్దమువచ్చినచాయఁజూచి సవిస్మయముగ) ఇరువురు తాపసస్త్రీలతో వచ్చు మహాబలసంపన్నుఁడగు నీబాలకుఁడెవ్వఁడైయుండును?

గీ. తల్లిచన్నునగము ద్రావఁగ, జూలది
పట్టి మిక్కుటముగ బాధపెట్టి
చెలఁగియాడుకొనఁగ సింహకిశోరంబు
బలిమిలాగుచున్న వాఁడువీఁడు.

---

* బలిర.

(అంతటఁ బై వర్ణింపఁబడినట్టిరువురు తాపసస్త్రీలతో బాలకుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

బాల—ఓసింగమా! ఆవులింపుము. నీపండ్లను లెక్కపెట్టెద.

ప్రథమ—ఓరిదుండగీడా! మాకుబిడ్డలతో సమానమగు నీజంతువులనేల పీడించుచున్నావు? ఔరా! నీతుందుడుకు పెచ్చుపెరుగుచున్నది. మునులు నీకు సర్వదమనుఁడని తగినట్టు పేరుపెట్టిరి.

రాజు—ఏలకో నాకీ బాలునియందు నౌరసపుత్ర ప్రేమము కలుగుచున్నది. నిక్కముగా నాయనపత్యతయే వాత్సల్యమును నాకుఁగలిగించుచున్నది.

ద్వితీయ—ఇదిగో, ఆఁడుసింగము. నీవు దాని పిల్లను విడిచిపెట్టనియెడల నీమీఁదికి దుముకును.

బాలు—(నవ్వి) అమ్మయొయ్యో! నేఁ జాలభయపడితినే!!! (అని క్రింది పెదవిఁ జూపును.)

రాజు—కం. ఉరుతర తేజోబీజము
కరణిని నీబాలకుండు కనఁబడు నాకుఁ
గర మేధాపేక్షుండై
ధరఁగణదశనున్నయట్టి దహనునిభంగిన్.

ప్రథమ—వత్సా! ఈసింగపుపిల్లను వదలుము. నీకింకొక యాటవస్తువు నిచ్చెదను.

బాలు—అదియేదీ! దానినిమ్ము. (అని చేయిజాచును.)

రాజు—చక్రవర్తిలక్షణముల ధరించియున్నాఁడే! కారణమేమి? ఇదినిజమే, ఇతనికి.

*చ. కడుస్పృహణీయవస్తువున గాటఁపు గూరిమిఁ జాపుచేయి తా
విసివడకెంతయున్ గలియు వేళ్ళను సందొకయింత లేనిదై

మ. కడుఁగోరందగు తోయమందుఁ దమిఁజక్కంజాపునో హస్తమొ
ప్పెడు జాలగ్రథితాంగుళీ చయమునన్ స్నిగ్ధేద్ధ రాగంబుతో
నెడముల్ పత్రములందుఁగానఁబడకం తేనూతనోషస్సుచో
పృడుకాలంబున నించుకే విరియు భాస్వత్పద్మంబనన్.

యడరెడు నిద్ధరక్తిమదశాంతరముల్ గనరాక క్రొత్తగాఁ
బొడమునుమస్సునన్ విరిసి పొల్పగు నేకకుశేశయంబునాన్.

ద్వితీయ—సువ్రతా! మాటమాత్రాన వీనిని మాన్పుట యసాధ్యము. నీవుపోయి నాపర్ణశాలయందు ఋషికుమారుఁడైన మార్కండేయుని రంగులమట్టి నెమలి యున్నది. దానినిఁదెచ్చి వీనికిమ్ము.

ప్రథమ—అట్లే (అని నిష్క్రమించును.)

బాల—అంతవఱకు దీనితోనే యాడుకొనియెదను.

(అని తాపసినిఁ జూచి నవ్వుచున్నాఁడు.)

రాజు—ధూర్తుఁడగు నీబాలకుని యెడల నాకాశపుట్టుచున్నది.

చ. నగుచున హేతుకంబుగఁ గనన్ బలు మొగ్గ లొకించుకంత దోఁ
పఁగఁ దెలియంగ రానివగు వర్ణములన్ రమణీయ వాక్ప్రవృ
త్తిగలిగి, యంకమెక్కఁగ మదిన్ గడుగోరెడు పుత్రులన్ వహిం
పఁగను దడంగపాంసువునఁ బంకిలులౌదురుధన్యు లిద్ధరన్.

తాపసి—కానిమ్ము వీఁడు నన్ను లెక్కపెట్టుటలేదు. (అని పార్శ్వమునకుఁ జూచుచున్నది.) ఋషికుమారులలో నెవరక్కడ? (రాజునుజూచి) భద్రముఖా! ఇటురమ్ము. వీఁడు, పిల్లతనముచేఁ బట్టు విడువకుండ బాధించుచున్న బాలమృగేంద్రమును విడిపింపుము.

రాజు—(సమీపించి చిఱునవ్వుతో) ఓయీ! ఋషికుమారా!

గీ. ఇమ్మెయిని నాశ్రమ విరుద్ధవృత్తి నీవు
సత్త్వసంశ్రయ సుఖమైన సంయమంబు
జననమాదిగ నేల దూష్యమొనర్తు
పిల్లత్రాఁచది చందన వృక్షమట్లు.

తాపసి—భద్రముఖా! వీఁడు ఋషికుమారుఁడు కాఁడు సుండీ!

రాజు—ఆకార సదృశమైన వీని చేష్టితమే తెలుపుచున్నది. అయినను స్థానప్రత్యయమువలన మేమిట్లూహించితిమి. (తాపసికోరినట్లు చేసి బాలుని స్పర్శ సుఖమనుభవించి) (ఆత్మగతముగ)

గీ. ఎవ్వనికులాంకురమొయగు నితఁడు తాఁకు
నాదు గాత్రంబు లిట్టు లానందమొందె

నే సుకృతియంకమునఁ బెంచె నితని వాని
* కీర్తిఁ దడఁజేయు నానంద మెవఁడెఱుంగు.

తాపసి—(ఇద్దఱను దేఱిచూచి) ఆశ్చర్య మాశ్చర్యము!

రాజు—అమ్మా! ఏల!

తాపసి—ఈబాలకుని రూపమునకును నీరూపమునకును బోలికయున్నది యనియు, నపరిచితుఁడవైనను నీకితఁ డనుకూలుఁడయ్యెగదాయనియు నాశ్చర్యపడితిని.

రాజు—(బాలునుపలాలించుచు) మునికుమారుఁడు కానిపక్షమున నీతని కులమెయ్యది?

తాపసి—పురువంశము.

రాజు—(ఆత్మగతముగ) ఈతఁడు నాకు సగోత్రుఁడెట్లయ్యెను? కావుననే యీమానినియు నితఁడు నన్నుఁ బోలియున్నాఁడని తలంచుచున్నది. పురువంశజులగు రాజులకు (వంశక్రమాగతమై) యంత్యమున నీవ్రతమున్నది.

గీ. తొలుతనెవ్వారు రక్షగావలచెదరు ర
సాధిక భవనవాసంబు నట్టివార
లు నియతైకపతివ్రతులుగలయట్టి
వృక్షమూలంబులను వసియింత్రు పిదప.

(ప్రకాశముగ) ఈప్రదేశము మనుష్యుల కాత్మశక్తిచే నగమ్యముకదా!

తాపసి—మీరుచెప్పినది నిజమే. అప్సరస్సంబంధముచే వీనితల్లి దేవగురునాశ్రమమున వీనిని బ్రసవించినది.

రాజు—(అపవారించి) అయ్యో! ఇది రెండవ యాశాజననము. (ప్రకాశముగ) మఱి, యాసతీమణి యేనామధేయముగల రాజర్షి పత్నియో?

తాపసి—ఆఁ! ధర్మపత్నినిఁ బరిత్యజించినవాని నామసంకీర్తనము నెవరు చేయుదురు?

(పా) * కీర్తి నిర్వృతి గూర్చునోయొద నితండు.

రాజు—(స్వగతము) ఈకథకుఁగూడ నేనే లక్ష్యమగు చున్నానుకదా! ఇప్పు డీ బాలకుని తల్లిపేరడిగెదనేని (ఆలోచించి) ఏల! పరదార వ్యవహారమనార్యము.

తాపసి—(మట్టినెమలిని జేఁబట్టుకొని ప్రవేశించి) సర్వదమనా! శకుంత లక్షణము గాంచుము.

బాలుఁడు—(దృష్టిసారించి) మాయమ్మ యెక్కడ?

ఉభయులు—నామసాదృశ్యముచేత మాతృవత్సలుఁడగు నీబాలుఁడు మోసపోయినాఁడు.

ద్వితీయ—బాలకా! ఈమృత్తికామయూరపులక్షణము నుఁజూడమంటిని.

రాజు—(ఆత్మగతముగ) ఏమీ! వీనితల్లి పేరు శకుంతలయా! మఱియు నామ సాదృశ్యములునుగలవు? మృగతృష్ణవలె నామధేయమాత్ర ప్రసంగము నాకు విషాదమును గల్గించునా యేమి?

బాలు—అమ్మా! ఈచక్కనినెమలి నాకు బాగుగనున్నది.

(అనియాటవస్తువును దీసికొనుచున్నాఁడు.)

ప్రథమ—(బాలకునివంకఁజూచి భయముతో) అయ్యో! వీనిమణికట్టున తాయతుకనఁబడుట లేదు.

రాజు—తొందరపడకుఁడు. సింగపుబిల్లను బీడించునపుడావస్తువు క్రిందబడినది. (అనిదానినిదీయఁబోవును)

ఉభయులు—దీనినిదాఁకవలదు. ఈరాజుదీసినట్లున్నాఁడో [అని యుభయులు విస్మయముతో నురములపైఁ జేతులునిడి యొండొరులనవలోకించు చున్నారు.]

రాజు—మమ్మునేలనివారించితిరి?

ప్రథమ—మహారాజు లాలకింతురుగాక. ఇదియపరాజితయను పేరుగల యోషధి. మారీచమహర్షివీనికి జాతకర్మసమయమున నిచ్చిరి. తల్లిదండ్రులును దానును దప్ప తదితరుఁడిది భూమిపైబడినప్పుడు ముట్టఁజాలఁడు.

రాజు—ఒకవేళఁదీసినట్లయిన.

ప్రథమ—అంతట నదిపామై వానినిగఱచును.

రాజు—అట్లుజరగుట ప్రత్యక్షముగ నెవ్వరైన మీరుచూచియున్నారా?

ఉభ—పలుమారు.

రాజు—(సహర్షముగ నాత్మగతముగ) మనోరథము పూర్ణముగ నెఱవేరినప్పుడు నేనెట్లభినందింపకుండెదను! (అని బాలునినాలింగనముఁ జేసికొనుచున్నాఁడు.)

ద్వితీ—సువ్రతా! రమ్ము నియమములఁబూనియున్న శకుంతల కీవృత్తాంతము నివేదింతము (అని యిద్దఱుమునిపుత్రికలు నిష్క్రమింతురు).

బాలు—నన్నువదలుము. నేనుమాయమ్మయొద్దకు నేగెదను.

రాజు—పుత్రకా! నాతోఁగలసియే నీతల్లికి సంతోషపెట్టఁగలవు.

బాలు—నాతండ్రి దుష్యంతుఁడుకదా! నీవుకాదు.

రాజు—(చిఱునగవుతో) ఈవివాదమే నాకునమ్మకమును బుట్టించుచున్నది.

(అంతట నేకవేణీధరయగు శకుంతల ప్రవేశించుచున్నది.)

శకుంతల—వికృతిసమయమునందుఁగూడ సర్వదమనుని యోషధిప్రకృతి నేదాల్చుటవినియు నాకు నాయదృష్టవిషయమున నాశ కలుగకున్నది. ఒకవేళ సానుమతిచెప్పినట్లు సంభవించియుండనోపు.

రాజు—(శకుంతలనుజూచి) ఆహా! పూజ్యురాలగు శకుంతలయిదిగో! ఈమె

గీ॥ చేలయుగ్మంబు మిగులమాసినదిగట్టి
మోమునియమములఁ గృశింపఁబుణ్యశీల
యేకవేణిదాల్చి దయావిహీనునన్నుఁ
గూర్చిచిరవిరహవ్రతమోర్చి సలుపు

శకుం—(పశ్చాత్తాపవివర్ణుఁడైన రాజునుజూచి) ఆర్యపుత్రునివలెలేఁడే! కృతరక్షామంగళుండగు నాపుత్రుని నిప్పుడు గాత్రసంసర్గముచేత మైల గానొనర్చుచున్ననితఁ "డెవ్వఁ" డో!

బాలు—(తల్లిదగ్గరకుఁబోయి) అమ్మా! ఈపురుషుఁడెవ్వఁడో పుత్రకాయని నన్నాలింగనముఁ జేసికొనుచున్నాఁడు.

రాజు—ప్రేయసీ! నీయందు నేఁ గనఁబఱచినది క్రౌర్యమే యైనను జివరకిది యనుకూలముగనే పరిణమించినది. ఇప్పుడు నన్ను నీవు గుఱుతించి నట్లు తోఁచుచున్నది.

శకుం—(ఆత్మగతముగ) హృదయమా! యూరడిల్లుమూరడిల్లుము. అసూయనువదలి దైవము నన్నను గ్రహించెను. ఈతఁ డార్యపుత్రుఁడేసుమా!

రాజు—ప్రేయసీ!

గీ. స్మృతినినామోహతమము నశించినంత
నెదుట*నిలిచితి సుముఖియదృష్టవశత
గ్రహణమవసానమును బొందరాజుతోడ
యోగమబ్బినరోహిణి యోజనివుడు.

శకుం—ఆర్యపుత్రా! జయము జయము. (అని సగముచెప్పి కన్నీటిచే గద్గదస్వరముపడి యూరకున్నది.)

రాజు—సుందరీ !

గీ. బాష్పరుద్ధమయ్యుజయ శబ్దంబు, నాకు
జయముసిద్ధించెఁ జుమ్ము సంస్కారరహిత
పాటలోష్ఠపుటమ్ము నీవదనమద్ది
నేనుగనుఁగొన్న కతమున మానవయన.

బాలుఁడు—అమ్మా! ఈతఁడెవఁడు?

శకుంతల—బిడ్డా! నీయదృష్టము నడుగుము.

రాజు—(శకుంతల పాదములకు నమస్కరించి)

చ. అతివ! తొలంగుతన్ మదినిరాకరణా ప్రియమింక నీకునా
మతిచెడఁగల్గెనప్పుడతి మాత్రపుమోహము, వృత్తులిట్టివే
యతితమసావృతాత్ములకు నొకఁ, శుభంబులయందునన్ శిరో
ర్పితకుసుమదామమంధుఁడు సరీసృపశంకఁబరి † త్యజించెదున్.

శకుం—ఆర్యపుత్రుఁడు లేచుగాక. ఆదినములందు నాపుణ్యమునకుఁ బ్రతిబంధకమగు పురాకృతకర్మము నిశ్చయముగఁ బంటకు వచ్చియుం

---

* తోఁచితి

† త్యజింపఁడె

దును. శాకున్న దయాళుఁడయ్యె, నార్యపుత్రుఁడు నాయెడల
సట్టు లేలవిరసముగఁ బ్రవర్తించును?

రాజు—(లేచుచున్నాఁడు.)

శకుం—తరువాత నార్యపుత్రుని దుఃఖభాగిని యెట్లు జ్ఞాపకమునకు
వచ్చినది?

రాజు—విషాదశల్యము లనూడదీసికొని తరువాత చెప్పెదను.

చ. మునుప టుపేక్షఁ జేసితిని మోహముచేతను దావకాధరం
బునునొగిలించు బాష్పకణముల్ మఱియీవదరాళపక్ష్మమం
దనువుగనిల్చుదానినిపుడైనను నశ్రువుఁజక్కనొత్తినే
ననుశయదుఃఖముల్ గడచినట్టిఁడన య్యెదసుందరీమణీ.

(అని యట్లుచేయుచున్నాఁడు.)

శకుం—(ఉంగరమునుజూచి) ఆర్యపుత్రా! ఇదియే యాయుంగరము.

రాజు—ఈ యంగుళీయ ప్రాప్తిచేత నేగదా (నీవిషయము) జ్ఞప్తికలిగినది.

శకుం—దీనిచే నెట్టికష్టము కలిగినది ! ఆర్యపుత్రునికి విశ్వాసముఁగలు
గింపఁదలఁచుకొనిన కాలమున నిది దుర్లభమయ్యెనుగదా !

రాజు—కావున ఋతుసంబంధసూచకమైన కుసుమమును లతయే
ధరించుగాక.

శకుం—నేనుదానిని విశ్వసింపను. ఆర్యపుత్రుఁడే దానిని ధరింపవలయును.

(అంతట మాతలి ప్రవేశించుచున్నాఁడు.)

మాతలి—అదృష్టవశమున నాయుష్మంతుఁడు ధర్మపత్నీ సమాగమము
చేతను, పుత్రముఖదర్శనముచేతను వర్ధిల్లుచున్నాఁడు.

రాజు—నామనోరథముస్వాదుఫలసంపన్నంబైనది. మాతలీ ! ఈ విషయ
మాఖండలునికిఁ దెలిసి యుండదేమో కదా.

మాతలి—(చిఱునవ్వుతో) దేవతలకుఁ బరోక్షమేమున్నది! మహానుభావుఁ
డగు మారీచుఁడు నీకిపుడు దర్శన మొసఁగును. ఆయుష్మంతుఁడు
దయచేయవలెను.

రాజు—శకుంతలా! కుమారుని దీసికొనుము. నిన్నుఁబురస్కరించుకొని,
నే నామహానుభావునిఁ జూడఁగోరుచున్నాను.

శకుం—ఆర్యపుత్రునితోఁ గూడ గురువుగారి సమీపమున కేగుటకు సిగ్గుపడుచున్నాను.

రాజు—అయిన, నభ్యుదయకాలమునందిది యాచరింపవలయును. రమ్ము రమ్ము.

(అందఱు వెళ్లుచున్నారు.)

(అంతట నదితికశ్యపు లేకాసనమునఁ గూర్చుండి ప్రవేశింతురు.)

మారీచుఁడు—(రాజునుజూచి) దాక్షాయణీ!

గీ. ఇతఁడు నీసుతునని మొనసేగుముందు
పరగు దుష్యంతుఁడన లోకభర్త యెవని
వింటనెల్ల పనులు నెఱవేరుచుంట
నాభరణమయ్యె హరికి వజ్రాయుధంబు.

అదితి—ఈతని యాకృతి మన్ననకుఁ దగిన మహిమఁగల్గి యున్నది.

మాతలి—ఆయుష్మంతుఁడా! దేవగురులిదె పుత్రప్రేమ సూచకములైన నేత్రములతోఁ దమవైపు చూచుచున్నారు. వారిసమీపము నకుఁబొమ్ము.

రాజు—మాతలీ!

ఉ. ద్వాదశమూర్తి భాస్కరనిదానముగా మునులెంద్రు దేని, నిం
కేదల యజ్ఞభాగగతి నిమ్ములఁగాంచెఁ ద్రిలోకనాథు, దా
మోదరుఁడు స్వాయంభవుఁడు నుద్భవమొందఁగ నాస్పదంబుగా
నేదియొనర్చె నొక్కతరమేయెడ బ్రహ్మకు దేనికల్లదే
గాదిద్వంద్వమియ్యది జగన్నుతదక్షమరీచిజాతముల్.

మాతలి—అవును.

రాజు—(సమీపించి) ఇంద్రుని యాజ్ఞానువర్తియగు దుష్యంతుఁడిదె మీ కిరువురకు నమస్కరించుచున్నాఁడు.

మారీ—వత్సా! చిరకాలము జీవింపుము. పృథివిని బాలింపుము.

అదితి—వత్సా! అప్రతిరథుఁడవుకమ్ము.

శకుం—కుమారునితోఁగూడ మీపాదములకు వందన మాచరించు చున్నాను.

మారీ—కుమారీ!

గీ. భర్త దేవేంద్రునంతటివాఁడు నీకు
నలజయంతసముండు నీయాత్మజుండు
అన్యమాశీస్సునీకు యోగ్యమ్ముగాదు
తల్లి పౌలోమియంతటి దానవగుము.

అదితి—బిడ్డా, భర్తవలన మన్ననఁబడయుము. తప్పక నీశిశువు దీర్ఘాయుష్మంతుఁడై యుభయకులములకుఁ బ్రమోదకారియగును. కూర్చుండుఁడు.

(అందఱు ప్రజాపతినిఁ బరివేష్టించి కూరుచుందురు.)

మారీచు—(ప్రత్యేకమొక్కొకరి నుద్దేశించి)

కం. ఈసాధ్వియా శకుంతల
యీసదపత్యంబు నీవదృష్టమునని యిటుల్
భాసిలు త్రితయము గూడుట
వాసిగ శ్రద్ధావిధులు వసించెగే యుటే.

రాజు—మహానుభావా, తమదర్శనమునకుఁ బూర్వమే యభిమతార్థసిద్ధియయ్యెను కనుక మీయనుగ్రహ మపూర్వమైనది. ఎట్లంటే.

ఆ.వె. ముందు పూవుపుట్టుఁ బొడమును ఫలమంత
మొదల మబ్బుపట్టు పిదపజలము
కార్యకారణముల క్రమమిట్టిన భవత్ప్ర
సాదమునకు ముందు సంపదలగు.

మాతలి—ప్రజాపతులిట్లే ప్రసన్నులగుచుందురు.

రాజు—మహాత్మా మీ! యాజ్ఞానువర్తినియగు నీశకుంతలను గాంధర్వవిధిచే వివాహమాడి కొంతకాలమునకుఁ బిదప బంధుజనులు తోడితేర నాసమీపమునకు నచ్చిన యీమెను స్మృతిశైథిల్యము వలన నిరాకరించి మీ సగోత్రీకుఁడైన కణ్వునికి నపచారమొనర్చితిని. అంగుళీయక దర్శనానంతరము నేనాతనిపుత్రినిఁ బరిణయమైనట్లు తెలిసికొంటిని. ఇదిచూడ మిక్కిలి చిత్రముగాఁ దోఁచుచున్నది.

ఆ.వె. ఎదురగోచరింప నేనుఁగుకాదని
యదియుఁజనఁగ సంశయముజనింప
నడుగులఁగని నమ్మునవల నావిధమయ్యె
నాకు వికృతియది మనమ్మునందు.

మారీచ—వత్సా! ఆత్మాపరాధశంకను వదలుము. సమ్మోహముకూడ నీయందుపపన్నముకాదు. వినుము.

రాజ—అవహితుఁడనై యున్నాను.

మారీచ—అప్సరస్తీర్థమునుండి మేనక దుఃఖవివశురాలగు శకుంతలను దీసికొని దాక్షాయణియొద్దకు వచ్చినపుడే 'దుర్వాసుని శాపము వలనఁబాప మీసహధర్మచారిణి నీచేనట్లు నిరాకరింపఁబడినది కాని వేరుకారణమునఁ గాదనియు, నంగుళీయకదర్శనముతో నీశాపము తీఱు'ననియు ధ్యానమువలనఁ దెలిసికొంటిని.

రాజ—(నిట్టూర్పుతో) ఈ యపవాదమునుండి విముక్తుఁడనైతిని.

శకుం—(స్వగతముగ) ఈశ్వరేచ్ఛ, ఆర్యపుత్రుఁడు నేననుకొన్నట్లు నిర్నిమిత్తముగ నన్నుఁబరిత్యజింపలేదు. నేను శపింపఁబడినట్లే నాకుజ్ఞప్తి లేదు. ఒకవేళ విరహముచే శూన్యహృదయనగు నాకాశాప విషయమే తెలిసియుండక పోవచ్చును. కావుననే కాబోలు నా సఖులిద్దఱును భర్తకంగుళీయకమును జూపింపుమని నా కాజ్ఞాపించిరి.

మారీ—కుమారీ! కృతకృత్యురాలవైతివి. సహధర్మచరునియెడ నీకుఁ గోపము సేయఁదగదు. చూడుము.

చ. పతిస్మృతిరోధరూక్షుఁడగు పట్టునశాపవశంబునన్ దిర
స్కృతవయితివ్పుడే గెదమ మింక ప్రభుత్వము నీకెపో మలా
హతనిఖిలప్రసాద ముకురాంతరమందున ఛాయగానరా
దతివిమలంబునందయిన నయ్యదియన్ సులభావకాశమా.

రాజ—తమరు సెలవిచ్చినట్లే.

మారీచ—వత్సా! నీపుత్రుఁడగు శాకుంతలేయునికి మేముజాతకర్మాది క్రియలు విధ్యుక్తముగ నొనర్చితిమి. అది నీ కంగీకారమేకదా.

రాజు—మహానుభావా! ఇందేకదా మావంశప్రతిష్ఠ.

మారీచు—అవును. వీనినే భావిచక్రవర్తిగాఁదెలిసికొమ్ము, చూడుము.

సీ. మిట్టపల్లములు లేనట్టిపథంబున
స్థిమితగతిని బోవుతేరినెక్కి-
యప్రతిరథుఁడౌచు నంభోనిధుల్దాఁటి
యేడుదీవులనొప్పు నీవసుంధ
రనుగెల్చి ముందునాశ్రమసత్త్వములనెల్ల
బలిమినిచ్చట పట్టిబాధపెట్టు
చుంకుట నీబాలకుండు సర్వదమనుఁ
డను నామధేయానవలరునిప్పు

ఆ. వె. డవనిచక్రమెల్ల న్యాయంబుగాఁ బరి
పాలనంబుఁ జేసి లీలభార
వాహకత్వగరిమ భరతుండనెడునాఖ్య
నితఁడు చెందు నవల నృపవరేణ్య.

రాజు—త్రికాలజ్ఞులగు తమచే నీబాలుఁడు జాతకర్మాది సంస్కారముల
నందియుండుట నట్టివాఁడగు ననియే, మేము కోరుచున్నాము.

అదితి—స్వామీ, కణ్వునికి నతనిపుత్రికాభీష్టసిద్ధిని గూర్చిన యావద్వృ
త్తాంతమునుఁజెప్పి పంపుదము. పుత్రికావాత్సల్యముగల మేనక
యిచ్చటనే పరిచర్యచేయుచున్నది.

శకుం—(ఆత్మగతముగ) నామనోరథము నీమహానుభావురాలే చెప్పినది.

మారీచు—తపఃప్రభావమువలన నామహానుభావునకు సర్వముపత్యక్షమే.

రాజు—కావుననే యమ్మహర్షి నన్నుగోపింపఁడయ్యెను.

మారీ—అయినను మనమాయనకుఁ ప్రియవార్తను దెలుపవలెను.
ఎవరక్కడ?

శిష్యు—(ప్రవేశించి) స్వామీ, ఇదెవచ్చితిని.

మారీ—గాలవా, ఇప్పుడే యాకాశమార్గమునఁబోయి "శాపముదీఱఁగా,
స్మృతిగలిగిన దుష్యంతునిచేఁ బుత్రవతియగు శకుంతల పరిగ్రహిం

వఁబడిన" దను సంతోషవార్తను గణ్యునితో నామాటలుగఁ
చెప్పుము.

శిష్యు—స్వామిగా రాజ్ఞాపించినట్లే (అని నిష్క్రమించును).

మారీ—వత్సా, నీవుకూడ భార్యాపుత్రులతో నీనెచ్చెలియగు నింద్రుని
రథంబెక్కి నీరాజధానికిఁ దరలిపొమ్ము.

రాజు—దేవర యాజ్ఞాపించినట్లే.

మారీ—మఱియు

చ. ధరణిపతీ, భవత్ప్రజకుఁ దా సురనాథుఁడు పూర్ణవృష్టియా
ధరవితతాధ్వరంబుల నొనర్చుచుఁ బ్రీతినిఁ గూర్పు నీవు నా
హరికిని, రెండులోకముల యభ్యుపవర్తిని శ్లాఘ్యమా వర
స్ఫురత్కృతులన్ మనుఁడీరు శుభంబుగ నూర్లయుగంబు లిర్వురున్.

రాజు—స్వామీ, యథాశక్తిగా శ్రేయస్సుఁ గూర్పఁ బ్రయత్నించెదను.

మారీ—వత్సా, మఱియు నీ కింకేమి ప్రియమాచరింతును.

రాజు—ఇంతకంటె నిష్టమగునది నాకు మఱియేమికలదు ? అయినను
దయచే నాకుఁ బ్రియము చేయఁగోరి యట్లు సెలవిచ్చితిరి. కావున
నా యీభరతవాక్యమగుఁగాక.

చ. హితము ప్రజాళికొనటు మహీశుఁడు వర్తిలుచుండు గావుతన్
శ్రుతమహనీయ సత్కృతులశోభన వాగ్గరిమించుతన్ ప్రస
న్నత గనుచున్ బునర్భవము నాకును బాపునుగాత నీలలో
హితుఁడు స్వయంభువుండు పరమేశుఁడు శక్తియుతుండు శంభుఁడున్.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది సప్తమాంకము.

—* సర్వము సమాప్తము. *—

ఓ మి తి శి వ మ్.